www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 22-9-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 158 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: పంచమి మ. 3.44 తదుపరి షష్ఠి; నక్షత్రం: కృత్తిక రా. 11.02 తదుపరి రోహిణి; వర్జ్యం: ఉ.11.49-1.18; దుర్ముహూర్తం: సా.4.31-5.19; అమృతఘడియలు: రా.8.47-10.17; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.07 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జమిలి ముసుగులో దేశాన్ని

కబళించే కుట్ర!

ఆధిపత్యం చెలాయించేందుకే బీజేపీ ప్రయత్నం



రవీంద్రభారతిలో జరిగిన సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ఆయన రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం

సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్న మోదీ సర్కారు

రాహుల్‌గాంధీపై కేంద్ర మంత్రి దారుణంగా మాట్లాడినా ప్రధాని మోదీ ఖండించలేదు

ఇలాంటి సమయంలో సీతారాం ఏచూరి లేకపోవడం దేశ రాజకీయాలకు తీరని లోటు

ఏచూరి సంస్మరణ సభలో సీఎం రేవంత్

నేతలు ఏ పార్టీ మారుతారో తెలియని రోజుల్లో విపక్షాల్ని కలిపిన ఘనత ఏచూరిది: కేటీఆర్

ప్రమాదంలో ప్రజాస్వామ్యం: బీవీ రాఘవులు

వేర్వేరు సమయాల్లో సభకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్, కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికల ముసుగులో దేశాన్ని కబళించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఎన్నికలను అడ్డుపెట్టుకొని దేశంలో ఆధిపత్యం చెలాయించాలనే కుట్ర చేస్తోందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సీపీఎం నిర్వహించిన ఆ పార్టీ దివంగత జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. బీజేపీ నుంచి రాష్ట్రాల హక్కులను

మిగతా 13వ పేజీలో...

వంద నియోజకవర్గాల్లో

ఐటీఐలు

స్కిల్ వర్సిటీ పరిధిలోకి ఏటీసీలు, ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు

మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా కోర్సుల్ని ప్రారంభించాలి

కార్మిక శాఖ సమీక్షలో సీఎం రేవంత్

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

13

టెండర్లు లేకుండానే

పాల సరఫరా!

విజయ డెయిరీపై విచారణకు సీఎం రేవంత్ ఆదేశం!

13

ముఖ్యమంత్రితో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం భేటీ

ఫార్మాసిటీ రద్దు కాలేదు

ఇప్పటికీ అమల్లోనే 2016 నాటి ఫార్మాసిటీ జీవో31

భూసేకరణ నోటిఫికేషన్ రద్దుపై అప్పీళ్ల దాఖలు

అవి ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి

హైకోర్టులో రెవెన్యూ ముఖ్యకార్యదర్శి అఫిడవిట్

13



స్వామివారితోనే జగన్ ఆటలు!

అరాచకానికి ఆది.. అంతం ఆయనే

ఆ పాపమే తిరుమల సేవలకు శాపం

తొలి నుంచీ డెయిరీల ద్వారానే టీటీడీకి నెయ్యి.. పవిత్రతా, రైతులకూ లబ్ధి

సేకరణకు కఠిన నిబంధనలు..

వాటిని బుట్టదాఖలు చేసిన జగన్

'నచ్చిన' కంపెనీలకు టెండరు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఏపీలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సహా ప్రముఖ దేవాలయాల అవసరాల కోసం నెయ్యిని 2011 వరకూ స్థానిక సహకార డెయిరీల నుంచి కొనుగోలు చేసేవారు. తిరుమల పవిత్రత, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్థానిక డెయిరీల నుంచి నాణ్యమైన నెయ్యిని సేకరించేవారు. దీనికోసం అప్పటి ప్రభుత్వం జీవో 418ను కూడా జారీచేసింది. ఈ ప్రక్రియను ఈ - ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా చేపట్టాలని అందులో స్పష్టంగా

మిగతా 12వ పేజీలో...

ఏడుకొండలవాడా.. క్షమించు

నేటినుంచి 11 రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్ష

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

12

నాణ్యమైన నెయ్యి ఇవ్వడానికి విజయ డెయిరీ సిద్ధం.. అవకాశమివ్వండి

టీటీడీకి తెలంగాణ పశుసంవర్ధక శాఖ లేఖ



కొత్త పలుకు

తిరుమల లడ్డూను కాపీ కొట్టాలని ప్రైవేటు వ్యక్తులే కాదు.. అనేక దేవాలయాలు కూడా ప్రయత్నించాయి. ఈ విషయంలో ఇంతవరకూ ఎవరూ సక్సెస్ కాలేదు. లడ్డూ ప్రసాదాన్ని ఎవరూ కాపీ చేయలేకపోవడం అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి మహత్యం అని శ్రీవారి భక్తులు విశ్వసిస్తారు. శతాబ్దాలుగా తన ప్రాశస్త్యం నిలుపుకొంటూ వచ్చిన లడ్డూను గత జగన్ రెడ్డి ప్రభుత్వం కాపీ కొట్టలేకపోయినా నాణ్యతను మాత్రం దెబ్బతీయగలిగింది.

జగన్.. మహా పాతకం!

ఇప్పుడు లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో కల్తీ జరిగిందని తేలింది. ఈ మహా పాతకానికి ఎవరు కారణం? జగన్ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన దిక్కుమాలిన రివర్స్ టెండరింగ్ విధానమే ఇందుకు కారణం.

నాణ్యమైన ఆవు నెయ్యిని పేరొందిన కంపెనీలు మార్కెట్‌లో కిలో 800 రూపాయల వరకు విక్రయిస్తుండగా టీటీడీ మాత్రం 400 కంటే తక్కువకు నెయ్యి టెండర్లను ఖరారు చేసింది. ఈ తప్పుడు నిర్ణయం కారణంగానే కల్తీ నెయ్యి సరఫరా అయింది.

క్రైస్తవ మతాన్ని ఆచరించే వైఎస్ కుటుంబంలోని మహిళలు తిరుమల కొండకు వెళ్లి దేవదేవుడిని దర్శించుకోవడానికి కూడా ఇష్టపడరు. తిరుమలను సొంత అవసరాలకు వాడుకోవడం కోసం జగన్ అండ్ కో బ్రహ్మాండమైన స్కెచ్ రూపొందించారు. జగన్ రెడ్డి సొంత పనులు చక్కబెట్టడానికి తిరుమలను వేదికగా మార్చుకున్నారు. దైవ దర్శనానికి వచ్చే ప్రముఖులకు వీఐపీ ఆతిథ్యం ఇచ్చి మంచి చేసుకొనేవారు. ఇటు జగన్ రెడ్డికీ, అటు ఆ ప్రముఖులకూ అనుసంధానకర్తగా మాజీ ఈవో ధర్మారెడ్డి వ్యవహరించేవారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర ఏజెన్సీల అధికారులు కొండకు వచ్చినప్పుడు ధర్మారెడ్డి చేసిన హడావిడి అంతా ఇంతా కాదు.

శ్రీవెంకటేశ్వరుడిపై భక్తితో కాకుండా ఆ దేవదేవుడిని సొంత అవసరాలకు వాడుకోవడానికి 10 నుంచి 20 కోట్లు చెల్లించైనా పాలక మండలి సభ్యులుగా నియమితులు కావడానికి కొందరు ప్రయత్నించారు. బోర్డు సభ్యుడిగా నియమిస్తామంటే 20 కోట్లు ఇవ్వడానికి కూడా సిద్ధం అనేవారు ఎందరో! గతంలో స్వామి వారిపై భక్తితో సేవ చేయడానికి బోర్డు సభ్యులుగా నియమితులు కావాలని కోరుకునేవారు. క్రమంగా టీటీడీ చైర్మన్ పదవి కూడా రాజకీయ పునరావాస కేంద్రంగా మారిపోయింది.

కల్తీ వ్యవహారం బయటపడగానే దేశ విదేశాలకు చెందిన భక్తులు మండిపడ్డారు. మొత్తం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలన్న డిమాండ్ పెరుగుతోంది. దేశ వ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలను గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం కూడా సీబీఐ విచారణకు వెంటనే అనుమతివ్వాలి.

పవిత్రతను కాపాడలేకపోయిన ప్రతి ఒక్కరినీ దోషులుగా నిర్ధారించాలి. మొత్తంగా టీటీడీని ప్రక్షాళన చేయాలి. దేవాలయాల్లో కొనుగోళ్లకు సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాల రూపకల్పనకు ఒక కమిటీని నియమించాలి.

ప్రస్తుతానికి హిందువుల దృష్టిలో జగన్ రెడ్డి దోషి.

4



దంచికొట్టిన వాన

హైదరాబాద్‌లో భారీ వర్షం

రోడ్లను ముంచేసిన వరద

భారీ ఎత్తున ట్రాఫిక్‌జాం

లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి పోటెత్తిన నీళ్లు

మరో 4 రోజుల పాటు భారీ వర్షాలు.. ఎల్లో అలర్ట్

12

చొరవ చూపండి

రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలువరించండి

మోదీని కోరిన అమెరికా అధ్యక్షుడు బైడెన్

భద్రత, సాంకేతికత, ఆర్థిక అంశాలపై ఇరువురు నేతల ద్వైపాక్షిక చర్చలు

ఇండో-పసిఫిక్ రీజియన్‌పైనా..

భారత్-అమెరికా బంధం దృఢమైనది: బైడెన్

2

తప్పుడు జవాబులిస్తే

చర్యలు తప్పవు

విచారణలో దాపరికం ఏముంది?

పరస్పర అంగీకారం ఏమిటి?

ఎవరి ఆదేశాలతో అఫిడవిట్ల దాఖలు?

నిర్మాణం పూర్తికాకుండానే బ్యాంకు గ్యారంటీల విడుదలా?

నీటి పారుదల అధికారులపై జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నల వర్షం

తప్పు జరిగింది.. క్షమించండి అంటూ ఓ అధికారి వేడుకోలు

పొరపాటు జరిగిందన్న మరో అధికారి

14



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుధీర్‌బాబు

గంజాయి స్మగ్లర్‌గా ఐఐటియన్

12

వ్యసనానికి బానిసై.. చదువుకు దూరం

మత్తుకు అలవాటుపడి స్మగ్లరైన మరో టెకీ

వీరి నుంచి కొన్న 22 మందిపై కేసులు

అన్నవరం నుంచి హైదరాబాద్‌కు రవాణా

నలుగురి అరెస్టు.. సరుకు స్వాధీనం

అమృత్‌లో అవినీతి నిరూపిస్తే

రాజీనామా!



నిరూపించకపోతే.. కేటీఆర్‌పై చట్టరీత్యా చర్యలు

రూ. 8,888 కోట్ల అవినీతి ఎక్కడో చర్చిద్దాం

పోలింగ్ ముందురోజు టెండర్లు తెరిచింది మీరు

3 కంపెనీలకు 4% అదనానికి కట్టబెట్టారు

మేం వచ్చాక రద్దుచేసి 2.44% తక్కువకే ఖరారు

సృజన్‌రెడ్డి రేవంత్‌కు సొంత బావమరిది కాదు

బీఆర్ఎస్ సొంత మనిషి, కందాళ అల్లుడు

కేటీఆర్‌పై రెవెన్యూ మంత్రి పొంగులేటి ధ్వజం

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అమృత్ పథకం నిధుల్లో రూ.8888 కోట్ల అవినీతి జరిగిందని కేటీఆర్ చేసిన ఆరోపణలను రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా ఖండించారు. కేటీఆర్ తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ ఆరోపణలు నిజమని తేలితే మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అబద్ధమని తేలితే కేటీఆర్ ఎమ్మెల్యే పదవికి స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తారా? అని సవాలు విసిరారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సచివాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కంటే తక్కువ అంచనాలతో కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లు పిలిచిందని చెప్పారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు ఎక్కడికైనా వస్తానని ప్రకటించారు. పరిపాలనా అనుమతి ఇచ్చిందే రూ.3516 కోట్లకు అని, పన్నులు, ఇతరత్రా కలిపినా రూ.5385 కోట్లు

మిగతా 13వ పేజీలో...

సీఎం బావమరిదికి

8,888 కోట్ల టెండర్!



కేంద్ర ప్రభుత్వ 'అమృత్' పథకంలో భారీ అక్రమాలు

అర్హతలు లేకపోయినా సృజన్‌రెడ్డి సంస్థకు కాంట్రాక్టు

కేంద్రం స్పందిస్తే రేవంత్‌రెడ్డి పదవి పోవడం ఖాయం

ఎన్నికల వేళ ఆర్ఆర్ ట్యాక్స్‌పై మోదీ వ్యాఖ్యలు.. మేం ఆధారాలతో చెప్తున్నాం

చర్యలు తీసుకోండి.. అది ఫోర్త్ సిటీ కాదు.. ఫోర్ బ్రదర్స్ సిటీ: కేటీఆర్

13

ఇకపై వారానికి ఒక్కసారే ఇన్సులిన్!

షుగర్ వ్యాధిగ్రస్తులకు శుభవార్త

» త్వరలో భారత్‌లోనూ అందుబాటులోకి..

» షుగర్ వైద్య నిపుణుడు ఎ.రామ్‌కుమార్

గుంటూరు(మెడికల్), సెప్టెంబరు 21: షుగర్ వ్యాధిగ్రస్తులకు ఇది శుభవార్తే. ఇకపై వారు నిత్యం ఇన్సులిన్ ఇంజక్షన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. వారానికి ఒక్కసారి ఇన్సులిన్ చేసుకొంటే సరిపోతుందని గుంటూరుకు చెందిన షుగర్ వైద్య నిపుణుడు డాక్టర్ ఎ.రామ్‌కుమార్ స్పష్టం చేశారు. స్పెయిన్ దేశంలోని మ్యాడ్రిడ్ నగరంలో యూరోపియన్ అసోసియేషన్ ఫర్ స్టడీ ఆఫ్ డయాబెటిస్ వార్షిక సదస్సు జరిగింది. ఈ సదస్సులో 30 దేశాల నుంచి 13000లకు పైగా డాక్టర్లు, వైద్య నిపుణులు పాల్గొన్నారు. సదస్సులో షుగర్ వ్యాధిలో నూతన చికిత్స విధానాలు, పరికరాలు గురించి చర్చించారు. సదస్సుకు హాజరైన రామ్‌కుమార్ శనివారం మీడియాతో మాట్లాడుతూ 'షుగర్ వ్యాధిగ్రస్తులు ఇప్పుడు బాసల్ ఇన్సులిన్, అంటే రోజుకోసారి ఇన్సులిన్ ఇంజక్షన్ తీసుకుంటుంటే, త్వరలో వారానికి ఒక్కసారి (ప్రతి ఆదివారం) తీసుకుంటే సరిపోతుంది. దీని పేరు ఏడబ్ల్యూఐక్యూఎల్‌ఐ. ఇది ప్రస్తుతం కొన్ని దేశాల్లో అందుబాటులో ఉంది. ఇది మన దేశానికి కూడా త్వరలో రావచ్చు. ఆహార నియంత్రణ పాటిస్తూ లో-క్యాలరీ డైట్ ద్వారా ఇది సాధించవచ్చు. బ్రిటన్‌కు చెందిన ప్రొఫెసర్ రాయ్ టేలర్ చేసిన పరిశోధనల్లో తేలింది' అని డాక్టర్ రామ్‌కుమార్ వెల్లడించారు.



స్పెయిన్‌లో డాక్టర్ రామ్‌కుమార్

గ్రీన్ కార్డుదారులకు శుభవార్త

చెల్లుబాటు కాలాన్ని 36 నెలలకు పొడిగించిన యూఎస్

వాషింగ్టన్, సెప్టెంబరు 21: చట్టబద్ధ శాశ్వత నివాస హోదాను సూచించే గ్రీన్ కార్డు చెల్లుబాటు కాలాన్ని పొడిగిస్తూ అమెరికా నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న 24 నెలల కాలాన్ని 36 నెలలకు పెంచింది. ఇది సెప్టెంబరు 10, 2024 నుంచి అమలులోకి వస్తుందని యూఎస్ ప్రకటించింది. ఇది గ్రీన్‌కార్డు దారులకు భారీగా ఊరట కలిగించే అంశం. చాలా వరకు గ్రీన్ కార్డులు 10 సంవత్సరాల కాలపరిమితితో జారీ చేస్తారు. షరతులతో కూడిన శాశ్వత నివాస గుర్తింపు అయితే రెండు సంవత్సరాల కాలపరిమితితో జారీ చేస్తారు. ఆ కాలపరిమితి ముగియడానికి ఆరు నెలల ముందు లేక ముగిసిన వెంటనే గ్రీన్‌కార్డుదారు రెన్యువల్ కోసం 'ఐ 90'ని దరఖాస్తు చేసుకోవాలి. సక్రమంగా ఈ దరఖాస్తును సమర్పించిన గ్రీన్‌కార్డుదారులందరికీ ఓ రశీదు జారీ చేస్తారు. ఆ రశీదు జారీ అయిన వారందరికీ మొన్నటి వరకూ ఆటోమేటిక్‌గా 24 నెలల అదనపు వాలిడిటీ లభించేది. ఇప్పుడు ఆ వాలిడిటీ కాలాన్ని 36 నెలలకు పొడిగించారు. ఈ రశీదు ఉన్నవారికి కొత్త గ్రీన్‌కార్డు వచ్చే వరకూ చట్టబద్ధ శాశ్వత నివాసదారునికి ఉండే అన్ని హక్కులూ సంక్రమిస్తాయి.

లోకం తీరు



ఢిల్లీ సీఎంగా ఆతిశీ ప్రమాణస్వీకారం

నూతన వైమానిక దళాధిపతిగా

ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: యుద్ధ విమాన పైలట్, 5000 గంటలు విమానాన్ని నడిపిన విశేష అనుభవం కలిగిన ఫైటర్ పైలట్ ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్‌ను నూతన వైమానిక దళాధిపతిగా ఎంపిక చేసినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుత భారత వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చతుర్వేది ఈ నెల 30 పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో 'ప్రస్తుతం వైస్ చీఫ్‌గా సేవలందిస్తున్న ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్, పీవీఎస్ఎం, ఏవీఎస్ఎంను ఎయిర్ చీఫ్ మార్షల్‌గా నియమిస్తున్నాం. ఈ నియామక ఉత్తర్వులు సెప్టెంబరు 30 మధ్యాహ్నం నుంచి అమలులోకి వస్తాయి' అని రక్షణ శాఖ ప్రకటించింది. గొప్ప వ్యూహకర్తగా పేరున్న ఎయిర్ మార్షల్ అమర్ సింగ్ గత జూలైలో జరిగిన ఓ బహిరంగ కార్యక్రమంలో మాట్లాడుతూ, 'రక్షణ రంగంలో స్వయం సమృద్ధి భావన దేశ రక్షణను పణంగా పెట్టకూడదు' అని వ్యాఖ్యానించారు.

ఏడు హైకోర్టులకు సీజేల నియామకం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: దేశంలోని ఏడు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను నియమిస్తూ శనివారం కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. జులై 11న చేసిన సిఫార్సుల్లో కొన్నింటిని సవరిస్తూ మంగళవారం సుప్రీం కోర్టు కొలీజియం నిర్ణయం తీసుకోవడంతో ఈ నియామకాలు జరిగాయి. ఇవికాకుండా హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్ర రావును ఝార్ఖండ్ హైకోర్టుకు బదిలీ చేసింది. జస్టిస్ రావును ఝార్ఖండ్ హైకోర్టు సీజేగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసినా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలోనే ఆయన బదిలీ జరిగింది. ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ అదే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ రాజీవ్ షక్దర్ హిమాచల్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పదోన్నతి పొందారు. ఇదే హైకోర్టుకు చెందిన జస్టిస్ సురేష్ కుమార్ కైత్ మధ్యప్రదేశ్ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. బాంబే హైకోర్టు జడ్జి జస్టిస్ నితిన్ మధుకర్ జమ్‌దార్ కేరళ హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపట్టనున్నారు. బాంబే హైకోర్టుకే చెందిన జస్టిస్ కె.ఆర్.శ్రీరాం మద్రాసు హైకోర్టు సీజేగా పదోన్నతి పొందారు. కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ ఇంద్ర ప్రసన్న మేఘాలయ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. జమ్మూ-కశ్మీర్-లద్దాఖ్ హైకోర్టు జడ్జి జస్టిస్ తాషి రబస్తాన్ అదే హైకోర్టులో సీజేగా విధులు నిర్వర్తించనున్నారు. ఆయన లద్దాఖ్ ప్రాంతానికి చెందిన తొలి ప్రధాన న్యాయమూర్తి కానుండడం విశేషం.

లోకాయుక్త ఎదుట యడియూరప్ప హాజరు

బెంగళూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): డీ నోటిఫికేషన్ వివాదంలో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప శనివారం లోకాయుక్త ఎదుట విచారణకు హాజరయ్యారు. సుమారు రెండు గంటలపాటు లోకాయుక్త ఆయనను విచారించింది. కేంద్రమంత్రి కుమారస్వామి, యడియూరప్ప డీ నోటిఫికేషన్ వివాదంలో నిందితులుగా ఉన్నారు. ఏ-1 నిందితుడు యడియూరప్పకు లోకాయుక్త సమన్లు జారీ చేయడంతో ఆయన విచారణకు వెళ్లారు. బెంగళూరు గంగానగర్‌లో ఎకరం భూమిని వ్యక్తి చెందిన వారి పేరిట అక్రమంగా డీ నోటిఫై చేసినట్లు కేసు నమోదైంది. 2007లో ముఖ్యమంత్రిగా కుమారస్వామి ఉన్న సమయంలో డీ నోటిఫికేషన్‌కు ప్రయత్నాలు జరిగాయి. ఆ తరువాత 2010లో యడియూరప్ప సీఎం అయ్యాక ఈ ప్రక్రియను ముగించారు. ఇదే వివాదంలో కేంద్రమంత్రి కుమారస్వామి పేరు ఉన్నా, ఆయనకు ఎటువంటి నోటీసులు అందలేదని సమాచారం.

యువతిని 30 ముక్కలు చేసి.. ఫ్రిజ్‌లో దాచి

బెంగళూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరు వయ్యాలికావల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణ హత్య జరిగింది. ఓ ఇంట్లో యువతిని హత్యచేసి 30 ముక్కలు చేసి ఫ్రిజ్‌లో దాచారు. ఈ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పదిరోజులకు ముందే హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. హతురాలి పేరు మహాలక్ష్మి అని సెంట్రల్ విభాగం ఏసీపీ సతీశ్ వెల్లడించారు. వేరే రాష్ట్రానికి చెందిన ఆమె ఇక్కడే స్థిరపడ్డారని, భర్తకు దూరమయ్యారని తెలిపారు. ఇంట్లో ఆమె ఒక్కరే నివసిస్తున్నారని తెలిపారు. రెండు రోజులుగా ఆమె ఇంటినుంచి దుర్వాసన వస్తుండడంతో అదే భవనంలో నివసించేవారు ఆమె బంధువులకు సమాచారం ఇచ్చారు. యువతి అక్క, తల్లి ఇంటికి వచ్చి తలుపులు బద్దలుకొట్టారు. ఫ్రిజ్‌ను తెరిచి చూసి హత్య జరిగినట్లు గుర్తించారు. ఇటీవల కొన్ని రోజులుగా ఆమెను పికప్, డ్రాప్ చేసేందుకు ఓ యువకుడు వచ్చేవాడని, అతడే దారుణానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నట్టు ఏసీపీ తెలిపారు.

ఫిష్ ప్లేట్లు తొలగించి రైలు ప్రమాదానికి కుట్ర

సూరత్, సెప్టెంబరు 21: గుజరాత్‌లో రైలును పట్టాలు తప్పించేందుకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చేసిన ప్రయత్నం లైన్‌మ్యాన్ అప్రమత్తత కారణంగా విఫలమయింది. శనివారం వేకువజామున సూరత్ జిల్లాలోని కోసంబ- కిమ్ స్టేషన్ల మధ్య రైలు పట్టాలను కలిపే ఫిష్‌ప్లేట్లను తొలగించడంతోపాటు, 40-50 బోల్టులను వదులు చేశారు. రెండు ఫిష్ ప్లేట్లను తొలగించి పక్కనున్న ట్రాక్‌పై పెట్టారు. తెల్లవారు జాము 5.30 గంటల సమయంలో దీన్ని గమనించిన లైన్‌మ్యాన్ అధికారులను అప్రమత్తం చేశాడు. ఇంజినీర్లు, సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసిన తరువాత రైళ్ల రాకపోకలు మొదలయ్యాయి.

ఔషధ కొనుగోళ్లలో సందీప్ ఘోష్ మోసాలు

» 42 రోజుల తర్వాత బెంగాల్‌లో జూడాల పాక్షిక హాజరు

కోల్‌కతా, సెప్టెంబరు 21: ఆర్జీకర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ ఔషధ కొనుగోళ్లలో భారీ అక్రమాలకు పాల్పడినట్లు సీబీఐ ఆరోపించింది. బయట ఏజెన్సీల నుంచి మందుల కొనుగోళ్లు జరిగినట్లు గుర్తించింది. బిడ్డర్ల ప్రక్రియలో నైపుణ్యాల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేయకుండా నిబంధనలను అడ్డగోలుగా ఉల్లంఘించినట్లు పేర్కొంది. చాలా సందర్భాల్లో తక్కువ ధరకు కోట్ చేయడంతో అర్హత లేని బిడ్డర్లకు టెండర్లను కేటాయించారని, దీనిని గుర్తించి ఆర్జీకర్ యంత్రాంగం అప్రమత్తం చేసినా ఘోష్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలుస్తోంది. కాగా 42 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత బెంగాల్‌లో జూనియర్ వైద్యులు ఆందోళనలను విరమించారు. శనివారం పాక్షికంగా విధులకు హాజరయ్యారు.

కేదార్‌నాథ్ నడక దారిలో కుంగిన భూమి

రుద్రప్రయాగ్, సెప్టెంబరు 21: కేదార్‌నాథ్ యాత్ర శనివారం తాత్కాలికంగా నిలిచిపోయింది. నడకదారిలోని జంగిల్ చట్టి ఆకస్మికంగా 10-15 మీటర్ల మేర భూమి కుంగి భారీ గొయ్యి ఏర్పడడంతో అధికార్లు యాత్రను నిలిపివేశారు. దాంతో కేదార్‌నాథ్ నుంచి తిరిగి వస్తున్న యాత్రికులు చిక్కుకుపోయారు. అప్రమత్తమైన అధికారులు వారిలో సుమారు 5,000 మందిని సురక్షితంగా తరలించారు. ఈ మార్గంలో నడవడం కష్టంగా మారడంతో వేలాది మంది యాత్రికులు తిరిగి కేదార్‌నాథ్ మందిరం వద్దకే వెళ్లిపోయారు. కేదార్‌నాథ్ వెళ్లే భక్తులు మాత్రం మార్గాన్ని పునరుద్ధరించే వరకు ఫాటా, గుప్తకాశీ, రుద్రప్రయాగ్, శ్రీనగర్‌ల్లోనే ఉండిపోవాలని అధికారులు సూచించారు. కేదార్‌నాథ్‌కు నిర్వహిస్తున్న హెలికాప్టర్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని వివరించారు.

చొరవ చూపండి

రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలువరించాలని మోదీని కోరిన బైడెన్


శనివారం విల్మింగ్టన్‌లో మోదీ, బైడెన్ ఆత్మీయ ఆలింగనం

వాషింగ్టన్, సెప్టెంబరు 21: రెండేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాల్సిన అవసరం ఉందని, దీనికి భారత్ చొరవ చూపాలని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కోరారు. మోదీ-బైడెన్ మధ్య శనివారం జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా.. ఇరువురు నేతలు పలు అంశాలపై మాట్లాడారు. బైడెన్ తన స్వస్థలం విల్మింగ్టన్(వాషింగ్టన్‌కు 170 కిలోమీటర్ల దూరం)లో క్వాడ్ నాయకుల భేటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అమెరికా కాలమానం ప్రకారం శనివారం ఉదయం ఫిలడెల్ఫియా చేరుకున్న భారత ప్రధాని మోదీకి.. భారతీయ-అమెరికన్ల నుంచి ఘన స్వాగతం లభించింది. అక్కడి నుంచి ఆయన నేరుగా విల్మింగ్టన్‌కు చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఆయనను ఆప్యాయంగా కౌగిలించుకుని, ఆహ్వానించారు. విల్మింగ్టన్‌లో క్వాడ్ నేతల సమావేశానికి ముందు.. మోదీ-బైడెన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని గురించి బైడెన్ ప్రస్తావించారు. యుద్ధాన్ని నిలువరించే అంశంపై భారత్ చొరవ తీసుకోవాలని ఆయన మోదీని కోరారు. ప్రధాని మోదీ కూడా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో తన ఇటీవలి భేటీ గురించి బైడెన్‌కు వివరించారు. ఇండో-పసిఫిక్ రీజియన్‌లో చైనా చర్యలపైనా ఇరువురు నేతలు చర్చించారని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలివాన్ వెల్లడించారు. ఇరువురు నేతలు భద్రత, సాంకేతికత, ఆర్థిక అంశాలపై చర్చించినట్లు తెలిపారు. భారత్ కొనుగోలు చేయనున్న 31 ప్రిడేటర్ డ్రోన్లపైనా ఒప్పందాలు కుదిరినట్లు సమాచారం. అంతరిక్ష రంగంలో సహకారం.. ఇతర అంశాలపైనా ఇరువురు నేతలు చర్చించారు. మోదీ కూడా తమ ద్వైపాక్షిక చర్చలు భారత పౌరులు, ప్రపంచ మేలు కోసం ఉద్దేశించినవని ఎక్స్‌లో పేర్కొన్నారు. సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు జరిగినట్లు తెలిపారు. కాగా.. ఆదివారం ఉదయం మోదీ న్యూయార్క్ చేరుకుంటారు. అక్కడ లాంగ్ ఐలాండ్‌లో 'మోదీ అండ్ యూఎస్' పేరుతో భారతీయ అమెరికన్లు నాసౌ వెటరన్స్ మెమోరియల్ కొలీజియంలో నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమానికి 14 వేల మంది హాజరవుతారని అంచనా. మోదీ తన అమెరికా పర్యటనలో భాగంగా సోమవారం ఐరాస సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. పలు అమెరికా సంస్థలు, కంపెనీలకు సీఈవోలుగా ఉన్న భారత సంతతి అమెరికన్లతో ఆయన సమావేశమై.. కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్ల రంగంపై చర్చించే అవకాశాలున్నాయి.

శ్వేతసౌధంలో ఖలిస్థానీ మద్దతుదారులు

అమెరికా జాతీయ భద్రతా మండలి ఆధ్వర్యంలో భేటీ

వాషింగ్టన్, సెప్టెంబరు 21: మోదీ అమెరికాలో అడుగుపెట్టే కొన్ని గంటల ముందే కీలక పరిణామం జరిగింది. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఖలిస్థానీ మద్దతుదారులు, సిక్కు వేర్పాటువాద నాయకులతో కీలక సమావేశం జరిపింది. అమెరికా జాతీయ భద్రతామండలి ఆధ్వర్యంలో తొలిసారి జరిగిన ఈ సమావేశానికి అమెరికన్ సిఖ్ కాకస్ కమిటీ వ్యవస్థాపకుడు ప్రీత్‌పాల్ సింగ్‌తో పాటు సిఖ్ అమెరికన్ లీగల్ డిఫెన్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫండ్ సభ్యులు, పలు సిక్కు సంఘాల నేతలు హాజరయ్యారు. అమెరికా పౌరుల రక్షణకు భరోసానిచ్చింది. అదే సమయంలో అమెరికా గడ్డపై ఇతర దేశాలు తమ పౌరులను లక్ష్యంగా చేసుకోనీయబోమని శ్వేతసౌధం స్పష్టం చేసింది. సమావేశం తర్వాత ప్రీత్‌పాల్ సింగ్ మాట్లాడుతూ అమెరికా ప్రభుత్వ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అమెరికా సిక్కులకు మరింత రక్షణ కల్పించాలని కోరామన్నారు. ఖలిస్థానీ వేర్పాటువాదులకు అమెరికా, కెనడా ఆశ్రయం కల్పిస్తున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో స్వయంగా అధ్యక్ష భవనం సాక్షిగా జరిగిన పరిణామాలు కలకలం రేపుతున్నాయి. కాగా, ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూ హత్యాయత్నం కేసులో అమెరికా జిల్లా కోర్ట్ భారత ప్రభుత్వానికి, దోభాల్‌కు సమన్లు జారీ చేసిన రోజుల వ్యవధిలోనే వైట్‌హౌస్‌లో ఈ సమావేశం నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

సోమవారం వరకు మోదీ బిజీ షెడ్యూల్

మూడు రోజుల పర్యటనలో మోదీ విల్మింగ్టన్‌లో క్వాడ్ సదస్సులో బైడెన్‌తో సమావేశమవుతారు. క్వాడ్ దేశాధినేతలను కలుసుకుంటారు. రెండో రోజున న్యూయార్క్ వెళ్లి పలువురు ప్రముఖ వ్యాపార, వాణిజ్యవేత్తలను కలుసుకుంటారు. అదే రోజున ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈనెల 23న ఐరాస జనరల్ అసెంబ్లీలో జరిగే సమ్మిట్ ఆఫ్ ద ఫ్యూచర్‌పై ప్రధాని ప్రసంగిస్తారు.

ఐఐటీహెచ్ ప్రొఫెసర్లకు ప్రపంచస్థాయి గుర్తింపు

టాప్ శాస్త్రవేత్తల జాబితా ప్రకటించిన స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ.. 23 మందికి చోటు

కంది, సెప్టెంబరు 21: సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరిశోధనలతో ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు ప్రపంచస్థాయి గుర్తింపు పొందారు. ప్రపంచస్థాయి శాస్త్రవేత్తలకు సంబంధించిన జాబితాను అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఎల్సెవియర్ సంస్థలు శనివారం విడుదల చేశాయి. అందులో ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు 23 మంది ఉన్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి ప్రొఫెసర్లను అభినందించారు. అధ్యాపకుల అత్యున్నత పరిశోధనల ప్రతిభ, వారి అంకితభావంతోనే ఇంతటి గౌరవప్రదమైన స్థానం దక్కిందని ఆయన కొనియాడారు. ఐఐటీ హైదరాబాద్ అధ్యాపకులు ప్రపంచస్థాయి శాస్త్రవేత్తలుగా గుర్తింపు పొందడం పట్ల ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్.మూర్తి హర్షం వ్యక్తం చేశారు.

పొగాకు వ్యతిరేక ప్రకటనలు

ఓటీటీల్లోనూ తప్పనిసరి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: ఓటీటీ ప్లాట్‌ఫాంలలో పొగాకు వ్యతిరేక ప్రకటనలను తప్పనిసరి చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రతిపాదించింది. సినిమా ఆరంభంలో, మధ్యలోనూ 30 సెకన్ల నిడివికి తగ్గకుండా పొగాకు, పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ ఆడియో, వీడియో ప్రకటనలు, 20 సెకన్ల నిడివితో బిల్‌బోర్డు లేదా నిశ్చల ప్రకటనలు ఉండాలని పేర్కొంది. ఓటీటీ వినియోగదారు ఆ ప్రకటనలను తప్పించడానికి వీలులేని విధంగా పొందుపరచాలని సూచించింది. సెప్టెంబరు 1, 2023 తరువాత సీబీఎఫ్‌సీ సర్టిఫికెట్ పొందిన ప్రతి సినిమాకూ పైన పేర్కొన్న ప్రకటనలను జత చేయాలని పేర్కొంది.

నా వ్యాఖ్యలపై దుష్ప్రచారం

» అమెరికాలో చేసిన వ్యాఖ్యలపై రాహుల్ స్పందన



న్యూఢిల్లీ/జమ్ము-బెంగళూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో సిక్కులను ఉద్దేశించిన చేసిన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించారు. అమెరికాలో తాను చేసిన వ్యాఖ్యలపై అధికార బీజేపీ అబద్ధాలు ప్రచారం చేస్తుందని, తన నోరు మూయించాలని అనుకుంటోందని శనివారం ఎక్స్ పోస్టులో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రతి సిక్కు, ప్రతి భారతీయుడూ.. నిర్భయంగా తన మతాన్ని ఆచరించే దేశం భారత్ కాకూడదా? నిజం వైపు నిలబడలేని బీజేపీ.. నా నోరు మూయించాలని అనుకుంటోంది. అమెరికాలో నేను చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ అబద్ధాలు ప్రచారం చేస్తోంది. దేశ, విదేశాల్లోని సిక్కు సోదరసోదరీమణులను నేను ఒక్కటే అడగాలనుకుంటున్నా. నేను చేసిన వ్యాఖ్యల్లో ఏమైనా తప్పు ఉందా?' అని రాహుల్ గాంధీ తన పోస్టులో అడిగారు. మరోవైపు, రాహుల్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని పలు సిక్కు సంఘాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. కాగా, రాహుల్‌గాంధీపై కర్ణాటక బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో బెంగళూరు హైగ్రౌండ్స్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. విదేశాలలో భారత్ పరువును మంటగలిపేలా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని, ప్రధాని మోదీ పట్ల అనుచితమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే అంశంపై బీజాపూర్, బెళగావి, బాగల్కోటెలలోనూ రాహుల్ గాంధీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జమిలి దేశానికే ముప్పు: కమల్‌హాసన్

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం దేశానికే ముప్పు కలిగిస్తుందని ప్రముఖ సినీ నటుడు, 'మక్కల్‌నీదిమయ్యం' పార్టీ అధినేత కమల్‌హాసన్ పేర్కొన్నారు. శనివారం చెన్నైలో జరిగిన పార్టీ ద్వితీయ సర్వసభ్యమండలి సమావేశం కమల్‌కే మళ్లీ పగ్గాలు అప్పగిస్తూ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా కమల్ మాట్లాడుతూ.. జమిలి ఎన్నికలు ఫెడరల్ రాజ్యాంగ విధానానికి వ్యతిరేకమని, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని అభిప్రాయపడ్డారు. తమిళుడు ప్రధాని కావాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా పార్టీ బలోపేతానికి ప్రతి శాసనసభ నియోజకవర్గంలోనూ 5 వేల మందిని సభ్యులుగా చేర్చాలని పార్టీ తీర్మానం చేసింది.

శ్రీలంక అధ్యక్ష ఎన్నిక ఫలితాలు నేడు!

కొలంబో, సెప్టెంబరు 21: శ్రీలంకలో శనివారం అధ్యక్ష ఎన్నికలు ముగిశాయి. ఉదయం 7 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. 13వేలకు పైగా పోలింగ్ కేంద్రాలలో మొత్తం 2.2 కోట్లకుపైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ 75 శాతం నమోదైందని ఎన్నికల ప్రధాన అధికారి తెలిపారు. పోలింగ్ ముగిసిన వెంటనే పోస్టల్ ఓట్లు, సాధారణ ఓట్ల లెక్కింపు చేపట్టినట్లు అధికారులు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 38 మంది అభ్యర్థులు పోటీ చేశారు. అయితే ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, జనతా విముక్తి పెరమున(జేవీపీ)కి చెందిన అనూర కుమార దిసనాయకే, సమగి జన బలవేగయ(ఎస్‌జేబీ) నాయకుడు సజిత్ ప్రేమదాస మధ్య త్రిముఖ పోరు నెలకొంది. ఫలితాలు ఆదివారం విడుదలయ్యే అవకాశం ఉంది. ఒపీనియన్ పోల్స్ ప్రకారం జేవీపీ నాయకుడు అనూర కుమారకే స్పష్టమైన మొగ్గు కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు.

ఢిల్లీ సీఎం పీఠంపై ఆతిశీ

ఆమెతో ప్రమాణం చేయించిన ఎల్జీ వీకే సక్సేనా.. ఢిల్లీ ముఖ్యమంత్రిగా అతిపిన్న వయస్కురాలు ఆమే

» ఢిల్లీకి 3వ మహిళా సీఎం.. దేశంలో 17వ మహిళా సీఎం

» ప్రమాణం తర్వాత కేజ్రీవాల్‌కు ఆతిశీ పాదాభివందనం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠంపై ఆతిశీ ఆసీనులయ్యారు. శనివారం, ఇక్కడ రాజ్‌నివాస్‌లో జరిగిన కార్యక్రమంలో ఎల్జీ వినయ్‌కుమార్ సక్సేనా అతిశీతో ప్రమాణం చేయించారు. ఆమెతో పాటు క్యాబినెట్ మంత్రులుగా సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, కైలాశ్ గెహ్లోత్, ఇమ్రాన్ హుస్సేన్, ముకేశ్ అహ్లావత్ ప్రమాణం చేశారు. మాజీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, ఆప్ నేతల కుటుంబసభ్యులు ఆతిశీ ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు. కార్యక్రమ అనంతరం కేజ్రీవాల్‌కు ఆతిశీ పాదాభివందనం చేశారు. ఆతిశీ సీఎంగా ప్రమాణం చేయడంతో ఢిల్లీలో వరుసగా నాలుగోసారి ఆప్ ప్రభుత్వం ఏర్పడినట్లయింది. మంత్రులకు శాఖలను కూడా ఆతిశీ కేటాయించారు. ఆమె తన వద్ద 13 శాఖలను అట్టిపెట్టుకున్నారు. రెవెన్యూ, ఆర్థికం, విద్య తదితర ముఖ్యమైన శాఖలు ఆమె పరిధిలోనే ఉన్నాయి. సౌరభ్ భరద్వాజ్‌కు 8 శాఖలు, గోపాల్ రాయ్‌కు 3 శాఖలు, కైలాశ్ గెహ్లోత్‌కు 5శాఖలు, ఇమ్రాన్ హుస్సేన్‌కు 2 శాఖలు, ముఖేశ్ అహ్లావత్‌కు 5 శాఖలను ఆమె కేటాయించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఆమె కొద్దికాలమే సీఎం పదవిలో ఉంటారు. ఢిల్లీ సీఎం పదవి చేపట్టిన ఎనిమిదో వ్యక్తి ఆతిశీ. ఆమె వయసు 42 ఏళ్లు. ఢిల్లీ సీఎం పీఠాన్ని అధిష్ఠించిన అతి పిన్న వయస్కురాలిగా ఆమె చరిత్ర సృష్టించారు. దేశంలో 17వ మహిళా ముఖ్యమంత్రిగా, ఢిల్లీకి మూడో మహిళా సీఎంగా రికార్డుల్లోకి ఎక్కారు.

కేజ్రీవాల్ ఢిల్లీ ముఖచిత్రాన్ని మార్చారు

గత పదేళ్లలో ఢిల్లీ ముఖచిత్రాన్ని మార్చిన ఘనత మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్‌ది అని ముఖ్యమంత్రి ఆతిశీ వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరి బాధను కేజ్రీవాల్ అర్థం చేసుకున్నారని, ప్రజలకు ఉచిత వైద్యం అందించడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల జీవితాలను మెరుగుపర్చడానికి కేజ్రీవాల్ కృషి చేశారని పేర్కొన్నారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆమె మీడియా సమావేశాన్ని నిర్వహించారు. సీఎంగా అవకాశమిచ్చినందుకు కేజ్రీవాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా బీజేపీ చేస్తున్న కుట్రలను సఫలం కానివ్వబోమని తెలిపారు. సీఎం పదవిలో కొనసాగకుండా ఆ పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయడం తనను బాధిస్తోందని తెలిపారు. వచ్చే ఏడాది ప్రారంభంలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో కేజ్రీవాల్‌ను సీఎంగా గెలిపించాలని ఢిల్లీ ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. బీజేపీ గెలిస్తే కుట్ర చేసి ఉచిత విద్యుత్తును నిలిపివేస్తుందని హెచ్చరించారు.

ఉక్రెయిన్ మహా దూకుడు!

» రష్యాపై మళ్లీ దాడి

మంటల్లో ఆయుధాగారాలు..!

కీవ్, సెప్టెంబరు 21: ఆయుధాగారాలే లక్ష్యంగా రష్యాపై విరుచుకుపడుతోంది ఉక్రెయిన్..! గత బుధవారం ట్వెర్ ప్రావిన్స్ తుర్పెట్ గ్రామంలో ఉన్న భారీ డిపోను ధ్వంసం చేసి కలకలం రేపింది..! శుక్రవారం మరోరెండో డిపోలను లక్ష్యంగా చేసుకుంది. ట్వెర్‌కు సమీపంలో, టిఖోరెట్స్క్ జిల్లా కమెన్నీలో ఉన్న ఆయుధాగారాలపై డ్రోన్లతో దాడికి దిగింది. ఇది ఉక్రెయిన్ సరిహద్దులో రష్యాకు చెందిన దక్షిణ క్రస్నోడర్ ప్రాంతంలో ఉంది. డ్రోన్ దాడి అనంతరం పేలుళ్లు రాత్రంతా కొనసాగాయని, భారీగా పొగ కమ్మేసిందని స్థానికులు తెలిపారు. స్థానిక గవర్నర్ కూడా ఉక్రెయిన్ దాడి ధ్రువీకరించారు. ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. రెండు డ్రోన్లను కూల్చివేశామని చెప్పారు. అయితే, ఒకదాని నుంచి పడిన పదార్థాలు పేలుడుకు కారణమయ్యాయని పేర్కొన్నారు. టిఖోరెట్స్క్ ఆయుధాగారాన్ని ధ్వంసం చేశామని ఉక్రెయిన్ వర్గాలు వెల్లడించాయి. అందులోనే పేలుడు జరిగినట్లు చెప్పాయి. కాగా, టిఖోరెట్స్క్‌లో ఉత్తర కొరియా సరఫరా చేసిన ఆయుధాలు ఉన్నట్లు గతంలో అమెరికా తెలిపింది. ఉత్తర రష్యా ట్వెర్ రీజియన్‌లోని ఒక్టియాబ్రిస్కీలో ఉన్న ఆయుధాగారమూ మంటల్లో చిక్కుకుంది. ఇది గత బుధవారం దాడి జరిగిన ట్రోపెట్స్‌కు అతి దగ్గరగా ఉండడం గమనార్హం. మరోవైపు భద్రతా కారణాల రీత్యా టెలిగ్రామ్ చానల్ వాడకాన్ని నిలిపివేయాలని ఉక్రెయిన్ నిర్ణయం తీసుకుంది. రష్యా నుంచి సైబర్ దాడుల ముప్పు తప్పించుకునేందుకు ఈ ఆలోచన చేసింది.

హమాస్, హిజ్బుల్లాపై ఇజ్రాయెల్ ముప్పేట దాడులు

టెల్‌అవీవ్, సెప్టెంబరు 21: హమాస్, హిజ్బుల్లా ఉగ్రవాదులే లక్ష్యంగా ఇజ్రాయెల్ శనివారం ముప్పేట దాడులు చేసింది. గాజాతో పాటు.. దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) వైమానిక దళం క్షిపణుల వర్షం కురిపించింది. శుక్రవారం బీరుట్‌లోని హిజ్బుల్లా ఉగ్రవాదులను టార్గెట్‌గా చేసుకున్న దాడుల్లో.. ఓ భవనం కుప్పకూలిన విషయం తెలిసిందే..! ఈ ఘటనలో మరణాలు 37కు చేరుకున్నాయని.. 68 మంది గాయపడ్డారని లెబనాన్ రవాణా మంత్రి అలీ హమీద్ తెలిపారు. అమెరికా రూ.58 కోట్ల(7 మిలియన్ డాలర్లు) రివార్డు ప్రకటించిన రద్వాన్ బ్రిగేడ్ కమాండర్ ఇబ్రహీం అఖిల్ కూడా మృతుల్లో ఉన్నారు. అటు దక్షిణ గాజాలో ఓ శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ జరిపిన బాంబింగ్‌లో 22 మంది మృతిచెందారు.

అసలు లబ్ధిదారు ఎవరు?

» అదానీ గ్రూప్ స్విస్ ఖాతాలను జల్లెడ పడుతున్న ఓఏజీ

» ది వైర్ కథనంలో వెల్లడి

బెర్న్ (స్విట్జర్లాండ్): అదానీ గ్రూప్‌నకు సంబంధించి ఇటీవల స్విట్జర్లాండ్ ఫెడరల్ క్రిమినల్ కోర్టు స్తంభింపచేసిన బ్యాంకు ఖాతాలను స్విస్ అటార్నీ జనరల్ ఆఫీస్ (ఓఏజీ) నిశితంగా పరిశీలిస్తోంది. ఈ వ్యవహారంలో అదానీ సోదరుల్లో ఒకరైన వినోద్ అదానీ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ ఓఏజీ మాత్రం తొందరపడటం లేదు. ఈ కేసు విచారణలో అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన మీదట చర్యలు తీసుకోవాలని ఓఏజీ భావిస్తున్నట్లు శుక్రవారం నాటి ది వైర్ ప్రత్యేక కథనం పేర్కొంది. ఈ వ్యవహారంలో మోదీ ప్రభుత్వం, మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఉదాసీనంగా వ్యవహరించినట్లుగా తాము ఉండబోమని ఓఏజీ అధికార వర్గాలు పేర్కొన్నట్లు ది వైర్ కథనం వెల్లడించింది. అంతేకాకుండా ప్రధానంగా ఈ వ్యవహారంలో లబ్ధి పొందిన వారి వివరాలను తేల్చే పనిలో సదరు కార్యాలయం విస్తృతంగా పనిచేస్తున్నట్లు తెలిపింది. మరోవైపు ఈ కేసులో నిధుల మళ్లింపునకు సంబంధించి ఆధారాలు లభించినట్లు కూడా తెలిసిందని కథనం పేర్కొంది. అయితే అదానీ ఖాతాలకు సంబంధించి స్విట్జర్లాండ్ క్రిమినల్ కోర్టు తీర్పు వెలువరించిన సమయంలో భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్ జెనీవా పర్యటనలో ఉండటం గమనార్హం. గత ఏడాది హిండెన్‌బర్గ్.. అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల దందాను బయటపెట్టిన సంగతి తెలిసిందే.

28న నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 28న ఒక రోజు రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం సచివాలయంలో సమీక్షించారు. ఆ రోజు ఉదయం రాష్ట్రపతి నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి హాజరవుతారని, సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్‌ను ప్రారంభిస్తారని సీఎస్ తెలిపారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

స్వశక్తి చీరలతో నేతన్నకు భరోసా

- మహిళా సంఘాల సభ్యులకు సంవత్సరానికి రెండేసి చీరలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- ఏటా 1.3 కోట్ల మేర చీరలకు ఆర్డర్ ఇచ్చే అవకాశం
- ఇప్పటికే పాఠశాల విద్యార్థుల యూనిఫాంకు ఆర్డర్

సిరిసిల్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్వశక్తి పొదుపు సంఘాల్లో ఉన్న 63 లక్షల మంది మహిళలకు ఏటా రెండు చీరల చొప్పున అందిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏటా కోటి వరకు బతుకమ్మ చీరలను సిరిసిల్లలోనే ఉత్పత్తి చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పించిన దాని ప్రకారం ఏటా 1.30కోట్ల వరకు చీరలు అవసరమవుతాయన్న అంచనాలున్నాయి. ఈ లెక్కన ఏటా 7-8 కోట్ల మీటర్ల వస్త్రం ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. అక్టోబరు మొదటి వారంలోనే టెస్కో ద్వారా ఆర్డర్లు ఇవ్వడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) నిధులను ఖర్చు చేయాలని భావిస్తోంది. చీరల తయారీకి డిజైన్లను ఇవ్వాలని నిఫ్ట్‌తోపాటు మరో రెండు సంస్థల నుంచి డిజైన్లను ఆహ్వానించింది. గతంలో బతుకమ్మ చీరలకు రూ.350కోట్ల వరకు ఖర్చు చేస్తే ఈ సారి అంతకంటే ఎక్కువ మొత్తంలో ఖర్చు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. దీంతో సిరిసిల్ల మరమగ్గాల కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పాతబకాయిలను విడతల వారీగా ప్రభుత్వం విడుదల చేస్తుండడంతో పరిశ్రమకు మంచి రోజులు వస్తున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఎనిమిది నెలలుగా ప్రభుత్వ ఆర్డర్లు రాకపోవడంతో పూర్తిస్థాయిలో మగ్గాలు నడవని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్యను మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నేత కేకే మహేందర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రావాల్సిన బతుకమ్మ చీరలు, ఇతర బకాయిలను కొంతమేరకు ప్రభుత్వం విడుదల చేసింది. అనంతరం విద్యార్థుల యూనిఫాం ఉత్పత్తి ఆర్డర్లతో మళ్లీ మగ్గం చప్పుళ్లు మొదలయ్యాయి. టెక్స్‌టైల్ పార్కుకు అదనంగా 49.94 లక్షల మీటర్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు ఇవ్వగా.. పూర్తయ్యే దశలో ఉన్నాయి.

విద్యుత్ సమస్య పరిష్కారమయ్యేనా?

ప్రభుత్వ ఆర్డర్లతో కోలుకుంటున్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను విద్యుత్ రాయితీ సమస్య వెంటాడుతూనే ఉంది. 2001లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు 50శాతం విద్యుత్ రాయితీని ప్రకటించింది. అప్పటి నుంచి రాయితీ కొనసాగుతోంది. కేటగిరీ-4 కింద యూనిట్‌కు రూ.4 ఉండగా... ఇందులో ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుంది. 10 హెచ్‌పీ విద్యుత్ వినియోగించుకునే వారికే ఇది వర్తింజేస్తున్నారు. ఆపైన సామర్థ్యంతో కొనసాగే మరమగ్గాల కార్ఖానాలు యూనిట్‌కు రూ.7.80 చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి ఈ సమస్యకు పరిష్కారం లభిస్తే ఉపయోగకరంగా ఉంటుందని వస్త్ర పరిశ్రమ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గుట్ట మీద భక్తులకు 200 గదులు!

- దాతల సహకారంతో నిర్మాణానికి ప్రతిపాదన
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన అధికారులు

యాదాద్రి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వస్తున్న భక్తులకు గుట్ట మీద.. వసతి పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండటంతో కొత్తగా 200 గదులను నిర్మించాలన్న ప్రతిపాదన ముందుకొచ్చింది. రాత్రి కొండపైనే బసచేసి, స్వామివారిని దర్శించుకునే భక్తుల కోసం వసతి గదులు నిర్మించాలన్న ప్రతిపాదనను దేవాదాయశాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం అనుమతించిన పక్షంలో దాతల సహకారంతో గదులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బాలాలయం స్థానంలో, శివాలయం వెనుక ప్రాంతంలో దాదాపు 200 వరకు గదులు నిర్మించే అవకాశం ఉంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే గుట్ట మీద భక్తుల బసకు శాశ్వత ఏర్పాటు చేసినట్లవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం, గుట్టపైన హరిత హోటల్ గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అవి పరిమితంగా ఉండటంతో భక్తులు కొండ కింద బస చేయాల్సి వస్తోంది. తెల్లవారు జామున స్వామివారి ఆర్జిత సేవల్లో పాల్గొనాలంటే.. కొండ కింది నుంచి పైకి రావాలి. అయితే, ఉదయం వేళ బస్సులు సమయానికి రాకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నింటికీ పరిష్కారంగా గుట్ట పైనే పెద్ద సంఖ్యలో గదులు ఏర్పాటు చేస్తే భక్తుల ఇక్కట్లు తీరుతాయి. ఆలయ అభివృద్ధి పనులతో పాటు భక్తులకు సౌకర్యాలపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో, సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. మరోవైపు, కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో రాయిగిరిలో 20 ఎకరాల్లో రూ.43 కోట్లతో వేదపాఠశాలను నిర్మించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. యాదగిరిగుట్టలో పూజా కార్యక్రమాలకు పూలు, తులసీదళాలను బయటి నుంచి కొనకుండా దేవాలయ భూముల్లోనే వాటి పెంపకాన్ని చేపట్టేలా చర్యలు తీసుకుంటోంది.

సత్రంలో నేలపైన కూర్చొని భోజనాలు

కొండ కింద నిర్మిస్తున్న అన్నదానసత్రం పనులు పూర్తి కాకపోవటంతో భక్తులు నేలపైన కూర్చొనే అన్నదాన ప్రసాదాలను స్వీకరిస్తున్నారు. ప్రభుత్వం రూ.కోటి కేటాయించినట్లయితే అన్నదానసత్రం పనులు పూర్తవుతాయని సమాచారం. మరోవైపు, పెద్దగుట్టపై దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో వైటీడీఏ అతిథిగృహాన్ని నిర్మించి రెండేళ్లయినా.. ఇంకా ప్రారంభించలేదు. రాయిగిరి చెరువు వద్ద ఏర్పాటు చేసిన శిల్పారామం పనులు తుదిదశలో నిలిచిపోయాయి. ఇక, యాదగిరిగుట్టలో రూ.34 కోట్లతో నిర్మించతలపెట్టిన ఈ ఫ్లైఓవర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

సంగారెడ్డి జిల్లాపై హైడ్రా నజర్!

ప్రభుత్వ భూముల్లో.. ఆక్రమణల పరిశీలన

పటాన్‌చెరు, సెప్టెంబరు 21: హైడ్రా.. సంగారెడ్డి జిల్లాపై దృష్టి సారించింది. జిల్లాలోని అమీన్‌పూర్ మండలంలో పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన భవనాలు, ఆక్రమణలను హైడ్రా బృందం శనివారం పరిశీలించింది. కిష్టారెడ్డిపేటలో దర్గా పక్కన ప్రభుత్వ స్థలంలో నిర్మించిన 3 భవనాలను పరిశీలించారు. పూర్తి సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. అనంతరం పటేల్‌గూడలోని సర్వే నం.12లో ఇళ్లను, ఐలాపూర్ గ్రామ పరిధిలోకి వచ్చే కోర్టు పరిధిలోని భూముల్లో అక్రమ నిర్మాణాలు జరిగినట్లు ఆరోపణలున్న భారీ అపార్ట్‌మెంట్లను, బీరంగూడ సంత పరిసరాల్లోని శంభునికుంటలోనూ ఆక్రమణలను పరిశీలించారు. చెరువు విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల హద్దులను గుర్తించారు.

ఇద్దరు బాలికలపై బాలుడి లైంగిక దాడి

తప్పించుకున్న మరో చిన్నారి..

భద్రాద్రి జిల్లాలో ఘటన

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 21: భద్రాద్రి జిల్లా ఇల్లెందులో ఘోరం జరిగింది. వ్యసనాలకు బానిసైన ఓ బాలుడు(17) ఆరేళ్ల వయస్సు కలిగిన ఇద్దరు బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుల పెద్దల పంచాయితీతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇల్లెందుకు చెందిన ముగ్గురు బాలికలు గురువారం మధ్యాహ్నం ఇళ్ల వద్ద ఆడుకుంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఓ బాలుడు(17) మాయమాటలు చెప్పి ఆ ముగ్గురిని ఓ ఇంట్లోకి తీసుకెళ్లి ఇద్దరిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తప్పించుకున్న మరో బాలిక ఈ దారుణాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. ఈ ఘటనపై కుల పెద్దలు అదేరోజు రాత్రి పంచాయితీ నిర్వహించారు. నిందితుడు, బాధితులు అంతాఒకే కులం వారు కావడంతో విషయం బయటకు పొక్కకూడదని తీర్మానించారు. ఎవరికైనా ఫిర్యాదు చేస్తే కుల బహిష్కరణ చేస్తామని బాధిత కుటుంబాలనే హెచ్చరించారు. కానీ, విషయం బయటికి రావడంతో ఐసీడీఎస్ అధికారులు శనివారం విచారణకు రాగా స్థానికులు సహకరించలేదు. కులపెద్దల హెచ్చరికలతో రెండ్రోజులు మౌనంగా ఉన్న బాధిత కుటుంబాలు ఇల్లెందు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాయి. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

జగన్.. మహా పాతకం!

తిరుమల లడ్డూను కాపీ కొట్టాలని ప్రైవేటు వ్యక్తులే కాదు.. అనేక దేవాలయాలు కూడా ప్రయత్నించాయి. ఈ విషయంలో ఇంతవరకూ ఎవరూ సక్సెస్ కాలేదు. లడ్డూ ప్రసాదాన్ని ఎవరూ కాపీ చేయలేకపోవడం అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి మహత్యం అని శ్రీవారి భక్తులు విశ్వసిస్తారు. శతాబ్దాలుగా తన ప్రాశస్త్యం నిలుపుకొంటూ వచ్చిన లడ్డూను గత జగన్‌రెడ్డి ప్రభుత్వం కాపీ కొట్టలేకపోయినా నాణ్యతను మాత్రం దెబ్బతీయగలిగింది. ఇటీవలి కాలంలో లడ్డూ నాణ్యత దారుణంగా పడిపోయింది. ఐదేళ్ల క్రితం తిరుమల నుంచి లడ్డూ తీసుకువచ్చి ఎవరికైనా ఇస్తే ఆ పరిసరాలు ఘుమ ఘుమలాడేవి. ఈ మధ్య కాలంలో ఆ ఘుమఘుమలు మాయమయ్యాయి. లడ్డూ కూడా ఎండిపోయినట్టుగా ఉంటోంది. ఇలా జరగడానికి తిరుమల తిరుపతి దేవస్థానం గత పాలక వర్గం నిర్వాకమే కారణం. నాసిరకం నెయ్యితో పాటు జీడిపప్పు, కిస్మిస్‌లు కూడా నాణ్యమైనవి వాడకపోవడంతో లడ్డూ తన రుచిని కోల్పోయింది. ఇప్పుడు లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో

> కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన వివరణ, చేస్తున్న వాదన పేలవంగా ఉంది. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీస్తుండటంతో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని తెరమీదకు తెచ్చారని ఆయన వాదిస్తున్నారు. రాజకీయాలకు దేవుడిని వాడటం ఏమిటి? అని బోలెడు ఆశ్చర్యపోయారు. 2019కి ముందు పింక్ డైమండ్ పేరిట చేసిన రాజకీయాన్ని జగన్‌రెడ్డి మరచిపోతే ఎలా? శ్రీవారికి భక్తులు ఎప్పటి నుంచో సమర్పించిన కానుకల్లోని విలువైన వాటిని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తస్కరించుకు పోయారని, వాటిని కరకట్టపై ఉన్న ఆయన నివాసంలో దాచిపెట్టారని ఎంపీ విజయసాయిరెడ్డి అప్పట్లో తీవ్ర ఆరోపణలు చేయలేదా? రమణదీక్షితులు వంటి వారు వంత పాడలేదా? ఇప్పుడు తత్వం బోధపడిన అదే రమణదీక్షితులు గత ఐదేళ్లుగా కొండపై జరిగిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని అంటున్నారు.

కల్తీ జరిగిందని తేలింది. ఈ మహా పాతకానికి ఎవరు కారణం? జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలులోకి తెచ్చిన దిక్కుమాలిన రివర్స్ టెండరింగ్ విధానమే ఇందుకు కారణం. తిరుమల తిరుపతి దేవస్థానం గత పాలక మండలి ఈ రివర్స్ టెండరింగ్ విధానం అమలు వల్ల రేటు తగ్గించిన నెయ్యి సరఫరాదారులు కల్తీ నెయ్యి సరఫరా చేశారు. నాణ్యమైన ఆవు నెయ్యిని పేరొందిన కంపెనీలు బహిరంగ మార్కెట్‌లో కిలో 800 రూపాయల వరకు విక్రయిస్తుండగా టీటీడీ పాలక మండలి మాత్రం రూ.400 కంటే తక్కువకు నెయ్యి టెండర్లను ఖరారు చేసింది. ఈ తప్పుడు నిర్ణయం కారణంగానే కల్తీ నెయ్యి సరఫరా అయింది. మహా ప్రసాదాన్ని కలుషితం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. ఆ దేవదేవుడికి అపచారం చేశారు. చీప్ అండ్ బెస్ట్ అన్న వాదన అర్థరహితం. నాణ్యమైన వస్తువు ఏదీ తక్కువ ధరకు లభించదు. ఈ చిన్న లాజిక్‌ను మిస్సయిన టీటీడీ గత పాలక మండలి రివర్స్ టెండరింగ్ విధానం అమలు చేసి భక్తుల మనోభావాలతో ఆడుకుంది. కల్తీ నెయ్యి సరఫరా చేసిన సంస్థ తొలుత కిలో నెయ్యికి 610 రూపాయలు కోట్ చేసింది. తర్వాత రివర్స్ టెండరింగ్‌లో పాల్గొని ఆ ధరను అమాంతం కిలోకు 424 రూపాయలకు తగ్గించింది. బుద్ధీ జ్ఞానం ఉండి ఉంటే అధికారులకు, పాలక మండలికి అప్పుడే అనుమానం రావాల్సింది. కానీ పట్టించుకోలేదు. భక్తుల సొమ్ముతోనే ప్రసాదాలకు అవసరమైన ముడి సరుకులను కొనుగోలు చేస్తారు. ఇందులో నాణ్యత విషయంలో రాజీపడి కొనుగోలు చేయాల్సిన అవసరం ఏమిటో గత పాలక మండలే చెప్పాలి. కొండ మీదకు వచ్చే నెయ్యి ట్యాంకర్లను నాణ్యత విషయంలో తనిఖీ చేసిన తర్వాతే అనుమతిస్తారని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటల్లో కూడా వాస్తవం లేదు. నెయ్యి కల్తీ జరిగిందా? లేదా? అని నిర్ధారించే ల్యాబ్‌లు తిరుపతిలో లేవు. అలాంటప్పుడు ప్రతి ట్యాంకర్‌ను ఎలా పరీక్షించారో జగన్‌రెడ్డి చెప్పాలి. వాస్తవానికి జగన్‌రెడ్డి కుటుంబానికి ఆ దేవదేవుడిపై నమ్మకం, విశ్వాసాలు లేవు. క్రైస్తవ మతాన్ని ఆచరించే వైఎస్ కుటుంబంలోని మహిళలు తిరుమల కొండకు వెళ్లి దేవదేవుడిని దర్శించుకోవడానికి కూడా ఇష్టపడరు. అయితే వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం దేశ వ్యాప్తంగా అనేక మంది ప్రముఖులు వస్తుంటారు. దీంతో తిరుమలను సొంత అవసరాలకు వాడుకోవడం కోసం జగన్ అండ్ కో బ్రహ్మాండమైన స్కెచ్ రూపొందించారు. జగన్ అధికారంలోకి రాగానే ధర్మారెడ్డిని టీటీడీ జేఈఓగా నియమించారు. తర్వాత ఆయననే ఈవోగా ప్రమోట్ చేశారు. అప్పటి నుంచి కొండపైన ధర్మారెడ్డి మాటే శాసనమైంది. జగన్‌రెడ్డి సొంత పనులు చక్కబెట్టడానికి తిరుమలను వేదికగా మార్చుకున్నారు. దైవ దర్శనానికి వచ్చే ప్రముఖులకు వీఐపీ ఆతిథ్యం ఇచ్చి మంచి చేసుకొనేవారు. ఇటు జగన్‌రెడ్డికీ, అటు ఆ ప్రముఖులకూ అనుసంధానకర్తగా ధర్మారెడ్డి వ్యవహరించేవారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర ఏజెన్సీల అధికారులు కొండకు వచ్చినప్పుడు ధర్మారెడ్డి చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. మధ్యలో ఢిల్లీ వెళ్లి ఆయా ప్రముఖులను కలుసుకొని తీర్థ ప్రసాదాలు అందజేసి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఇచ్చి రమ్మన్నారని చెప్పేవారు. ఈ విధంగా చేయడం ద్వారా జగన్‌రెడ్డి పట్ల ఆయా ప్రముఖులకు సాఫ్ట్ కార్నర్ ఏర్పడేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ మహా దేవుడిపై విశ్వాసంతో, భక్తితో వ్యయప్రయాసలకు ఓర్చి కొండపైకి చేరుకొనే భక్తులకు సౌకర్యాల కల్పనను గాలికొదిలేసి జగన్‌రెడ్డికి ఉపయోగపడతారనుకున్న ప్రముఖుల సేవలో తరించేవారు. నాటి పాలక మండలి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి.. అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కోసం ఆ దేవదేవుడిని ముడిసరుకుగా వాడుకున్నారు. జగన్ అధికారంలో ఉన్నంతకాలం ఢిల్లీలో వివిధ సంస్థల్లో పలుకుబడి కలిగిన ముగ్గురు నలుగురిని పాలక మండలి సభ్యులుగా నియమిస్తూ వచ్చారు. వీరంతా కలసి జగన్‌రెడ్డి వ్యవహారాలను చక్కబెట్టేవారు. 2019–2024 మధ్య కాలంలో కొండపైన జరిగింది ఇదే!

అవినీతి మకిలి!

గతంలో కొండ మీద అవినీతి ఎక్కువగా ఉండేది కాదు. దేవస్థానం సిబ్బంది కూడా స్వామివారిపై భక్తి, భయంతో ఉండేవారు. గత ఐదేళ్లుగా రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో శ్రీవారి సన్నిధిలో అవినీతి వేళ్లూనుకుంది. కమీషన్ల సంస్కృతి ప్రవేశించింది. పాలక మండలి సభ్యులు డమ్మీలుగా మారిపోయారు. అంతా వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి కనుసన్నల్లోనే జరిగింది. ఈ నేపథ్యంలోనే కల్తీ నెయ్యి బాగోతం చోటుచేసుకుంది. నాణ్యమైన నెయ్యి కావాలంటే తక్కువ ధరకు ఇవ్వలేమని క్రెడిబిలిటీ ఉన్న కంపెనీలు స్పష్టం చేసినప్పుడు ఎవడో వచ్చి తక్కువకు సరఫరా చేస్తామంటే ఒప్పుకోవడంలోనే గోల్‌మాల్ జరిగింది. కనీస పాపభీతి కూడా లేకుండా దేవుడిపైన నమ్మకంతో భక్తులు సమకూర్చిన సొమ్ముకే కన్నం వేశారు. కమీషన్ల పర్వానికి తెరలేపారు. పవర్ బ్రోకర్లు పుట్టుకొచ్చారు. ప్రముఖులకు దేవుడిపై ఉన్న భక్తిని ఆసరాగా చేసుకొని వ్యక్తిగత పలుకుబడి పెంచుకున్నారు. మొత్తంగా తిరుమలను కలుషితం చేశారు. ఈ క్రమంలో పాలక మండలిలో సభ్యులుగా నియమితులవడానికి పోటీ పెరిగిపోయింది. శ్రీవెంకటేశ్వరుడిపై భక్తితో కాకుండా ఆ దేవదేవుడిని సొంత అవసరాలకు వాడుకోవడానికి ఎంతైనా ఇచ్చి పాలక మండలి సభ్యులుగా నియమితులు కావడానికి కొందరు ప్రయత్నించారు. బోర్డు సభ్యుడిగా నియమిస్తామంటే 20 కోట్లు ఇవ్వడానికి కూడా సిద్ధం అనేవారు ఎందరో! గతంలో స్వామివారిపై భక్తితో సేవ చేయడానికి బోర్డు సభ్యులుగా నియమితులు కావాలని కోరుకునేవారు. క్రమంగా టీటీడీ చైర్మన్ పదవి కూడా రాజకీయ పునరావాస కేంద్రంగా మారిపోయింది. గత ఐదేళ్లలో పరిస్థితి మరింత వికటించింది. స్వామివారి సేవను విస్మరించి అప్పటి ముఖ్యమంత్రి సేవలో కింది నుంచి పై వరకూ తరించిపోయారు. తిరుమలకు ఉన్న విశిష్టతను మంటగలిపారు. టీటీడీలో పనిచేస్తున్న సిబ్బందిలో భయం, భక్తి సన్నగిల్లింది. అవినీతి స్వైర విహారం చేసింది. దేవుడి సన్నిధిలో అవినీతికి పాల్పడటం మహాపాతకం అన్న పాపభీతి కూడా లేకుండా పోయింది. తన సమక్షంలో జరుగుతున్న అరాచకాలను చూస్తూ కూడా ఆ దేవదేవుడు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. తిరుమల కొండ సర్వ పాపాలకూ వేదికగా మారిపోయినా అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు ఎవరినీ శిక్షించకపోవడం ఏమిటి? అన్న ప్రశ్న ఉత్పన్నమైంది. ఆ దేవదేవుడిని భక్తి, నమ్మకంతో కాకుండా స్వార్థం కోసం వాడుకున్నారు. ఇంత కాలానికి పాపం పండింది. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్టుగా కల్తీ నెయ్యితో ప్రసాదాలు చేయించే స్థాయికి దిగజారారు. ఈ దశలో నేను ఉన్నాను– అన్నీ చూస్తున్నాను అన్నట్టుగా ఆ దేవదేవుడే మేల్కొన్నాడు. ఆవు నెయ్యి కల్తీ జరిగిన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చెవిన పడేట్టు చేశాడు.



> జగన్ చెబుతున్నట్టు చంద్రబాబు పాలనపై ప్రజల్లో అసంతృప్తి నెలకొని ఉంటే తగిన సమయం కోసం వేచి ఉంటారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్‌రెడ్డిని ఎవరైనా ప్రశ్నించారా? నిలదీశారా? లేదే! ఎన్నికల వరకు ఆగి తమ తీర్పు ప్రకటించారు. వరదల్లో చిక్కుకున్న విజయవాడ ప్రజలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తన వయసును కూడా లెక్కచేయకుండా అహర్నిశలు కృషి చేయడాన్ని అందరూ ప్రశంసిస్తుండగా జగన్ అండ్ కోకు మాత్రం అక్కడ కూడా ప్రభుత్వ వైఫల్యమే కనిపిస్తోంది. ప్రభుత్వాల పనితీరుపై ఒక అంచనాకు రావడానికి కనీసం ఏడాది నుంచి రెండేళ్ల సమయాన్ని ప్రజలు తీసుకుంటారు. చంద్రబాబు ప్రభుత్వం జగన్‌రెడ్డికి నచ్చకపోయినా ఐదేళ్ల పాటు వేచి ఉండాల్సిందే కదా! తిరుమలలో అపచారం జరిగిందని ఆధారాలతో సహా వెల్లడైంది. ఉద్దేశపూర్వకంగా కల్తీ నెయ్యి కొనుగోలు చేసి ఉండకపోవచ్చు గానీ జరిగిన దానికి బాధ్యత తీసుకోవాలి. మార్కెట్ ధరతో పోల్చితే సగం ధరకే నెయ్యి సరఫరా చేస్తామన్న వారిని ఎలా నమ్మారు? ఇప్పుడు ఈ చర్యను సమర్థించుకుంటున్న జగన్‌రెడ్డి కానీ, వైవీ సుబ్బారెడ్డి కానీ తమ ఇంటి అవసరాలకు అంత తక్కువ ధరకు లభించే నెయ్యిని కొనుగోలు చేస్తారా?

కల్తీ వ్యవహారం బయటపడగానే దేశ విదేశాలకు చెందిన భక్తులు మండిపడ్డారు. ఆవు నెయ్యిలో పంది కొవ్వు నుంచి తీసిన నూనె కలిపారని నిర్ధారణ కావడంతో కేంద్ర ప్రభుత్వం కూడా ఉలిక్కిపడింది. ఇంతకాలంగా తాము జంతువుల కొవ్వుతో చేసిన నెయ్యితో తయారుచేయించిన లడ్డూలను తిన్నామా! అని భక్తులు తీవ్ర మానసిక ఆవేదన చెందారు. ఈ మహాపాతకానికి పాల్పడిన వారిని కఠినాతికఠినంగా శిక్షించాల్సిందే. మొత్తం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలన్న డిమాండ్ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలను గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం కూడా సీబీఐ విచారణకు వెంటనే అనుమతివ్వాలి. మార్కెట్ ధరలో సగం ధరకే నెయ్యి సరఫరా చేయడానికి ముందుకు వచ్చిన సంస్థలను అనుమానించకుండా వారికే టెండర్లను కట్టబెట్టిన వారందరినీ శిక్షించాలి. దేవుడిపై భక్తితో తాము సమర్పించే కానుకలను ఆదా చేయాల్సిందిగా భక్తులు ఎవరైనా కోరారా? తిరుమల లడ్డూ విశిష్టతను, పవిత్రతను కాపాడలేకపోయిన ప్రతి ఒక్కరినీ దోషులుగా నిర్ధారించాలి. మొత్తంగా తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ప్రక్షాళన చేయాలి. దేవాలయాల్లో కొనుగోళ్లకు సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాల రూపకల్పనకు ఒక కమిటీని నియమించాలి. ధర ఎక్కువైనా ప్రముఖ బ్రాండ్ కంపెనీల వస్తువులే మనం కొనుగోలు చేస్తాం కదా? అలాంటిది ఆ దేవ దేవుడి లడ్డూ ప్రసాదం తయారీ విషయంలో రాజీపడాల్సిన అవసరం ఏమిటి? ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారు? వారికి కలిగిన ప్రయోజనం ఏమిటో కూడా నిగ్గు తేల్చాలి. కల్తీ నెయ్యి సరఫరా చేసిన కంపెనీని బ్లాక్ లిస్ట్ చేస్తున్నామని ప్రస్తుత ఈవో శ్యామలరావు చెప్పారు. బ్లాక్ లిస్ట్ చేయడం ఏమిటి? భక్తుల మనోభావాలతో ఆడుకున్న ఆ కంపెనీ యజమానిని కఠినంగా శిక్షించాలి కదా? కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన వివరణ, చేస్తున్న వాదన పేలవంగా ఉంది. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీస్తుండటంతో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని తెరమీదకు తెచ్చారని ఆయన వాదిస్తున్నారు. రాజకీయాలకు దేవుడిని వాడటం ఏమిటి? అని బోలెడు ఆశ్చర్యపోయారు. 2019కి ముందు పింక్ డైమండ్ పేరిట చేసిన రాజకీయాన్ని జగన్‌రెడ్డి మరచిపోతే ఎలా? శ్రీవారికి భక్తులు ఎప్పటి నుంచో సమర్పించిన కానుకల్లోని విలువైన వాటిని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తస్కరించుకు పోయారని, వాటిని కరకట్టపై ఉన్న ఆయన నివాసంలో దాచి పెట్టారని ఎంపీ విజయసాయిరెడ్డి అప్పట్లో తీవ్ర ఆరోపణలు చేయలేదా? రమణదీక్షితులు వంటి వారు వంత పాడలేదా? ఇప్పుడు తత్వం బోధపడిన అదే రమణదీక్షితులు గత ఐదేళ్లుగా కొండపై జరిగిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని అంటున్నారు.

> తన పేరిట భక్తులకు అందజేసే లడ్డూ ప్రసాదాలను కల్తీ నెయ్యితో చేయించిన వారందరినీ ఏదో ఒక రూపంలో శిక్షించడానికి ఆ దేవదేవుడే పూనుకోవాలి. లేని పక్షంలో కొండ మీద కొలువైన శ్రీవెంకటేశ్వరుడిని కూడా అమ్మకానికి పెడతారు.

ఏ దేవుడు ఎంత పవర్‌ఫుల్?

మనుషుల్లో స్వార్థం పరాకాష్ఠకు చేరుకుంది. స్వార్థం కోసం దేవుళ్లను సృష్టించడం, ఆ దేవుళ్లను వాడుకోవడం అనాదిగా వస్తున్నదే. దేవుళ్లను మార్కెటింగ్ చేయడం కూడా మనుషుల స్వార్థ ఫలితమే. ఫలానా గుడిలోని దేవుడు చాలా పవర్‌ఫుల్ అని ప్రచారం చేయడం చూస్తున్నాం. దేవుడు ఫలానా చోటే ఎందుకు పవర్‌ఫుల్‌గా ఉంటాడు? దేవుడు సర్వాంతర్యామి అని కదా చెబుతారు? కొన్ని దేవాలయాలు వెలవెలబోతుంటాయి. మరికొన్ని దేవాలయాలు కళకళలాడుతుంటాయి. ఇదంతా మార్కెటింగ్ మహత్యమే. చిలుకూరు బాలాజీ దేవాలయాన్నే తీసుకుందాం. అక్కడకు వెళ్లే వారికి అమెరికా వీసాలు లభిస్తాయని ప్రచారం చేశారు. ఇంకేముందీ.. అమెరికాలో చదువుకోవాలనుకునేవారు, అక్కడ ఉద్యోగాలు చేయాలనుకొనేవారు చిలుకూరుకు క్యూ కట్టారు. వీసా దరఖాస్తులు ప్రాసెస్ చేయడం చిలుకూరు బాలాజీ టెంపుల్ పని కాదు కదా. మనుషుల బలహీనతలను సొమ్ము చేసుకోవడానికి వాడే ట్రిక్కులు ఇవన్నీ. దేవుడిని నిజంగానే నమ్మేవారు కొందరైతే వారి నమ్మకంతో వ్యాపారం చేయాలనుకొనేవారు ఎందరో! మనలో చాలా మందికి దేవుడిపై నిజంగా నమ్మకం ఉండదు. భయం కారణంగా ఎందుకైనా మంచిదని ఓ దండం పెట్టుకుంటారు. దేవుడి సన్నిధిలో తీర్థ ప్రసాదాలను పెట్టి ఆ తర్వాత వాటిని మనం ఆరగిస్తాం. దేవుడు నిజంగానే తనకు భక్తులు సమర్పించిన తీర్థ ప్రసాదాలను ఆరగిస్తే మనం ఇంత ఉదారంగా వాటిని సమర్పించుకుంటామా? దేవుళ్లు వాటిని తినబోరన్న నమ్మకంతోనే విగ్రహాల ముందు పెడతాం. దేవుడి పేరు చెప్పి మనమే అవన్నీ ఆరగిస్తాం. మనిషి స్వార్థానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి?

శిక్ష పడాల్సిందే!

హిందువుల ఓట్లు దూరం కాకూడదన్న కారణంగానే శ్రీవెంకటేశ్వర స్వామిపై నమ్మకం లేకపోయినా జగన్మోహన్‌రెడ్డి కానీ, ఆయన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కానీ తిరుమల వెళ్లేవారు. రాజశేఖర రెడ్డి భార్య శ్రీమతి విజయలక్ష్మి గానీ, జగన్‌రెడ్డి భార్య భారతి గానీ ఎన్నడూ తిరుమల వెళ్లలేదే! దేవాలయాలను సందర్శించకూడదని బైబిల్‌లో ఎక్కడా చెప్పలేదే! మతం ఏదైనా దేవుడు దేవుడే అని నమ్మాలి కదా? హిందువులలో సహజంగానే సహనం ఎక్కువ. అందుకే ఆ దేవదేవుడి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో చేశారని తెలిసినా మౌనంగా బాధపడ్డారు కానీ, అందుకు కారణమైన వారిని తరిమికొట్టే ప్రయత్నం చేయలేదు. అంతెందుకు, వినాయక నిమజ్జనం సందర్భంగా మద్యం తాగి నృత్యాలు చేస్తున్నా చూసి ఊరుకుంటున్నాం కదా! ఇలా మరే మతంలోనైనా జరగడాన్ని చూశామా? దేవుడైనా, దెయ్యమైనా మనుషులకు ఉపయోగపడేవరకే. మనుషులకు ఉపయోగపడకపోతే దేవుళ్లను కూడా పూజించరు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడిన విషయమై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో ఆవేదన ఎంత ఉందో రాజకీయం కూడా అంతే ఉంది. ఈ దెబ్బతో హిందువులు జగన్‌రెడ్డికి దూరమవుతారని ఆయన రాజకీయ ప్రత్యర్థులు భావిస్తున్నారు. ఈ కారణంగా ఈ వివాదం ఇప్పటిలో సమసిపోదు. హిందువుల మనోభావాలను గమనించిన కేంద్ర మంత్రులు ఈ సంఘటనపై సహజంగానే స్పందించారు. ప్రస్తుతానికి హిందువుల దృష్టిలో జగన్‌రెడ్డి దోషి. రివర్స్ టెండరింగ్ విధానమంటూ పోలవరం ప్రాజెక్టుకు ఏ గతి పట్టించారో చూశాం. ఇప్పుడు అదే రివర్స్ టెండరింగ్ విధానంతో తిరుమల మహా ప్రసాదాన్ని కూడా కలుషితం చేశారు. ఇందుకు తగిన మూల్యాన్ని జగన్‌రెడ్డి చెల్లించుకోక తప్పదు. చంద్రబాబు వంద రోజుల పాలన వైఫల్యాల పుట్ట అని జగన్ అండ్ కో ప్రచారం చేస్తున్నారు గానీ, ఈ లడ్డూ వ్యవహారం వెలుగులోకి రావడంతో రాజకీయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పైచేయి సాధించారు. ఐదేళ్లపాటు అధికారంలో కొనసాగడానికి కూటమి ప్రభుత్వం ఏర్పడింది. 175 మందికి గానూ 164 మంది ఎమ్మెల్యేలను ప్రజలు గెలిపించారు. అంత భారీ మెజారిటీతో ఏర్పడిన ప్రభుత్వానికి వంద రోజుల పాలన అంటూ మార్కులు వేయాలని అనుకోవడం ఏమిటి? జగన్ చెబుతున్నట్టు ప్రజల్లో అసంతృప్తి నెలకొని ఉంటే తగిన సమయం కోసం వేచి ఉంటారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్‌రెడ్డిని ఎవరైనా ప్రశ్నించారా? నిలదీశారా? లేదే! ఎన్నికల వరకు ఆగి తమ తీర్పు ప్రకటించారు. వరదల్లో చిక్కుకున్న విజయవాడ ప్రజలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తన వయసును కూడా లెక్కచేయకుండా అహర్నిశలు కృషి చేయడాన్ని అందరూ ప్రశంసిస్తుండగా జగన్ అండ్ కోకు మాత్రం అక్కడ కూడా ప్రభుత్వ వైఫల్యమే కనిపిస్తోంది. ప్రభుత్వాల పనితీరుపై ఒక అంచనాకు రావడానికి కనీసం ఏడాది నుంచి రెండేళ్ల సమయాన్ని ప్రజలు తీసుకుంటారు. చంద్రబాబు ప్రభుత్వం జగన్‌రెడ్డికి నచ్చకపోయినా ఐదేళ్ల పాటు వేచి ఉండాల్సిందే కదా! జగన్‌రెడ్డి అరాచక పాలనను ప్రజలు ఐదేళ్లపాటు భరించారు కదా! తిరుమలలో అపచారం జరిగిందని ఆధారాలతో సహా వెల్లడైంది. ఉద్దేశపూర్వకంగా కల్తీ నెయ్యి కొనుగోలు చేసి ఉండకపోవచ్చు గానీ జరిగిన దానికి బాధ్యత తీసుకోవాలి. మార్కెట్ ధరతో పోల్చితే సగం ధరకే నెయ్యి

> కల్తీ నెయ్యి సరఫరా చేసిన సంస్థ తొలుత కిలో నెయ్యికి 610 రూపాయలు కోట్ చేసింది. తర్వాత రివర్స్ టెండరింగ్‌లో పాల్గొని ఆ ధరను అమాంతం కిలోకు 424 రూపాయలకు తగ్గించింది. బుద్ధీ జ్ఞానం ఉండి ఉంటే అధికారులకు, పాలక మండలికి అప్పుడే అనుమానం రావాల్సింది. కానీ పట్టించుకోలేదు. భక్తుల సొమ్ముతోనే ప్రసాదాలకు అవసరమైన ముడి సరుకులను కొనుగోలు చేస్తారు. ఇందులో నాణ్యత విషయంలో రాజీపడి కొనుగోలు చేయాల్సిన అవసరం ఏమిటో గత పాలక మండలే చెప్పాలి. కొండ మీదకు వచ్చే నెయ్యి ట్యాంకర్లను నాణ్యత విషయంలో తనిఖీ చేసిన తర్వాతే అనుమతిస్తారని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటల్లో కూడా వాస్తవం లేదు. నెయ్యి కల్తీ జరిగిందా? లేదా? అని నిర్ధారించే ల్యాబ్‌లు తిరుపతిలో లేవు. అలాంటప్పుడు ప్రతి ట్యాంకర్‌ను ఎలా పరీక్షించారో జగన్‌రెడ్డి చెప్పాలి.

సరఫరా చేస్తామన్న వారిని ఎలా నమ్మారు? ఇప్పుడు ఈ చర్యను సమర్థించుకుంటున్న జగన్‌రెడ్డి కానీ, వైవీ సుబ్బారెడ్డి కానీ తమ ఇంటి అవసరాలకు అంత తక్కువ ధరకు లభించే నెయ్యిని కొనుగోలు చేస్తారా? దేవుడనేవాడు ఉంటే తిరుమల కొండపై తప్పు చేసిన వారికి ఏదో ఒక రూపంలో శిక్ష పడుతుంది. లేని పక్షంలో దేవుడిపై భక్తి సంగతి అటుంచి కనీసం భయం కూడా లేకుండా పోతుంది. అదే జరిగితే మనుషులు మరింత విశృంఖలంగా వ్యవహరిస్తారు. భగవంతుడికి, భక్తుడికి మధ్య అనుసంధానంగా ఉండేది నమ్మకం. తనపై భక్తులకు ఉండే నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత భగవంతుడిదే. తన పేరిట భక్తులకు అందజేసే లడ్డూ ప్రసాదాలను కల్తీ నెయ్యితో చేయించిన వారందరినీ ఏదో ఒక రూపంలో శిక్షించడానికి ఆ దేవదేవుడే పూనుకోవాలి. లేని పక్షంలో కొండ మీద కొలువైన శ్రీవెంకటేశ్వరుడిని కూడా అమ్మకానికి పెడతారు. చూద్దాం.. ఈ వివాదం ఎన్ని మలుపులు తిరుగుతుందో? చివరకు ముగింపు ఎలా ఉండబోతున్నదో? దోషులకు ఏదో విధంగా శిక్ష పడితే గానీ భక్తులకు నమ్మకం పెరగదు.. కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరుడు ఇవన్నీ వినకుండా, చూడకుండా ఉంటాడా!

ఫ్రాయిడ్‌ను విస్మరించిన మార్క్సిస్టులు

కార్ల్ మార్క్స్ 1835లో హైస్కూల్ విద్య పూర్తి చేశాడు. ఆ రోజుల్లో జర్మనీలో స్కూలు విద్య ముగిసేనాటికి విద్యార్థులు ఒక వ్యాసం సమర్పించవలసి ఉంది. జీవితంలోకి ప్రవేశించనున్న యువకుడు వృత్తిని ఎంచుకోవడంపై మార్క్స్ వ్యాసం సమర్పించాడు. వృత్తిని యాదృచ్ఛికతకు వదిలిపెట్టకుండా ఎవరికి వారు ఎంపిక చేసుకోవడం అవసరమని యువ మార్క్స్ స్పష్టం చేశాడు. సమాజ సంక్షేమం, వ్యక్తిగత ఔన్నత్యం ఉండే వృత్తిని ఎంచుకోవడం అవసరం అని మార్క్స్ భావించాడు. వ్యక్తిగత వికాసానికి, సమాజ అభివృద్ధికి దోహదం చేసే వృత్తినే ఆయన ఎంచుకొని కొనసాగించాడు. ఈ లక్ష్యసాధనకు ఆయన విస్తృతంగా అధ్యయనం చేశాడు. పదార్థం ముందా ఆలోచన ముందా అనే చర్చను ముగించి మార్క్స్ తత్వశాస్త్రంలో విప్లవం తెచ్చాడు. చారిత్రక గమనానికి ఆలోచనలు ముందా, లేక భౌతిక పరిస్థితులు ముందా అనే ప్రశ్నకు, ఆలోచనలు, భౌతిక పరిస్థితులు ఒకేసారి తారసపడినప్పుడు మాత్రమే కార్యకలాపాలు సాగుతాయని మార్క్స్ జవాబిచ్చాడు. దీనితో తత్వశాస్త్రం కొత్తమలుపు తిరిగింది. మార్క్స్ మొదటిసారిగా 1844 రాతప్రతులలో తన భౌతిక వాదాన్ని స్పష్టంగా చెప్పాడు. మానవుడు తనకు తానే దూరమైపోతున్నాడని, ఈ పరిస్థితి నుంచి విముక్తి పొందడానికి విప్లవాత్మక కార్యాచరణ మాత్రమే దోహదం చేస్తుందని రాతప్రతులలో ఆయన సవివరంగా తెలియజేశాడు.

పితృస్వామ్యం, సొంత ఆస్తి విధానం, వైవాహిక వ్యవస్థ దాదాపు ఒకేసారి ఆవిర్భవించాయి. సొంత ఆస్తి కారణంగా మనిషి ఆత్మను కోల్పోతున్నాడనే ఎలియనేషన్ (పరాయీకరణ) ప్రక్రియను ఆయన వివరించాడు. ఈ ప్రక్రియ పెట్టుబడిదారీ విధానంలో పరాకాష్ఠకు చేరుకొని, మనిషి ఛిద్రమయ్యే పరిస్థితులు దాపురించాయని మార్క్స్ విపులీకరించాడు. తాము చేసిన ఉత్పత్తులను తామే మార్కెట్లో కొనుగోలు చేయవలసి వచ్చినప్పుడు అవి శత్రువుల మాదిరిగా ఎదురవుతాయి. ఉత్పత్తులు పెరిగినకొద్దీ ఈ పరాయీకరణ పెరుగుతూనే ఉంటుంది. సృజనాత్మక శ్రమ చేయడం మానవ నైజం కానీ పెట్టుబడిదారీ సంబంధాలలో శ్రామికుడు తన ఉత్పత్తులకు తానే పరాయిగా మారిపోవడమే కాకుండా, ఉపాధి కోసం శ్రామికుల మధ్య పోటీ కారణంగా ఒకరినొకరు ద్వేషించుకునే పరిస్థితి ఏర్పడుతున్నది. మనిషి సహజ లక్షణమైన సహకారం కూడా మరచిపోతున్నాడు. ఈ క్రమంలో చారిత్రకంగా వచ్చే సృజనాత్మక శక్తిని కూడా కోల్పోతున్నాడు. మొత్తం మీద ఆత్మనే కోల్పోతున్నాడు (సెల్ఫ్ ఎలియనేషన్). కమ్యూనిస్టు, లేదా సోషలిస్టు విప్లవం ద్వారా ఆత్మను తిరిగి స్వీకరించగలగాలని ఆయన తెలిపారు.

ఈ పరాయీకరణ జనిత రుగ్మతల కారణంగా మానవుడు ఎటువంటి మానసిక పరిస్థితులలో చిక్కుకుంటున్నాడనేది మార్క్స్ సవివరంగా తెలియజేశాడు. మార్క్స్ మరణించిన తరువాత దాదాపు 30 సంవత్సరాలకు ఫ్రాయిడ్ మనో విశ్లేషణకు మార్గం ఏర్పరిచాడు. దీనితో చైతన్యం, కార్మిక వర్గ చైతన్యం వంటి మాటలను అర్థం చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది. ఫ్రాయిడ్‌ను మార్క్సిస్టులు తిరస్కరించినందువల్ల వివిధ సమాజాలను, ఉద్యమాలను మానసిక శాస్త్రపరంగా అర్థం చేసుకోవడానికి వీలు కాలేదు. అందువల్ల కమ్యూనిస్టు ఉద్యమానికి పెద్ద ఎత్తున నష్టం జరిగింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మార్క్సిజం – లెనినిజం అధిపతి రైజానోవ్ పోర్చుగల్‌లోని పురా భాండాగారంలో ఈ రాతప్రతులను కనుగొన్నాడు. ఆనాడు

> నిత్యజీవితంలో ఎదురయ్యే హింస, దేశాల మధ్య యుద్ధాలు వ్యక్తుల భావావేశాలు ద్వేషంలో కూరుకుపోతున్నందువల్ల సంభవిస్తున్నాయి. వివక్షలతో కూడిన కుల వ్యవస్థ ప్రభావిత వ్యక్తిత్వ నిర్మాణాలను అర్థం చేసుకొని ఆ సామాజిక దురాచారాన్ని నిర్మూలించాలి. ముందుగా పిల్లల పెంపకంలో ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

ప్రచారంలో ఉన్న సోషలిజం, శాస్త్రీయ ఆలోచన విధానం అనేవి రాతప్రతులలోని భావనలకు విరుద్ధంగా ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ రైజానోవ్‌ను సైబీరియాకు ప్రవాసం పంపారు. ఆయన అక్కడే మరణించాడు. 1932లో ఈ రాతప్రతులను ప్రచురించారు. కానీ 1929లోనే రష్యాలో 'ఒక దేశంలో సోషలిజం' నినాదం రూపొందించారు ఈ ఆలోచన విధానానికి, అదేవిధంగా సోషలిజం భావనకు రాతప్రతులలోని ఈ భావనలకు చాలా తేడా ఉంది.

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో ముందుగా విప్లవాలు వస్తాయని మార్క్స్ భావించాడు. 1917లో రష్యన్ విప్లవం తరువాత అభివృద్ధి చెందిన దేశాలవంతు వస్తుందని లెనిన్ ఎంతగానో ఎదురుచూశాడు. పెద్ద ఎత్తున లెనిన్ దీని కోసం కృషి చేశాడు. ఫలితం లేనందువల్ల నూతన ఆర్థిక విధానంతో (ఎన్.ఇ.పి.) రాజ్యమే పెట్టుబడులను నిర్మించుకోవాలని, స్టేట్ క్యాపిటలిజం ఏర్పాటు తప్పదని లెనిన్ నిర్ణయించాడు. దీనికి సోషలిజం అని పేరు పెట్టి మార్క్స్ ప్రతిపాదించిన మౌలిక అంశాలన్నిటిని నమ్మకాలుగా మార్చి, కమ్యూనిస్టు పార్టీలను మతాల స్థాయికి దిగజార్చారు. ఈ క్రమంలో ఆ మౌలికాంశాలను అనేక రకాలుగా వక్రీకరించారు. వాటిలో ప్రధానమైనవి: 1. సమాజాన్ని అర్థం చేసుకోవటానికి ఆర్థిక పరిస్థితులు మాత్రమే నిర్ణయాత్మకం కాదని ఇతర అనేక పరిస్థితులు దోహదం చేస్తాయని మార్క్స్, ఏంగెల్స్ అనేకసార్లు హెచ్చరించినప్పటికీ ఆర్థిక నియతివాదం మార్క్సిజంగా చలామణిలోకి వచ్చింది; 2. పునాదులుగా పరిగణిస్తున్న ఆర్థిక పరిస్థితులు మారుతున్నప్పుడు ఉపరితలంలో కూడా మార్పులు వస్తాయని మార్క్సిస్టులు ప్రచారం చేశారు. అయితే పునాదులు మారకుండా రష్యాలో సోషలిజం స్థాపించినట్టు చెప్పడానికి ప్రయత్నించడం హేతువిరుద్ధం; 3. మార్క్సిస్టులు కమ్యూనిస్టు ప్రణాళిక మొదటి వాక్యాన్ని పూర్తిగా వక్రీకరించారు. ఇప్పటివరకు



తెలిసిన చరిత్ర అనే నోట్ గమనించకుండా ప్రపంచ చరిత్ర మొత్తం వర్గ పోరాటాల చరిత్రగా నిర్ధారించారు. పితృస్వామ్యానికి ముందున్న మాతృస్వామ్యం తదితర వ్యవస్థలలో వర్గాలు లేవనేది వారు గ్రహించలేదు; 4. చారిత్రక నియమాలను, చారిత్రక అనివార్యతను యాంత్రికంగా అర్థం చేసుకున్నందువల్ల దాదాపు చరిత్రకు ప్రత్యామ్నాయం ఉండదనే అభిప్రాయం ఏర్పడింది;

5. మార్క్స్ యథాలాపంగా చెప్పిన విషయాలకు కూడా సైద్ధాంతిక స్థాయి కల్పించడం. అదేవిధంగా మార్క్స్‌కు సంబంధం లేని విషయాలను కూడా మార్క్స్ సిద్ధాంతాలుగా మార్చి వేయడం; 6. వీటన్నిటికీ మించి మార్క్సిస్టులు 'ఆచరణ' అనే మాటను అన్వయించిన తీరు వక్ర భాష్యానికి పరాకాష్ఠ. నూతన సమాజ నిర్మాణం కోసం కొనసాగించే విప్లవాత్మక, విమర్శనాత్మక, రాజకీయపరమైన కృషిని ఆచరణగా మార్క్స్ వివరించాడు. భవిష్యత్తు సమాజం కోసం ప్రతి ఒక్కరూ ఆలోచించి, చైతన్యవంతంగా ముందుకు సాగాలి. కానీ వాస్తవంలో బహు కొద్ది మంది నాయకులు రూపొందించిన కార్యక్రమాలను అమలు చేయడమే ఆచరణగా పరిగణనలోకి వచ్చింది.

పై వివరాలను బట్టి మార్క్స్ ఆలోచనలను మసిబూసి మారేడుకాయ చేసినట్టు తెలుస్తుంది. ఈ తీరులో మార్క్స్ మౌలిక ప్రతిపాదనలను వక్రీకరించినందువల్ల, వారు భారతదేశ పరిస్థితులను అర్థం చేసుకోవడం కూడా పూర్తిగా విఫలమయ్యారు. అంతే కాకుండా వ్యక్తి ఆలోచనలను, సామాజిక అంశాలను అర్థం చేసుకోవడంలో మార్క్సిస్టులమని చెప్పుకుంటున్న వారు పూర్తిగా విఫలమయ్యారు. ఫ్రాయిడ్ ప్రతిపాదించిన మనోవిశ్లేషణను విస్మరించినందువల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. మానసిక ఆవిర్భావం, పరిణామం గురించి ఫ్రాయిడ్ సవివరంగా చర్చించాడు. అయినప్పటికీ సామాజిక మానసిక పరిస్థితి అర్థం చేసుకోవటానికి కేవలం మనోవిశ్లేషణ మాత్రమే సరిపోదు.

విల్ హెల్మ్ రైక్ ప్రతిపాదించిన వ్యక్తిత్వ విశ్లేషణ (క్యారెక్టర్ ఎనాలిసిస్), మూక మనస్తత్వం (మాస్ సైకాలజీ), భావావేశ మహమ్మారి (ఎమోషనల్ ప్లేగ్), పనిలో ప్రజాస్వామ్యం (వర్క్ డెమోక్రసీ) తదితర భావనలను అర్థం చేసుకోవడం అవసరం. రైక్ ఆవిష్కరణలలో ప్రధానమైనది, జీవశక్తి లేదా ప్రాణశక్తి. దీనిని ఐదోశక్తి లేదా ఫిఫ్త్ ఫోర్స్ అంటున్నారు. ఈ శక్తికి ఆర్గాన్ ఎనర్జీ అని రైక్ పేరు పెట్టాడు. ఈ ప్రాణశక్తి శరీరంలో తల నుంచి కటివైపు ఆరు విభాగాలుగా (సెగ్మెంట్స్) ప్రయాణిస్తుందని ఈ విభాగాలలో శక్తి పేరుకుపోయినప్పుడు రుగ్మతలు వస్తాయని ఆయన వెల్లడించాడు. ఈ రుగ్మతలలో ప్రధానమైనది భావప్రాప్తి సామర్థ్యం కోల్పోవడం. ఫలితంగా లైంగిక అసంతృప్తి తీవ్ర స్థాయిలో కొనసాగుతున్నది. దీని కారణంగా నేరపూరిత ప్రవర్తన చోటుచేసుకుంటున్నది. భావప్రాప్తిని, లైంగిక సంతృప్తిని వ్యతిరేకించడం అంటే స్వీయ ద్వేషం పెంచుకోవడమే. తమను తాము ద్వేషించేవారు ఎన్నటికీ ఇతరులను ప్రేమించలేరు. ఈ ద్వేషం ప్రస్తుత సమాజంలో పెద్ద ఎత్తున పెరిగిపోయింది. ఈ పరిస్థితిని రైక్ భావావేశ మహమ్మారి (ఎమోషనల్ ప్లేగ్) అన్నాడు.

నిత్యజీవితంలో ఎదురయ్యే హింస, దేశాల మధ్య యుద్ధాలు భావావేశాలు ద్వేషంలో కూరుకుపోతున్నందువల్ల సంభవిస్తున్నాయి. వ్యక్తిత్వ నిర్మాణాలు, సామాజిక నియమాలతో పాటు వ్యక్తిలో జనిస్తున్న ద్వేషం కారణంగా అవి ఏర్పడుతున్నాయి. వందలు వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న వివక్షలతో కూడిన కుల వ్యవస్థలు వ్యక్తిత్వ నిర్మాణాలను అర్థం చేసుకొని కుల నిర్మూలనకు ప్రయత్నించాలి. ముందుగా పిల్లల పెంపకంలో ఇటువంటి ప్రయత్నాలు ప్రారంభం కావాలి.

• డాక్టర్ సుంకర రామచంద్రరావు
(రచయిత, విశ్రాంత ప్రాత్రికేయుడు)

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.2 కనిష్ఠం 24.2

అతివేగం.. తీసింది ప్రాణం

- పెద్దఅంబర్‌పేట వద్ద ఓఆర్ఆర్‌పై కారు బోల్తా
- మహిళ దుర్మరణం.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు

8



నారీ.. నటన భేరి

నారీ శక్తి తిరుగులేనిదని, సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. అఖిలభారత మహిళా అధ్యాపకుల సదస్సు శనివారం ఓయూలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాకారుల నృత్యాలు ఆహూతులను అలరించాయి.



- రహదారులను ముంచెత్తిన వరద
- వాహనదారులకు నరకం.. స్తంభించిన ట్రాఫిక్
- 3 కిలోమీటర్ల ప్రయాణానికి రెండుగంటలు
- నేలకూలిన వృక్షాలు, మునిగిన వాహనాలు
- అత్యధికంగా లంగర్‌హౌస్‌లో 9.1 సెం.మీ

కృష్ణానగర్‌లో రహదారిపై నీళ్లు నిల్వడంతో స్థానికుల అవస్థలు



గంటలోనే ఆగమాగం

కుండపోత వానకు కుదేలైన నగరం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మహానగరాన్ని వాన వణికించింది. శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో మొదలైన వర్షం..ఆకాశానికి చిల్లు పడిందా..అన్నట్టు కుండపోతగా కురిసింది. సుమారు గంటకుపైగా వానతో రహదారులపై వరద పోటెత్తింది. ప్రధానమార్గాలపై నడుములోతు నీరు నిల్వడంతో వాహనదారులు నరకయాతన అనుభవించారు. ఉద్యోగులు విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్లే సమయంలో భారీవర్షం పడటంతో రోడ్లపై వరదనీరు నిలిచి గంటల కొద్దీ వాహనాలు బారులు తీరాయి. 3 కిలోమీటర్ల ప్రయాణానికి 2 గంటలకుపైగా పట్టింది. సోమాజిగూడ సర్కిల్ వద్ద వరద భారీగా నిలిచిపోవడంతో వాహనాలు ముందుకు కదల్లేదు. యూసుఫ్‌గూడ కృష్ణానగర్ బీబ్లాక్‌లో రోడ్లపై పార్కు చేసిన ద్విచక్రవాహనాలు నీటమునిగాయి. ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీ ఎక్స్‌టెన్షన్ బస్తీలో పలు ఇళ్లలోకి వరదనీరు చేరింది. ఎల్బీనగర్, అబిడ్స్, లిబర్టీ, ట్యాంక్‌బండ్, ఖైరతాబాద్ చౌరస్తా, నిమ్స్ ఆస్పత్రి, పంజాగుట్ట మోడల్‌హౌస్, పెన్షన్ ఆఫీస్, మైత్రివనం, అమీర్‌పేట

మిగతా 8వ పేజీలో..

- జూబ్లీహిల్స్‌లో ఆఫీస్ ముగించుకొని సాయంత్రం 7.30 గంటలకు బయల్దేరిన ఉద్యోగి సిటీబస్సులో గడ్డిఅన్నారం చేరేసరికి రాత్రి 11 గంటలు అయ్యింది.
- ఫిల్మ్‌నగర్‌లో రాత్రి 8.20 గంటలకు కారులో బయలుదేరిన ఉద్యోగి రాత్రి 10 గంటల వరకు పంజాగుట్ట నాగార్జున సర్కిల్ దాటలేని పరిస్థితి. చివరకు 11.30 గంటలకు నేరెడ్‌మెట్ చేరుకున్నారు.



బండ్లగూడ జాగీర్‌లో ఓ ఇంట్లోకి వచ్చిన నీళ్లు

కనిపించని ట్రాఫిక్ పోలీసులు

ఓవైపు వరద, మరోవైపు ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు నరకం అనుభవించారు. ముందుకు కదలలేక, వెనక్కి వెళ్లలేక విలవిలలాడిపోయారు. తెలంగాణ భవన్, బంజారాహిల్స్, పంజాగుట్ట, నాగార్జున సర్కిల్, బేగంపేట, సికింద్రాబాద్, తార్నాక, జూబ్లీహిల్స్, మాసబ్‌ట్యాంక్, మెహిదీపట్నం, మేడిపల్లి, కోఠి, ఎర్రగడ్డ, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, మియాపూర్, మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దాన్ని క్లియర్ చేసేందుకు పోలీసులు కనిపించకపోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది.



అమీర్‌పేట రహదారిపై వరద

గంటన్నరలో లంగర్‌హౌస్‌లో 9.1 సెం.మీ

గంటన్నరలో లంగర్‌హౌస్‌లో అత్యధికంగా 9.1 సెం.మీ వర్షం కురిసింది. ఖైరతాబాద్ గణాంకభవన్‌లో 8.6, విజయ్‌నగర్‌కాలనీలో 8 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది.

పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం (రాత్రి 10 గంటల వరకు)

ప్రాంతం	కురిసిన వర్షం (సెం.మీ)
లంగర్‌హౌస్	9.1
ఖైరతాబాద్ గణాంకభవన్	8.6
విజయనగర్ కాలనీ	8.0
ఖైరతాబాద్ సెస్	7.7
కార్వాన్	7.3
ఆసిఫ్‌నగర్	7.2
మెహిదీపట్నం	6.7
నాంపల్లి	6.7
అత్తాపూర్	6.6
హిమాయత్‌నగర్	6.5
పాటిగడ్డ	6.1
షేక్‌పేట	5.9

తాళాలు ఇచ్చి ఏడాది.. నివాసమెప్పుడో మరి!

- ఏడాదైనా నెరవేరని పేదోడి సొంతింటి కల
- పట్టాలిచ్చినా ఇళ్లల్లోకి అనుమతి లేని వైనం
- సర్కారు గ్రీన్‌సిగ్నల్ కోసం ఎదురుచూపులు



తట్టిఅన్నారంలో నిర్మాణం పూర్తి అయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

హయత్‌నగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ఈ రెండు భవన సముదాయాలు నగరశివారు హయత్‌నగర్ సమీపంలోని కుంట్లూరు హత్తిగూడ, తట్టిఅన్నారంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు. జీప్లస్ 9 చొప్పున 1,728 ఫ్లాట్లు నిర్మించారు. గతేడాది సెప్టెంబర్ 22న ఈ రెండు సముదాయాల్లో లాటరీ పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేసి అధికారులు తాళాలు, పట్టా సర్టిఫికెట్లు అందజేశారు. కానీ అందులో నివాసముండేందుకు అనుమతివ్వకపోవడంతో ఏడాది కాలంగా గోస అనుభవిస్తున్నారు. పేదల సొంతింటి



కుంట్లూరు హత్తిగూడలో నిర్మాణం పూర్తి అయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

మిగతా 6వ పేజీలో..



రహదారులు శుభ్రంగా ఉండేలా చూడండి

- మిగిలిన విగ్రహాల నిమజ్జనం పూర్తవ్వాలి
- కమిషనర్ ఆమ్రపాలి ఆదేశం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం పూర్తయిన నేపథ్యంలో రహదారులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా జోనల్, అదనపు కమిషనర్లు, ఇతర విభాగాల ఉన్నతాధికారులతో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంకా కొన్ని ప్రాంతాల్లో గణేశ్ నిమజ్జనం జరుగుతున్నదని, మిగిలిన విగ్రహాలు త్వరగా నిమజ్జనం పూర్తయ్యేలా చూడాలన్నారు. శోభాయాత్ర మార్గాల్లో చెత్తాచెదారం, కలర్ పేపర్ షీట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిపన్ను లక్ష్యం మేరకు వసూలు చేయాలని, ఇంటింటి సర్వే ప్రక్రియను పూర్తిచేసి తప్పులు లేకుండా ఓటరు జాబితా తయారు చేయాలని ఆమె సూచించారు.

మూసీని మురిపిస్తాం..

- నదికి పూర్వ వైభవం తీసుకొస్తాం
- పరీవాహక ప్రాంత బాధితులకు 'డబుల్' ఇళ్లు
- నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ
- వనస్థలిపురం, చంచల్‌గూడల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలన

వనస్థలిపురం/చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): అనంతగిరి కొండల్లో పుట్టి నగరం గుండా ప్రవహిస్తున్న మూసీనదికి పూర్వ వైభవం తీసుకొచ్చి మురిపిస్తామని నగర ఇన్‌చార్జి మంత్రి, రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచస్థాయికి తీసుకెళ్లేలా మూసీ తీరాన్ని ఆధునీకరించి పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే కార్యాచరణ రూపొందించారని చెప్పారు. వనస్థలిపురం రైతుబజార్ వద్ద, చంచల్‌గూడ జైలు సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాలను శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. వాటిల్లో

మిగతా 8వ పేజీలో..



వనస్థలిపురం రైతుబజార్ సమీపంలోని డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం

ఆపరేషన్ మూసీ

- ఆక్రమణల కూల్చివేతకు రంగం సిద్ధం
- నిర్వాసితులకు 'డబుల్' ఇళ్ల కేటాయింపు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం నడుం బిగించింది. ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా మూసీ ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం చేస్తోంది. మూసీనది ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో దాదాపు 12వేలకు పైగా ఆక్రమణలను తొలగించేందుకు 'ఆపరేషన్ మూసీ' చేపట్టనున్నారు. ఆక్రమణలను ప్రాధాన్యతా క్రమంలో తొలగించడానికి ఇప్పటికే హైడ్రాకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు తెలిసింది. ఇందుకోసం హైడ్రా అధికారులు మూసీ కబ్జాలను పరిశీలించడంతోపాటు రేపో మాపో కూల్చివేతలు ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. ఓవైపు కూల్చివేతలు చేపడుతూనే మరోవైపు ఆక్రమణలో ఆస్తులు కోల్పోతున్న నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు

మిగతా 8వ పేజీలో..



- చార్జీల వసూలుకు జలమండలి నిర్ణయం !
- అక్టోబర్ 2 నుంచి స్పెషల్‌డ్రైవ్
- భూగర్భ జలాల పెంపే ప్రధాన లక్ష్యం
- 300 గజాలపైన ఇళ్లు, అపార్ట్‌మెంట్‌కు తప్పనిసరి

ఇంకుడు గుంత లేకుంటే ట్యాంకర్ ధర ట్రిపుల్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాల పెంపునకు ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని వాటర్‌బోర్డు ఎంత చెబుతున్నా కొందరు పట్టించుకోవడం లేదు. దీంతో బోర్డు కఠిన నిర్ణయం తీసుకుంది. ఇంకుడుగుంత లేకుంటే వాటర్‌ట్యాంకర్ బుక్ చేసిన వారి నుంచి మూడింతల చార్జీలు వసూలు చేయనుంది. ప్రధానంగా 300 గజాలపైన ఇళ్లు, అపార్ట్‌మెంట్‌కు ఇంకుడుగుంత ఉండాల్సిందేనని పేర్కొన్నది. ఇప్పటివరకు నిర్మించుకోని వారిలో అవగాహన కల్పించేందుకు అక్టోబర్ 2 నుంచి నగరవ్యాప్తంగా స్పెషల్‌డ్రైవ్

మిగతా 6వ పేజీలో..

నయాసాల్ నుంచి బాదుడు

అవగాహన కల్పించిన తర్వాత కూడా ఇంకుడు గుంతలు నిర్మించుకోని వినియోగదారులపై వాటర్‌బోర్డు కొరడా ఝుళిపించనుంది. ఆయా వినియోగదారులు ట్యాంకర్ బుక్ చేస్తే రెట్టింపు చార్జీల వసూలుకు సిద్ధమైంది. నయాసాల్ (2025 జనవరి) నుంచి ఇంకుడుగుంత లేకుండా ట్యాంకర్ బుక్ చేస్తే ప్రస్తుతం రూ.500 ధరను మూడింతలు పెంచి రూ.1500 వసూలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.



తాళాలు ఇచ్చి ఏడాది .. నివాసమెప్పుడో మరి!

(5వ పేజీ తరువాయి)


కల నెరవేర్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. హయత్‌నగర్ సమీపంలోని కుంట్లూరు హత్తిగూడ, తట్టి అన్నారం, అబ్దుల్లాపూర్‌మెట్, ఇంజాపూర్, కుత్బుల్లాపూర్, మదర్ డెయిరీ సమీపంలో రూ.361 కోట్ల వ్యయంతో 4,426 ఫ్లాట్లను నిర్మించారు. ఇందులో హత్తిగూడలో 432, తట్టిఅన్నారంలో 1,296, అబ్దుల్లాపూర్‌మెట్ 170, కుత్బుల్లాపూర్‌లో 800 నిర్మాణం చేపట్టారు. హత్తిగూడ, తట్టిఅన్నారంలో నిర్మాణాలు పూర్తయి లాటరీ పద్ధతిన లబ్ధిదారులను ఎంపికచేసి ఇంటి తాళాలు, పట్టా సర్టిఫికెట్లను మాత్రమే అందజేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు అనుమతి వ్వాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.













వర్షాలతో 24 గంటలు అప్రమత్తం : సీఎండీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గేవరకు 24 గంటలు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశించారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీవర్షంతో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి స్తంభాలు తీగలపై పడడంతో విద్యుత్‌సరఫరాలో అంతరాయాలు నెలకొన్నాయి. బంజారాహిల్స్, మణికొండ ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి సీఎండీ పర్యటించి చెట్లు విరిగిన ప్రాంతాలను, సరఫరా పునురుద్ధరణ పనులను పరిశీలించారు. మరో నాలుగురోజులపాటు భారీవర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో సెక్షన్లలో ఎఫ్ఓసీ, సీబీడీ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

రామంతాపూర్‌లో 4.30 గంటలు నిలిచిన విద్యుత్ సరఫరా

ఐడీఏ ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో నాగోల్ ఈహెచ్‌టీ నుంచి రామంతాపూర్ పాలిటెక్నిక్ ప్రాంతానికి వచ్చే 33 కేవీ విద్యుత్‌లైన్ తెగిపోవడంతో రామంతాపూర్‌పరిధిలో మధ్యాహ్నం 3.15 నుంచి రాత్రి 7.40 వరకు సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్రఇబ్బందులు పడ్డారు. సుమారు 4.30 గంటల పాటు విద్యుత్‌సరఫరా లేకపోవడంపై స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మెర్సిడెస్ బెంజ్ సిల్వర్ స్టార్ షోరూమ్ ప్రారంభం



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మెర్సిడెస్ బెంజ్ సిల్వర్ స్టార్ ఆధునికీకరించిన షోరూమ్‌ను బంజారాహిల్స్‌లో శనివారం ప్రారంభించింది. విక్రయాలే కాకుండా కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను కూడా పునరుద్ధరించింది. దేశంలోనే అత్యుత్తమ సేవలందించే విధంగా దీన్ని తీర్చిదిద్దినట్టు సంస్థ పేర్కొన్నది. షోరూమ్‌ను ప్రారంభించిన మెర్సిడెస్‌బెంజ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ అయ్యర్.. వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెడతామని ప్రకటించారు.

ఇంకుడుగుంత లేకుంటే ట్యాంకర్ ధర ట్రిపుల్

(5వ పేజీ తరువాయి)

చేపట్టాలని నిర్ణయించింది.

నీళ్లు భూమిలోకి ఇంకే మార్గమేది?

కాంక్రీట్ జంగిల్‌గా మారిన మహానగరంలో వానచినుకు భూమిలో ఇంకే పరిస్థితి లేదు. చిన్నవర్షానికే వరద ముంచెత్తుతోంది. చివరకు మూసీలో కలిసి వర్షపు నీరంతా వృథాగా పోతోంది. పడిన ప్రతి చినుకు భూమిలో ఇంకాలని, భూగర్భజలాలను పెంచాలని వాటర్‌బోర్డు ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. గతేడాది వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటడం.. కృష్ణా, గోదావరి జలాలే దిక్కవ్వడంతో తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. ఫలితంగా నగరంలో వాటర్‌ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది.

ప్రతీ ఇంటికి, అపార్ట్‌మెంట్‌కు ఉండాల్సిందే!

భూగర్భ జలాలను పెంపొందించేందుకు నల్లాకనెక్షన్ ఉన్నవారితో పాటు నూతనకనెక్షన్ తీసుకునేవారు ఇంటి ప్రాంగణంలో ఇంకుడు గుంతను నిర్మించుకోవడం తప్పనిసరి చేసే అంశంపై వాటర్‌బోర్డు దృష్టి సారించింది. నల్లాకనెక్షన్ అనుమతి పొందే సమయంలోనే ఇంకుడు గుంతను నిర్మించుకోవాలన్న నిబంధన కూడా విధించారు. అయినా చాలా మంది పట్టించుకోవడం లేదు. కాగా, మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ మార్గనిర్దేశనంలో ఇప్పటికే ఇంకుడుగుంతల సర్వే కోసం బోర్డు ఒక అప్లికేషన్ రూపొందించి అందుబాటులోకి తెచ్చింది. ఈ ఏడాది జూన్ 14 నుంచి సర్వే నిర్వహిస్తోంది. ఈనెల 18వ తేదీ వరకు 25,578 నివాస సముదాయాలను తనిఖీ చేయగా 12,446 చోట్ల ఇంకుడు గుంతలు ఉన్నాయని, 13,132 ప్రాంగణాల్లో లేవని గుర్తించారు. దీంతో స్పెషల్‌డ్రైవ్‌ను ముమ్మరం చేసేందుకు బోర్డు సిద్ధమైంది. డివిజన్ ఒక యూనిట్‌గా పరిగణించి తనిఖీలు ముమ్మరం చేయనుంది. 18 ఎన్జీవోల ప్రతినిధుల్ని రంగంలోకి దింపి వినియోగదారులకు అవగాహన కల్పించనుంది.







బాబుల్‌రెడ్డినగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవుపల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ బస్తీలో శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అధికారులతో కలసి పర్యటించారు. ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలసి ఆయన వీధులన్నీ పరిశీలించారు. రోడ్లుసరిగ్గా లేవని, వీధి దీపాలు వెలుగడం లేదని, తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని, పారిశుధ్య నిర్వహణను సక్రమంగా చేపట్టాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రతి వీధిలో వీధి దీపాలు వెలిగేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్, జలమండలి జనరల్ మేనేజర్ సాయిలక్ష్మి, ఈఈ నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీలో విద్యార్థులు, పలువురు ప్రముఖులు

మతసామరస్యానికి ప్రతీక హైదరాబాద్

● సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక అయిన పాతబస్తీ, హైదరాబాద్ మనందరికీ ఆదర్శమని తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్, శారద జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల సంయుక్తాధ్వర్యంలో అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న బండ ప్రకాశ్ మాట్లాడుతూ, విద్యార్థులకు చిన్నతనం నుంచి శాంతిని బోధించాలన్నారు. హింసా మార్గం ద్వారా జీవితంలో ఏమీ సాధించలేమన్న ఆయన, కులమతాలకతీతంగా ప్రజలంతా ఐక్యంగా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో అమీర్ పీస్ ఫౌండేషన్ చైర్మన్ ఫరూక్ అలీఖాన్, సిటీజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌నారాయణ్ ముదిరాజ్, సీనియర్ జర్నలిస్టులు పిల్లి రాంచందర్, వింజమూరి వెంకటాచారి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్ గోగుల మంద స్వరూపరాణి, ఉస్మానియా యూనివర్సిటీ పర్యావరణ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సయీద అజీమున్నీసా, శారద విద్యాలయం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సాంబ లలిత, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.పద్మావతి, సీమ, వేణు, ఉదయ్, పాతబస్తీ టీసీసీ అధ్యక్షుడు ఎన్.రామకృష్ణశాస్త్రి, ముత్యం యాదవులు తదితరులు పాల్గొన్నారు.

చేగూరి వెంకటరమణ సేవలు మరువలేనివి



వెంకటరమణను సన్మానిస్తున్న హరియాణా గవర్నర్ దత్తాత్రేయ

గోషామహల్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షులు చేగూరి వెంకటరమణ సేవలు మరువలేవని హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం మహరాజ్ గంజలో చేగూరి వెంకటరమణకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన దత్తాత్రేయ... చేగూరి వెంకటరమణను సన్మానించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ అయ్యప్పసేవా సమితి అధ్యక్షులు క్యాథం రాధాకృష్ణ, సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ ప్రతినిధులకు సన్మానం చేస్తున్న అధికారులు

నిమజ్జనాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ రాజేంద్రనగర్ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు ధన్యావాదాలు తెలిపారు. పీడీపీ చౌరస్తాలోని ఐబీ ఫంక్షన్ హాల్‌లో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవ సమితి నాయకులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బద్దం మహిపాల్‌రెడ్డి, వై.శ్రీధర్, బి. బాల్‌రెడ్డి, ఎన్.మల్లారెడ్డి, ఎం.కొమురయ్య, పి.మల్లేశ్‌యాదవ్ తదితరులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తదితరులు పాల్గొన్నారు.

బాలికల సదనానికి 43 మంది విద్యార్థినుల తరలింపు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): 'హాస్టల్‌కు వెళ్లం... వార్డెన్ కొడుతోంది.. అని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులను' నగరంలోని ప్రభుత్వ బాలికల హోమ్‌కు తరలించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి విద్యార్థినుల సమక్షంలో తల్లిదండ్రులతో మాట్లాడారు. తమ పిల్లలను చెరీస్ హాస్టల్‌కు పంపించబోమని తేల్చి చెప్పారు. దీంతో చెరీస్ హాస్టల్‌లో ఉంటున్న 43 మంది విద్యార్థినులను ప్రభుత్వ బాలికల సదనానికి తరలించారు.

ముర్తుజా నగర్, శ్రీరామ్ కాలనీలలో..

ఇళ్లలోకి వరదనీరు

చార్మినార్ /పహాడిషరీఫ్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం రాత్రి గంట పాటు కురిసిన వర్షానికి పలు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రాత్రి భోజనం చేసి నిద్రపోయే సమయంలో ఏకధాటిగా కురిసిన వర్షానికి కాలనీలోకి భారీగా నీరు చేరి బయట కాళ్లు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఒక్కసారిగా బస్తీల్లోకి నీళ్లు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. యాఖుత్‌పురా నియోజకవర్గం రెయిన్‌బజార్ డివిజన్‌లోని అలీనగర్ ముర్తుజానగర్‌లో బస్తీలలో భారీగా వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరింది. రాత్రంతా ఆయా బస్తీలలోని ప్రజలు జాగరణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామకాలనీలో వర్షం కురిసిన ప్రతిసారి బస్తీల మధ్య వర్షపు నీరు నిలిచి చెరువులను తలపించాయి. ఇండస్ట్రియల్ ఎక్కువ ఉన్న ప్రాంతాల నుంచి కింది ప్రాంతాలకు వర్షపు నీరు రావడంతో బస్తీల మధ్య వర్షపు నీరు నిలిచింది. అత్యవసర పరిస్థితి వస్తే తమ కష్టాలు ఎవరికీ చెప్పుకోవాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సమస్యపై ప్రజాప్రతినిధులు అధికారుల చుట్టూ తిరిగినా తూతూ మంత్రంగా హామీలు ఇస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని, చిన్నపాటి వర్షానికే ఇబ్బందులు పడుతున్నామని శ్రీరామ్‌నగర్ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీరామ్ కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు



యాఖుత్‌పురా ముర్తుజానగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఆస్పత్రి భవనాన్ని నిర్మించొద్దు

గోషామహల్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనాన్ని నిర్మించవద్దని గోషామహల్ ప్రజా పరిరక్షణ కమిటీ నాయకుల ప్రతినిధుల బృందం కోరింది. ఈ మేరకు గోషామహల్ ప్రజా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఆవుల వినోద్ యాదవ్, కోటి శైలేష్ కురుమ, బెజిని శ్రీనివాస్, దత్తు బృందం శనివారం ఎమ్మెల్యే రాజాసింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇక్కడ ఆస్పత్రిని నిర్మిస్తే స్థానిక బస్తీవాసులు, వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఈ విషయమై సీఎంతో మాట్లాడి ఆస్పత్రి భవన నిర్మాణాన్ని విరమించుకునేలా కృషి చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రాజాసింగ్ ఈ విషయమై త్వరలో సీఎంతో మాట్లాడి, ఆస్పత్రిని నిర్మించే ముందు స్థానికల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని వివరిస్తానన్నారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు మాణిక్ లత, పవన్ కుమార్, దుక్కల్ నగేశ్, ఎన్.నేహాల్, వి.విష్ణు, ఈశ్వర్, చంద్రమోహన్, భగవాన్, ఉపాధ్యాయ, లడ్డూ, బద్రి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజాసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా పరిరక్షణ కమిటీ ప్రతినిధుల బృందం

శాస్త్రీయ కళలు మన సంస్కృతికి ప్రతీకలు

రవీంద్రభారతి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతికి శాస్త్రీయ కళలు ప్రతీకలుగా నిలుస్తాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కళల్ని, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరముందని అన్నారు. నవ్య నాటక సమితి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 49వ అఖిలభారత సంగీత, నృత్య పోటీలు కొనసాగుతున్నాయి. ఐదు రాష్ట్రాలకు చెందిన కళాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా శనివారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో నృత్య పోటీలు నిర్వహించగా, శ్రీకృష్ణదేవరాయ భాషా నిలయంలో సంగీత పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా పారిశ్రామికవేత్త ఆకుల రజిత్‌కుమార్, వసుంధర తదితరులు హాజరై కళాకారునలు సత్కరించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ నవ్యనాటక సమితి 66ఏళ్లుగా సాంస్కృతి సేవ చేయడం గొప్ప విషయమన్నారు. దేశంలోని ఆయ రాష్ట్రాల నుంచి కళాకారులకు పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. శాస్త్రీయ కళల పట్ల ఈతరం పిల్లలకు అవగాహన పెరిగేలా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు విజయ్‌కుమార్, నృత్యగురువు సుధామాల, పట్నం శివ ప్రసాద్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

మిలాద్ ఉన్ నబీ వేడుకలలో గొడవ

● సోషల్ మీడియాలో వీడియోలు ● నలుగురి అరెస్ట్

గోషామహల్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మిలాదున్ నబీ పండుగ రోజున జీస్సీచౌరాయి సంతోష్‌మాత ఆలయం వద్ద సూరజ్ అనే వ్యక్తిని ఓ వర్గానికి చెందిన యువకులు గొడవ పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేసిన నలుగురిని షాహినాథ్‌గంజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం షాహినాథ్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సౌత్, వెస్ట్ డీసీపీ చంద్రమోహన్, ఏసీపీ వెంకట్‌రెడ్డి, డీఐలతో కలిసి వివరాలను వెల్లడించారు. గోషామహల్ చాక్నావాడికి చెందిన నరేశ్ వ్యాస్(43), మీర్‌చౌక్ మీరాలంమండికి చెందిన షేక్ షౌకత్ అహ్మద్ (39), ఉస్మాన్‌షాహీకి చెందిన మహేశ్‌కుమార్ ఉపాధ్యాయ(51), బాగ్‌లింగంపల్లికి చెందిన సందీప్ బోరా(55) గొడవకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రజల మధ్య విద్వేశాలు రెచ్చగొట్టేలా వీడీయోలను పోస్టు చేసిన వారిపై సెక్షన్ 349, 353, 197, 66జీ ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు డీసీపీ చంద్రమోహన్ తెలిపారు. ఎవరైనా వివరాలను పూర్తిగా తెలుసుకోకుండా వాట్సాప్‌లో, సోషల్ మీడియాలో ఇటువంటి వీడియోలు వైరల్ చేస్తే వారిని చట్టపరంగా శిక్షిస్తామన్నారు. అవసరమైతే గ్రూపు అడ్మిన్‌పై కేసు నమోదు చేస్తామని డీసీపీ హెచ్చరించారు.

లైంగికంగా వేధిస్తున్న వ్యక్తిపై దాడి

● దాడికి పాల్పడ్డ మహిళ, ఆమె భర్త, కుమారుడిపై కేసు

మదీన, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): లైంగికంగా వేధిస్తున్న ఓ వ్యక్తిపై మహిళ తన భర్త, కుమారుడితో కలిసి దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారు. గాయపడిన అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... ఇస్మాయిల్‌నగర్‌కు చెందిన ఏజాజ్, అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళతో ఎనిమిది నెలలుగా పరిచయం ఉంది. ఏజాజ్ ప్రవర్తన నచ్చక మహిళ అతడిని దూరం పెట్టింది. అయినా ఎజాజ్ వేధిస్తుండడతో విషయం బాధితురాలు భర్తకు చెప్పింది. శుక్రవారం రాత్రి బాధిత మహిళ, భర్త, కుమారుడితో కలిసి బలవంతంగా ఎజాజ్‌ను ఆటో ఎక్కించుకుని గౌస్‌నగర్ సమీపంలోని లేక్‌వ్యూహిల్స్‌లోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి విచక్షణా రహితంగా కొట్టారు. తలపై రాయితో మోదారు. అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఏజాజ్‌ను బలవంతంగా ఆటోలో తీసుకెళ్తున్న విషయాన్ని గమనించిన ఏజాజ్ కుటుంబసభ్యులు 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. బండ్లగూడ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి గాయపడ్డ ఏజాజ్‌ను ఆస్పత్రికి తరలించారు. దాడిచేసిన ముగ్గురిపై హత్యాయత్నంకేసు నమోదు చేసి శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.



పురస్కారగ్రహీతల్ని సత్కరిస్తున్న అతిథులు

అక్కినేని ఆత్మీయ పురస్కారాలు ప్రదానం

రవీంద్రభారతి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): అక్కినేని శతజయంతిని పురస్కరించుకుని ప్రముఖ సాంస్కృతిక సంస్థ కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన డా. అక్కినేని సంగీత మహోత్సవం, ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవం శనివారం ముగిసింది. అలైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా చంద్రతేజ, డా.ఎ.నాగేశ్వరరావులకు అక్కినేని ఆత్మీయ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారి హాజరై పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. అనంతరం అక్కినేని నాగేశ్వరరావుతో తనకున్న సాన్నిహిత్యాన్ని పంచుకున్నాన్న ఆయన, అక్కినేని నటనతో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్నారని అన్నారు. ఆయన పోషించిన ప్రతీ పాత్రకు న్యాయం చేశారని గుర్తుచేశారు. అక్కినేని పోషించిన పాత్రలు తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. కార్యక్రమంలో చెవుటూరి చంద్రశేఖర్, జి.వల్లీశ్వర్, కోటేష్ మానవ, మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.



టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గ ఇన్‌చార్జి బోయ నగేశ్

– చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/glvC9f3 లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తర్వాత క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ముగిసిన వృక్ష వర్గీకరణ, హెర్బేరియం సెమినార్

చార్మినార్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మొక్కల వర్గీకరణలో అవలంబిస్తున్న ఆధునిక కార్యాచరణ పద్ధతుల గురించి శాస్త్రవేత్తలు విద్యార్థులకు వివరించారు. సిటీ కళాశాలలో నిర్వహిస్తున్న 'వృక్ష వర్గీకరణ, హెర్బేరియం' సెమినార్ శనివారం ముగిసింది. డీఆర్‌సీ భారతీయ వృక్ష పరిశోధన సంస్థ, హైదరాబాద్ శాస్త్రవేత్తలు డా.శంకర్రావు, డా.హరికృష్ణ డా.స్వర్ణలత హెర్బేరియం తయారు చేసే విధానాన్ని, సాంకేతిక అంశాలను వివరించారు. మొక్కలు సేకరించడం, ఆరబెట్టడం, విషరహితం చేయటం, చెదపురుగులు పట్టకుండా భద్రపరచడం గురించి రెండు గంటలకు పైగా విద్యార్థులకు వివరించారు. అనంతరం బీఎస్ఐ ఆచార్యులు జగదీష్ చంద్రబోస్ భారతీయ బొటానికల్ గార్డెన్ క్యూరేటర్ డా.స్వామి విజువల్‌గా గార్డెన్ చూపిస్తూ సంరక్షణ విధానాలను వివరించారు.

ఆర్కే చౌదరి, శాస్త్రవేత్త అగార్కర్ పరిశోధన సంస్థ వారు వృక్ష వర్గీకరణలో ఆధునిక పోకడలను వివరించారు. రెండు రోజులపాటు జరిగిన సెమినార్‌లో ముప్పైమంది అధ్యాపకులు, వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన డా.నాగరాజును సిటీ కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ అభినందించారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి నరేందర్

కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం

గోషామహల్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. ఆ దిశగా కార్యకర్తలు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరించినప్పుడే వారికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్‌ను... నరేందర్ ప్రతినిధుల బృందం సత్కరించింది.



దాండియా ఆడుతున్న మహిళలు

దసరా సంబురాలు



డ్యాన్స్ చేస్తున్న యువతి

నార్సింగ్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో అప్పుడే దసరా సందడి మొదలైనది. గండిపేటలోని ఆదిత్య కేస్‌గ్రాండ్ విల్లాలో గుజరాతీ సంప్రదాయం ప్రకారం యువతులు ఆటపాటలతో శనివారం సందడి చేశారు. బినా మెహతా నేతృత్వంలో దసరా గర్బా నృత్యాలు, దాండియా కోలాటాలతో కలర్‌ఫుల్‌గా వీకెండ్‌ను ఎంజాయ్ చేశారు. సంస్కృతి, సంప్రదాయాలు భవిష్యత్ తరాలకు తెలియజేయడానికి ఇలాంటి ఈవెంట్స్ అవసరమని నిర్వాహకురాలు బినా మెహతా తెలిపారు.

ఎఫ్‌టీఎల్‌లో లేకున్నా కూల్చివేశారు

● ఈవో, డీపీవోపై చర్యలు తీసుకోవాలి
● బాధితుడు సాజిద్ బిన్ ముబారక్

బర్కత్‌పుర, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సొంత భూమిలో నిర్మాణాలను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు సాజిద్ బిన్ ముబారక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం ముత్తంగి గ్రామం సమీపంలోని రామరాజునగర్‌లో సర్వేనంబర్ 55, 56, 82, 85లలో తన తండ్రి కొనుగోలు చేసిన వంద గజాల ప్లాట్‌లో ప్రహరీని నిర్మించుకోగా వాటిని ఈవో, డీపీవోలు కూల్చివేశారని చెప్పారు. వారిపై జిల్లా కలెక్టర్, ఎస్పీలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తమ స్థలం ఎఫ్‌టీఎల్‌లో కూడా లేదన్నారు. తమ ఇంటి నంబర్ సర్వేనంబర్ 57లో లేదని కొంతమంది అధికారులు ఆ సర్వేలో ఉన్నట్లు తప్పుడు ఆరోపణలు చేస్తూ తమ కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. దీనిపై పూర్తి విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. సమావేశంలో జావేద్‌బాబు, ఆలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మొఖానికి టవల్ చుట్టి

ఊపిరాడకుండా చేసి హత్య

● గుర్తు తెలియని వ్యక్తిగా చిత్రీకరించే యత్నం ● ఇద్దరి అరెస్ట్

మంగళ్‌హాట్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రియుడిని హత్య చేసి తప్పించుకునే ప్రయత్నం చేసిన మహిళను, అమెకు సహకరించిన సోదరుడిని హబీబ్‌నగర్ పోలీసులు అరెస్ట్‌చేసి జైలుకు పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బజార్‌ఘాట్‌లో నివాసం ఉంటున్న మహిల (50) భర్త మూడేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. అప్పటి నుంచి ఆమె స్థానికంగా ఓ ప్రెస్‌లో పనిచేస్తుంది. అక్కడే పనిచేస్తున్న ఖాజా నిజాముద్దీన్ అలియాస్ ఖాలేద్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ నెల 17వ తేదీ రాత్రి 11 గంటలకు ఖాలేద్.. రేణుక ఇంటికి వచ్చి శరీరకంగా కలిసేందుకు బలవంతం చేశాడు. అందుకు రేణుక ఒప్పుకోకపోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఖాలేద్‌ను నెట్టేసిన రేణుక టవల్ తీసుకొని అతడి మొఖానికి చుట్టి ఊపిరాడకుండా చేయగా, నోట్లో నుంచి రక్తం వచ్చి అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఆందోళనకు గురైన మహిళ తన సోదరుడు వెంకటేష్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పింది. ఇంటి వద్దకు వచ్చిన వెంకటేష్.. ఖాలేద్ ఎవరో తమకు తెలియదన్నట్లుగా గుర్తుతెలియని వ్యక్తి తమ ఇంట్లో చొరబడి అపస్మారక స్థితిలోపడి ఉన్నాడని, అతడిని బయటకు తరలించేందుకు సహాయం చేయాలని కోరగా, స్థానికంగా ఉన్న మరో వ్యక్తి సహకరించాడు. ఖాలేద్ శరీరాన్ని దుప్పట్లో కప్పి ఏమీ తెలియనట్లుగా బయటపడేసి మహిళ, ఆమె సోదరుడు వెళ్లిపోయారు. మరుసటి రోజు స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి పోస్టు మార్టం నిర్వహించారు. అనంతరం సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా రేణుక బండారం బయటపడింది. శనివారం మహిళను, ఆమె సోదరుడు వెంకటేష్‌ను అరెస్ట్ చేసి కటకటాల్లోకి నెట్టారు. సకాలంలో ఆధారాలు సేకరించి నిందితులను నిందితులను అరెస్ట్ చేసిన హబీబ్‌నగర్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

జన్యు, పర్యావరణ, జీవనశైలి కారణాలతో మతిమరుపు



ప్రపంచ మతిమరుపు వ్యాధి దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైద్యులు.

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మతిమరుపు(అల్జీమర్స్) వ్యాధి ముఖ్యంగా జన్యు, పర్యావరణ, జీవనశైలి కారణాల వలన ఏర్పడుతుందని టీఎస్‌బీ మెంటల్ హెల్త్ అవేర్నెస్ కమిటీ చైర్మన్ డాక్టర్ జార్జిరెడ్డి అన్నారు. దీని వల్ల మెదడు కణజాలాన్ని కోల్పోవడం కాకుండా కణాల మధ్య పనితీరు కమ్యూనికేషన్ కోల్పోయేలా చేస్తుందని ఆయన పేర్కొన్నారు. శనివారం ప్రపంచ మతిమరుపు దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డలోని మానసిక ఆస్పత్రిలో అల్జీమర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మతిమరుపు దినం పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం జార్జిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ గణాంకాల ప్రకారం ప్రతి యేడాది మతిమరుపు వ్యాధితో లక్షకు పైగా మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. 65 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారిలో అల్జీమర్స్ వ్యాధి మరణానికి ఐదో ప్రధాన కారణమని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ మతిమరుపు, మధుమేహం, బీపీ, వ్యాధులు పెరుగుతున్నాయని దీనికి అధికంగా మత్తు పదార్థాలు వాడడం కారణమన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.అనిత మాట్లాడుతూ మతిమరుపు వ్యాధి అనేది మానసిక రోగుల్లోనే కాకుండా సాధారణ వ్యక్తుల్లో కూడా సంభవిస్తుందన్నారు. హైదరాబాద్ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ గిరిప్రసాద్ మాట్లాడుతూ మతిమరుపు రాకుండా ఉండడానికి ఎక్కువగా చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. మెదడుకు పనికల్పించే పనులు చేయాలని, కొత్తరకం వంటలు ప్రయత్నించడం, చిన్నపిల్లలను పెంచడం లాంటివి చేస్తే బ్రెయిన్ చాలా ఉత్తేజమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీలలో గెలుపొందిన వైద్య విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమంలో మానసిక ఆస్పత్రి సైకాలజీ విభాగం అధిపతి డాక్టర్ సుధా, మెడికల్ సైకాలజిస్టు వెంకటసుబ్బయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో 'ఏక్ పేడ్ మాకే నామ్'

గోషామహల్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతి పెద్ద బ్యాంక్ ఎస్‌బీఐ తన ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తూ మరోపక్క సామాజిక దృక్పథంతో పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నామని స్టేట్ బ్యాంక్ ఇండియా(ఎస్‌బీఐ) చైర్మన్ సి.ఎస్.శెట్టి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కోఠిలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏక్‌పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ ఆవరణలో చెట్లను నాటి నీరు పోశారు. చైర్మన్ సి.ఎస్.శెట్టి మాట్లాడుతూ... ఎస్‌బీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ సంవత్సర కాలంలో 1.8 మిలియన్ మొక్కల పెంపకాన్ని చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కార్యాలయంలో చెట్లకు నీరు పోస్తున్న చైర్మన్ సి.ఎస్.శెట్టి

అన్నదాతలు ఆర్గానిక్ పంటలపై దృష్టిపెట్టండి: పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆర్గానిక్ పంటలపై దృష్టిసారించాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సేంద్రియ ఎరువులను వినియోగించి నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ది ఎర్త్ సెంటర్‌లో శనివారం మహేంద్ర పార్మర్స్ ప్రొడ్యూసర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆత్మీయ సమ్మేళనంలో ఆర్గానిక్ పంటల సాగుపై రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. కలుషితం లేని ఆహార పంటల ఉత్పత్తులు, లాభసాటి వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ పురుగు మందుల అవశేషాలు లేని సురక్షితమైన ఆహార ఉత్పత్తులు అందించాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. ఎర్త్ సెంటర్ ఆవరణలో స్వచ్ఛతహీ సేవలో భాగంగా సీజీఆర్ చైర్మన్ లక్ష్మారెడ్డి, శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి పోచారం పలు రకాల మొక్కలు నాటారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పాట్నా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్.నర్సింహారెడ్డి, తెలంగాణ బార్ కౌన్సిలర్ చైర్మన్ అనంత నర్సింహారెడ్డి తదితరులు హాజరయ్యారు.

నగరంలో నేడు

- విరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవాన్ని విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవనం వెల్ఫేర్ ట్రస్టు సౌజన్యంతో ఉప్పల్ భగాయత్‌లోని పిల్లర్ నంబర్ 808 వద్ద ఉదయం 6 గంటల నుంచి నిర్వహిస్తారు.
- స్వచ్ఛంద సంస్థ ఆశ్రయ్ ఆకృతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ సంకేత భాషల దినం సందర్భంగా గచ్చిబౌలి అథ్లెటిక్ స్టేడియం మష్రూం రాక్‌రోడ్‌లో ఉదయం 8.45 గంటలకు సైనథాన్(రన్) నిర్వహించనున్నారు.
- జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 716 మంది మహిళా ఉపాధ్యాయులను జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మెయిన్ ఆడిటోరియంలో సన్మానించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, విమలక్క తదితరులు హాజరవుతారు.
- తెలంగాణ ఆక్యుపంక్చర్ అక్యుప్రెషర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10.30గంటల నుంచి సెమినార్ నిర్వహించనున్నారు.
- కులగణన చేపట్టాలనే డిమాండ్‌తో తెలంగాణ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని పార్టీలు, అన్ని కులాల నేతలతో లక్డీకాపూల్‌లోని అశోకా హోటల్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు సదస్సు నిర్వహించనున్నారు. ఆర్.కృష్ణయ్య, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, వి.హనుమంత రావు తదితరులు హాజరవుతారు.



గ్రాండ్ గణేశా అవార్డులతో సొసైటీ సెక్రెటరీ వినయ్‌కుమార్, జాయింట్ ట్రెజరర్ సుధీర్ తదితరులు

గోల్ఫ్ వ్యూ గేటెడ్ కమ్యూనిటీకి రెండు గ్రాండ్ గణేశా అవార్డులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): నానక్‌రామ్‌గూడలోని గోల్ఫ్ వ్యూ గేటెడ్ కమ్యూనిటీకి రెండు గ్రాండ్ గణేశా అవార్డులు లభించాయి. తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖతో కలిసి 2020 నుంచి గ్రాండ్ గణేశా సంస్థ అవార్డులు అందిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది 5వ సీజన్‌లో గోల్ఫ్ వ్యూ గేటెడ్ కమ్యూనిటీకి మోస్ట్ డైనమిక్ సొసైటీ, మోస్ట్ రెసిడెంట్ ఫ్రెండ్లీ సొసైటీ అవార్డులు వరించాయి. కాగా, శుక్రవారం రెడ్‌హిల్స్‌లోని కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా సొసైటీ సెక్రెటరీ వినయ్‌కుమార్, జాయింట్ ట్రెజరర్ సుధీర్ అవార్డులను స్వీకరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హైదరాబాద్ యువ ప్రెసిడెంట్, గ్రాండ్ గణేశా అవార్డ్స్ కన్వీనర్ లయన్ డాక్టర్ సౌరభ్ సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

పుష్పక్ బస్సుల్లో 10 శాతం రాయితీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ ఆఫర్ ప్రకటించింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల నుంచి పుష్పక్‌బస్సుల్లో ఎయిర్‌పోర్టుకు ప్రయాణించే వారికి టికెట్ ధరలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. సిటీ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకే 10శాతం రాయితీ వర్తిస్తుంది. ముగ్గురు లేదా అంతకన్నా ఎక్కువ మంది కలిసి గ్రూప్‌గా ఎయిర్‌పోర్టుకు పుష్పక్ బస్సుల్లో ప్రయాణం చేస్తే వారికి 20శాతం డిస్కౌంట్‌ను అందిస్తుంది. ఈ రాయితీ సదుపాయాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆర్టీసీ నాలుగు రూట్లలో 40 బస్సులను నడుపుతుండగా రోజూ 6వేలమంది వరకు ప్రయాణాలు సాగిస్తున్నారు.

ఉస్మానియా యూనివర్సిటీలో రేపు జాబ్‌మేళా

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఉస్మానియా యూనివర్సిటీ వద్ద ఉన్న ఎంప్లాయ్‌మెంట్ బ్యూరోలో ఈనెల 23న జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. బీటెక్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన 18-30 ఏళ్లలోపు వారికి మిత్ర ఏజెన్సీస్‌లో సర్వీస్, బాడీషాప్ అడ్వయిజర్స్, మెకానిక్స్, రిలేషన్‌షిప్ మేనేజర్లుగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో డిప్యూటీ చీఫ్ ఆఫీసర్ రాము తెలిపారు. ఆయా విభాగాల్లో మొత్తం 125 ఖాళీలున్నాయని, ఎంపికైన వారికి రూ.11 వేల నుంచి 25 వేల వరకు వేతనం అందుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 23న జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు.

నేడు బుద్ధవనానికి బైక్ రైడర్స్ ర్యాలీ

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): టూరిజం ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ బుద్ధవనం వరకు సుమారు 300మంది యువకులు మోటారు సైకిళ్లపై ర్యాలీగా బయలుదేరి వెళుతున్నారు. నాగార్జునసాగర్ వద్ద అభివృద్ధి చేసిన పర్యాటక ప్రాజెక్టు బుద్ధవనం ప్రాధాన్యాన్ని విస్తృత స్థాయిలో ప్రచారం చేసేందుకు పర్యాటకసంస్థ ఈ బైక్ ర్యాలీని నిర్వహిస్తోంది. హైదరాబాద్ బైక్ రైడర్స్- పర్యాటక అభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీని ఆదివారం ఉదయం 7గంటలకు బేగంపేట టూరిజం ప్లాజా వద్ద రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని పర్యాటక సంస్థ అధికారులు తెలిపారు. బైక్‌రైడర్స్ నాగార్జునసాగర్ బుద్ధవనాన్ని సందర్శించిన తర్వాత సాగర్‌జలాల్లో బోటు షికారితో నాగార్జునకొండ సందర్శిస్తారు. అనంతరం హైదరాబాద్‌కు పయనమవుతారని పర్యాటక సంస్థ జనరల్ మేనేజర్ అంజిరెడ్డి తెలిపారు.



టీనేజ్ అండ్ యంగ్ అడల్ట్ క్యాన్సర్ సదస్సు ప్రారంభోత్సవంలో వైద్యులు

టీనేజ్ అండ్ యంగ్ అడల్ట్ క్యాన్సర్ సదస్సు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులు మరో 40 నుంచి 50 ఏళ్ల వయస్సు వరకు వైవాహిక జీవితంతో పాటు ఇతరత్రా ఉద్యోగానికి సంబంధించిన బాధ్యతలను నిర్వహించే విధంగా వైద్యులు జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆంకాలజీ ఫోరం ప్యాట్రన్ డాక్టర్ రఘునందరావు సూచించారు. యువతీ, యువకులలో వచ్చే క్యాన్సర్ వ్యాధులు, చికిత్సపై మెడికల్ ఆంకాలజీ ఫోరం, టీనేజ్ అండ్ యంగ్ అడల్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ (టీవైఏకెన్), నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 13వ జాతీయ సదస్సును నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్యాట్రన్ డాక్టర్ హేమంత్ మల్హోత్రా మాట్లాడుతూ యవ్వనంలో క్యాన్సర్ బారిన పడితే వారిలో ఏర్పడే మానసిక సంక్షోభాన్ని ఆయన వివరించారు. సదస్సులో వైద్యులు కల్నల్ ప్రకాష్ చితాల్కర్, లిజా రాజశేఖర్, సదాశివుడు గుండేటి, కృష్ణ మోహన్‌లతో పాటు దేశ నలుమూలల నుంచి వచ్చిన క్యాన్సర్ స్పెషలిస్టులు, క్యాన్సర్ సర్వైవర్స్‌లతో పాటు పలువురు వైద్య నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వల్లూర్‌లో ముదిరాజ్‌ల సాంఘిక బహిష్కరణ

చేగుంట, సెప్టెంబర్ 21(అక్టోబర్): మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూర్ గ్రామంలో ముదిరాజ్ కులస్థులను ఇతర కులస్థులు సాంఘిక బహిష్కరణ చేశారు. 20 రోజులుగా అన్నికులాల వారు ముదిరాజ్ కులస్థులను ఎలాంటి పనులకు రాకుండా బహిష్కరించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కుల సంఘం నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్‌లకు గత ప్రభుత్వం చెరువులు, కుంటల్లోని మత్స్య సంపదపై హక్కు లు కల్పించిందని చెప్పారు. గ్రామంలోని చెరువులు, కుంటలకు సంబంధించిన సొసైటీలు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ అనుమతులు కూడా పొందామని తెలిపారు. చెరువులోని మత్స్య సంపదపై వాటా ఇవ్వాలని వల్లూర్‌లోని ఇతర కులాల వారు డిమాండ్ చేయగా.. తాము నిరాకరించడంతో అందరూ కలిసి ముదిరాజ్ కులస్థులను సాంఘిక బహిష్కరణ చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఈ విషయంలో జిల్లా అధికారులు చొరవ తీసుకుని ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు నర్సింహులు, గణేష్, అంజనేయులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీసీ ప్రధాని ఉన్నా బీసీ మహిళలకు అన్యాయం

- బీసీ మహిళలకు సబ్ కోటా కోసం దేశవ్యాప్త ఉద్యమం
- బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం
- డిసెంబర్‌లో వేలాది మందితో బీసీ మహిళా గర్జన సభ



అభివాదం చేస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ తదితరులు

పంజాగుట్ట, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధానిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన నరేంద్ర మోదీ ఉన్నప్పటికీ దేశ వ్యాప్తంగా బీసీలకు అన్యాయం జరుగుతోందని అఖిల పక్ష పార్టీలు, బీసీ సంఘాల నాయకులు ఆరోపించారు. బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో "మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్ కోటా, భవిష్యత్ కార్యాచరణ"పై అఖిలపక్ష పార్టీలు, బీసీ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని నేతలు హెచ్చరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మణిమంజరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ మాట్లాడుతూ మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం లేని బిల్లు ఎవరి కోసమని ప్రశ్నించారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ డిసెంబర్‌లో వేలాది మందితో బీసీ మహిళా గర్జన సభను ఏర్పాటు చేస్తామని, వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో లక్ష మంది మహిళలతో పార్లమెంటును ముట్టడిస్తామని జాజుల వెల్లడించారు. వకుళాభరణం కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ బీసీ మహిళలకు జనాభా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ల పేరుతో బడుగు బలహీన వర్గాలకు ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ మహిళలు తమ రాజకీయ వాటా పొందడానికి విద్యార్థి దశ నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందిరాశోభన్ మాట్లాడుతూ బీసీ మహిళలకు సబ్ కోటా కోసం కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఇప్పటికే మద్దతు ప్రకటించారని గుర్తు చేశారు. సమావేశంలో పలు బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ కోసం పాటుపడ్డ కొండాలక్ష్మణ్

కవాడిగూడ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక తెలంగాణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ అహర్నిశలు పాటుపడ్డారని అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ జలదృశ్యం వద్ద ఉన్న బాపూజీ విగ్రహం వద్ద కొండా లక్ష్మణ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ కోదండరాం, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్య, మాజీ ఎంపీలు ఎం.అంజన్‌కుమార్ యాదవ్, బడుగుల లింగయ్యయాదవ్, రాపోలు ఆనంద భాస్కర్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితర నాయకులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ గాంధీమార్గంలో శాంతియుత పద్ధతిలో బాపూజీ జీవితకాలం రాష్ట్ర సాధన కోసం ఉద్యమించారని అన్నారు. బడుగు బలహీన వర్గాల చైతన్యం, ఆత్మగౌరవానికి కొండాలక్ష్మణ్ బాపూజీ కృషి మరువలేనిదని దీపాదాస్ మున్షి పేర్కొన్నారు. మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బాపూజీ 1969లో ప్రత్యేక రాష్ట్రసాధన కోసం ఉద్యమించారని, మంత్రిగా ఉన్నప్పుడు ప్రత్యేక రాష్ట్రం కోసం తన మంత్రి పదవికి రాజీనామా చేసిన మొదటి వ్యక్తి బాపూజీ అని ఆయన గుర్తు చేశారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

బీసీ సీఎం అయినప్పుడే కొండాలక్ష్మణ్‌కు నిజమైన నివాళి

- ఎంపీ ఆర్.కృష్ణయ్య



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): బీసీ ముఖ్యమంత్రి అయినప్పుడే ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి నిజమైన నివాళి అని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. శనివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి కృష్ణయ్య తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని సూచించారు. గుజ్జ సత్యం మాట్లాడుతూ త్వరలో కొండాలక్ష్మణ్ బాపూజీ మెమోరియల్ అవార్డులను ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ సంఘాల నేతలు అంజి, రామకృష్ణ, సతీష్, నందగోపాల్, రాందేవ్ మోది, మురళీకృష్ణ, సురేష్, పండరినాథ్, శ్రీకాంత్, సూర్యనారాయణ, జానయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

టీజీ జెన్కోలో 62 మంది అకౌంట్స్ అధికారులకు పదోన్నతులు

- విద్యుత్‌సౌధలో సంబురాలు



విద్యుత్ సౌధలో సంబురాల్లో పాల్గొన్న అకౌంట్స్ అధికారులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థలో పలు కోర్టు కేసుల నేపథ్యంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించి జెన్కోలో అకౌంట్స్ అధికారులకు పదోన్నతులు కల్పించారు. ఒకేసారి 62 మందికి పదోన్నతులు కల్పించడంపై సోమాజిగూడ విద్యుత్‌సౌధలో శనివారం విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించి పదోన్నతులు కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నోఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించడంలో ఎనర్జీ సెక్రటరీ, జెన్కో-ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్ ప్రత్యేక చొరవచూపారన్నారు. అకౌంట్స్ అధికారుల పదోన్నతికి చొరవ చూపిన డైరెక్టర్ అజయ్, ఫైనాన్స్ డైరెక్టర్ అనురాధలకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో పదోన్నతులు పొందిన అధికారులతో పాటు అసోసియేషన్ నాయకులు నాసర్ షరీఫ్, శ్యామల రావు, స్వామి, అనురాధ, ప్రసాద్, లొంక అశోక్, వెంకట్, పరమేష్, శ్రీనివాస్, సిద్ధిరాములు, అపర్ణ పాల్గొన్నారు.



ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాతకు వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ అవోపా, ఆర్య వైశ్య సంఘాల నాయకులు

తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలి

పంజాగుట్ట, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి తొలగించి ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని కించపర్చొద్దని తెలంగాణ ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా), ఆర్య వైశ్య సంఘాలు పేర్కొన్నాయి. పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, పొట్టి శ్రీరాములు మనుమరాళ్లు ప్రొఫెసర్ టి.రేవతి, దేవకి అనురాధ, ముని మనుమరాలు కుందా ప్రతిభ, ఆర్య వైశ్య వికాస వేదిక అధ్యక్షుడు కాచం సత్యనారాయణ, ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌గాంధీ, మిషన్ భగీరథ మాజీ చైర్మన్ వి.వెంకటేష్, తదితరులు మాట్లాడారు. కేవలం తమ సామాజిక వర్గానికే కాదు తెలుగు ప్రజలందరి ఆశాజ్యోతి ఆయన అని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతకు వారు వినతిపత్రం ఇచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి

రాష్ట్ర ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలని, ఆయన ఏ ప్రాంతానికో, రాష్ట్రానికో చెందిన వ్యక్తి కాదని, దేశం గర్వించదగ్గ నాయకుడని, భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యుడు అని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశంలో తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరుకు బదులుగా సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును పెట్టాలని, మంత్రివర్గ సమావేశంలో పేరు మార్పుకు ఆమోదం తెలపడాన్ని ఖండిస్తున్నామని వారు తెలిపారు.

తిరుమల లడ్డూ అపవిత్రంపై న్యాయ విచారణ జరిపించాలి

- దోషులను కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్

పంజాగుట్ట/బర్కత్‌పుర/వనస్థలిపురం, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపి అపవిత్రం చేశారనే ఆరోపణలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్, ఏపీ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ళ సత్య రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దీనికి కారణమైన ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ ఈఓ ధర్మారెడ్డిలను అరెస్ట్ చేయాలని కోరారు.

- తిరుమల లడ్డూ తయారీ క్రమంలో ఒక ప్రత్యేక అధికారిని కేటాయించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని యుగతులసీ ఫౌండేషన్ చైర్మన్, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు కొలిశెట్టి శివకుమార్ ఆరోపించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గోవిందునికి దేశీ గోవుల నెయ్యి కోసం లక్షా ఇరవై వేల దేశీ గోవులతో తిరుపతిలో గో మహాధామం నిర్మాణానికి టీటీడీ పూనుకోవాలని రూపొందించిన పోస్టరును ఆయన ఆవిష్కరించారు.
- తిరుపతి లడ్డూ కల్తీపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఏకం సనాతన భారత్ దళ్ అధ్యక్షుడు ఎస్‌కె.చతుర్వేది కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీటీడీని స్వతంత్ర ప్రతిపత్తి సంస్థగా ఏర్పాటు చేయాలన్నారు. ఆవు నెయ్యిలో అన్య పదార్థాలు కలిపి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన దుండగులను శిక్షించాలని తెలంగాణ బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోచంపల్లి శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణ వనస్థలిపురంలో డిమాండ్ చేశారు.

అతివేగం.. తీసింది ప్రాణం

- పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్‌పై కారు బోల్తా
- మహిళ దుర్మరణం.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన శ్రీవల్లి (ఫైల్)



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి



రోడ్డు ప్రమాదానికి గురైన కారు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): అతివేగం ఓ మహిళ ప్రాణం తీయగా.. మరో ఇద్దరిని తీవ్ర గాయాలపాలు చేసింది. ఓఆర్ఆర్‌పై అదుపుతప్పిన కారు డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొడుతూ అవతలి వైపు రోడ్డుపై బోల్తా పడింది. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు జిల్లా, బ్రాహ్మణ కోడూరుకు చెందిన సొపాటి శ్రీవల్లి(23) కొంత కాలంగా నగరంలోని ఈసీఐఎల్‌లో ఉంటూ స్థానిక యోధ డయాగ్నస్టిక్ సెంటర్‌లో రిసెప్షనిస్టుగా పని చేస్తున్నారు. గురువారం నేరేడ్‌మెట్‌కు చెందిన కారు డ్రైవర్ శివ(28), దమ్మాయిగూడకు చెందిన అనిల్(25)తో కలిసి కారులో గుంటూరులోని తన తండ్రి కోటేశ్వరరావు వద్దకు వెళ్లింది. పని ముగించుకుని శుక్రవారం అదే కారులో వారు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న కారు పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగురోడ్డు మీదుగా ఘట్‌కేసర్ వైపునకు వెళ్తూ తారామతిపేట గ్రామ సమీపం వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొడుతూ డివైడర్ అవతలి వైపు రోడ్డుపై బోల్తా పడింది. ఈ క్రమంలో కారులో నుంచి శ్రీవల్లితో పాటు అందులో ఉన్న ఇద్దరు రోడ్డుపై పడ్డారు. శ్రీవల్లి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. శివ, అనిల్‌కు తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో అవతలి వైపు రోడ్డులో వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్‌పై కేసు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్ తోట చంద్రశేఖర్, ఆ సంస్థ ప్రతినిధులపై సీసీఎస్‌లో కేసు నమోదైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చంద్రశేఖర్ తన కంపెనీకి ఇవ్వాల్సిన రూ.28 కోట్లు ఇవ్వకుండా మోసం చేశారని సాయి తిరుమల కన్‌స్ట్రక్షన్స్ ఎండీ వాకాడ తిరుమలరావు ఈ ఏడాది ఏప్రిల్ 27న సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ప్రకారం... 'ఆదిత్య' తమకు చెందిన 220 ప్లాట్లను అభివృద్ధి చేసేందుకు 2021 మార్చిలో 'సాయి తిరుమల' అనుబంధ సంస్థ ఎస్ఎస్టీ బిల్డర్స్‌తో ఒప్పందం కుదుర్చుకుని వర్క్ ఆర్డర్ ఇచ్చింది. 'సాయి తిరుమల' రూ.50 కోట్లు పెట్టుబడి పెట్టి 90 శాతం పనులు పూర్తి చేసి అప్పగించింది. ఆ ప్లాట్లను విక్రయించిన 'ఆదిత్య' ప్రతినిధులు.. తమకు బిల్లులు చెల్లించకుండా వేధిస్తున్నారని తిరుమలరావు ఫిర్యాదు చేశారు. అడగడానికి వెళితే బౌన్సర్లతో దాడులు చేయిస్తున్నారన్నారు. దాంతో తోట చంద్రశేఖర్, తోట సత్యనారాయణ, తోట అనిరుధ్, తోట మణిబాబు, అజయ్, శివపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయి తిరుమల కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు శనివారం 'ఆదిత్య' కార్యాలయం ముందు ఆందోళన చేసినట్లు తెలిసింది. దాంతో ఈ విషయం వెలుగులోకి వచ్చి చర్చనీయాంశమైంది.

దుర్గం చెరువు డెక్ ప్రాంతం లీజులో గోల్‌మాల్

- టీజీటీడీసీ మాజీ ఎండీపై పోలీసు కేసు

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని దుర్గం చెరువు డెక్ ప్రాంతం లీజు అంశంలో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీటీడీసీ) మాజీ ఎండీ బి.మనోహరరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గం చెరువు డెక్ ప్రాంతాన్ని లీజుకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానించగా కమల్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అత్యధిక బిడ్డర్‌గా నిలిచింది. అయితే, మాజీ ఎండీ మనోహరరావు.. కమల్ హోటల్‌కు అనుబంధంగా ఉన్న మరో సంస్థతో లోపాయికారి ఒప్పందం చేసుకుని ఆ సంస్థకు టెండరు కట్టబెట్టినట్టు సంస్థ ఉన్నతాధికారులు గుర్తించారు. దీంతో మనోహరరావు టెండరు ప్రక్రియలో నిబంధనలను ఉల్లంఘించి మోసం చేశారని టూరిజం సంస్థ ఏజీఎం రమేష్ నాయక్ ఫిర్యాదు చేయగా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

గంటలోనే ఆగమాగం

(5వ పేజీ తరువాయి)

ప్రధాన రహదారులపై మోకాలిలోతు నీరు నిలిచిపోయింది. సైదాబాద్ డివిజన్ ఎల్ఐసీ కాలనీ, బేగంపేట ప్రజాభవన్ ఐఏఎస్ క్లబ్ సమీపంలో రెండు భారీవృక్షాలు నేలకూలాయి. మెట్టుగూడ టీ జంక్షన్‌లో విద్యుత్ తీగ తెగి పడింది. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మెడిసిటీ కాలనీలో ఇళ్లల్లోకి నీళ్లు చేరడంతో నివాసితులు ఆందోళనకు గురయ్యారు. అధికారులకు ఫోన్లు చేసినా స్పందించలేదని స్థానికులు ఆరోపించారు.

అప్రమత్తంగా ఉండాలి : జీహెచ్ఎంసీ కమిషనర్

భారీవర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి నగరవాసులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్ 010- 21111111, డీఆర్ఎఫ్ 9000113667 నంబర్లను సంప్రదించాలన్నారు.

హైడ్రా కమిషనర్ పరిశీలన

నగరంలో నీళ్లు నిలిచిన ట్యాంక్‌బండ్, బేగంపేట ప్రాంతాలలో శనివారం రాత్రి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పర్యటించారు. నీళ్లు త్వరగా పోయేలా చర్యలు తీసుకోవాలని డిజాస్టర్ బృందాలను ఆదేశించారు.

మూసీని మురిపిస్తాం..

(5వ పేజీ తరువాయి)

నివాసముంటున్న వారిని వసతుల గురించి ఆరాతీశారు. ఎన్ని ఇళ్లు ఖాళీగా ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. 'నగరానికి పునర్వైభవం తేవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. మూసీ ప్రక్షాళనలో భాగంగా పరీవాహక ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. డబుల్ బెడ్‌రూం సముదాయాల్లో ఖాళీగా ఉన్న ఇళ్లను వారికి కేటాయిస్తాం. వనస్థలిపురంలో సుమారు 95 ఇళ్లు, చంచల్‌గూడలో 142ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసమే డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించాం' అన్నారు.

జంట జలాశయాలకు గోదావరి జలాలు

కొందరు నిరుపేదలు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన వారికి తప్పకుండా అందజేస్తాం. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ గృహాలు నిర్మించబోతున్నాం. జంటజలాశయాలకు గోదావరి నీటిని మళ్లించేందుకు రూ.2,500 కోట్లు కేటాయించాం. దీనివల్ల మూసీలో మురుగు లేకుండా స్వచ్ఛమైన నది ప్రవహించి పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుంది. తద్వారా హైదరాబాద్ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెబుతాం' అని మంత్రి పేర్కొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులు

చంచల్‌గూడలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవన నిర్మాణ పనులను మలక్‌పేట ఎమ్మెల్యే బలాలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నూతన భవనాన్ని కూడా పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, వచ్చే విద్యాసంవత్సరం నాటికి ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మంత్రి వెంట మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్లు వెంకటాచారి, ప్రతిమాసింగ్, ఆర్‌డీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, కట్ల నర్సింహయాదవ్, శివనాయక్, ఎంఆర్‌డీసీఎల్ జేఎండీ పూజారి గౌతమి, ఎల్‌బీనగర్, చార్మినార్ జోనల్ కమిషనర్లు హేమంత్ పాటిల్, వెంకన్న, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

ఆపరేషన్ మూసీ

(5వ పేజీ తరువాయి)

చేస్తోంది. తొలుత షెడ్లు, గోదాములను తొలగించనున్నారు. ఇళ్లలో నివాసముంటున్న వారికి ముందుగానే సమాచారం తెలియజేయనున్నారు. ఆక్రమణల తొలగింపులో ఇళ్లు కోల్పోయే నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించడం, మరోవైపు ఇళ్లు కూల్చే ప్రక్రియను ఏకకాలంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోనున్నారు. 'ఆపరేషన్ మూసీ' ప్రక్రియలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే విభాగం, జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, పోలీసు శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని, హైడ్రా కూల్చివేతలను పర్యవేక్షించాలని ఉన్నతస్థాయిలో మౌఖిక ఆదేశాలు అందినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

ఆదివారం

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు



ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
పెనెలోప్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 24
రెజ్ బాల్	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 27
విల్ అండ్ హార్పర్	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 27
అమెజాన్ ప్రైమ్		
స్కూల్ ఫ్రెండ్స్	హిందీ సిరీస్	సెప్టెంబర్ 25
నోబడీ వాంట్స్ దిస్	వెబ్ సిరీస్	సెప్టెంబర్ 26
స్త్రీ 2	హిందీ చిత్రం	సెప్టెంబర్ 27
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
వాళ	మలయాళ చిత్రం	సెప్టెంబర్ 23
9-1-1	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 24
గ్రోటీ స్కేరీ	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 26
తాజా ఖబర్ 2	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 27
జీ 5		
డిమోంటి కాలనీ2	తమిళ చిత్రం	సెప్టెంబర్ 27
లవ్ సితార	హిందీ చిత్రం	సెప్టెంబర్ 27

సితార ప్రేమకథ



శోభితా దూళిపాళ్ల ప్రధాన పాత్ర పోషించిన ఫ్యామిలీ డ్రామా 'లవ్ సితార'. నేరుగా ఓటీటీలో విడుదలవుతోంది. కేరళలోని ప్రకృతి సొబగుల మధ్య ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆధునిక భావాలున్న తార అనే ఇంటీరియర్ డిజైనర్ పాత్రలో శోభిత నటించారు. అర్జున్ అనే వ్యక్తిని ఆమె ప్రేమించడం, వారిద్దరి మధ్య దాగిన కొన్ని రహస్యాలు పెళ్లికి ముందు బయటపడడంతో ఎలాంటి పరిణామాలు జరిగాయి అనే అంశం చుట్టూ అల్లుకున్న కథ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. రాజీవ్ సిద్ధార్థ, సోనాలి కులకర్ణి కీలకపాత్రల్లో నటించారు. వందన్ కటారియా దర్శకత్వంలో ఆర్‌ఎస్‌వీపీ ప్రొడక్షన్స్ నిర్మించింది. సెప్టెంబర్ 27న జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది.

పేరెంటింగ్

పిల్లలు గొడవపడుతుంటే..

ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే ఫైటింగ్స్‌కి కొదువుండదు. వాళ్లను సముదాయించడం తల్లిదండ్రులకు రోజూ సవాలుగానే ఉంటుంది. ఈ విషయంలో పేరెంటింగ్ ఎక్స్‌పర్ట్స్ చేస్తున్న సూచనలు ఇవి...

- పిల్లలు గొడవపడినప్పుడు "వాళ్ల చూడు ఎంత బాగా కలిసుంటారో, ఎంత బాగా చదువుకుంటారో" అంటూ ఇతర పిల్లలతో ఎప్పుడూ పోల్చవద్దు. ఇంట్లో పిల్లలతో కూడా పోల్చకూడదు.
- పిల్లలు ఏ విషయంలో దెబ్బలాడుకుంటున్నారో గమనించాలి. గొడవకు కారణం ఎవరో తెలుసుకోవాలి. ఒక సందర్భంలోనే కాకుండా ఇండివిడ్యువల్ అటెన్షన్ పెట్టి పరిశీలించాలి.
- ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే వాళ్లను వేర్వేరుగా కూర్చోబెట్టాలి. ఒకేరూమ్‌లో కూర్చోబెట్టినప్పుడు గొడవ పడటానికి అవకాశం ఉంటుంది.
- పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ల విషయంలో తరచుగా గొడవపడుతుంటారు. ఒకరివి మరొకరు తీసుకోకుండా పేరెంట్స్ గమనించాలి.
- పిల్లలకు ఒకరినొకరు గౌరవించడం నేర్పించాలి. కోపంలో కూడా అగౌరవపరిచేలా తిట్టుకోకూడదని గట్టిగా చెప్పాలి. పిల్లలు కొట్లాడుకునే సమయంలో ఒకరినొకరు తిట్టుకోవడం చూస్తూనే ఉంటాం. అలాంటి మాటలకు ఈ ఇంట్లో చోటు ఉండదు అని చెప్పాలి.
- పిల్లలు కలిసి ఆడుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. ఆడేటప్పుడు వాళ్లను గమనిస్తుండాలి.
- కొడితే పిల్లలు మారతారనుకోవడం సరైనది కాదు. కొడితే మరింత కోపానికి గురవుతారు. వారి మధ్య గొడవ పెరగడానికి దారి తీస్తుంది.
- పిల్లలకు సెల్ఫ్ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్ గురించి నేర్పించాలి. కోపాన్ని ఎలా హ్యాండిల్ చేయాలో చెప్పాలి. డ్రమ్స్ వాయించడం, పది నుంచి ఒకటి వరకు అంకెలు వెనక్కి కౌంట్ చేయమనడం, సౌండ్ ఎక్కువగా పెట్టి డ్యాన్స్ చేయడం... ఇలాంటి పనుల ద్వారా కోపాన్ని డైవర్ట్ చేసుకొమ్మని చెప్పాలి. ఎంత కోపంగా ఉన్నారో ఒక పేపర్ తీసుకుని షార్ట్ స్టోరీ రాయమనాలి. అంతే



కానీ కొట్టడం, గిల్లడం, కొరకడం చేయకూడదని వివరించాలి.

- ఇతర పిల్లల ఫీలింగ్స్‌పై కామెంట్స్ చేయడం ద్వారా పిల్లల్లో సానుభూతి పెంపొందేలా చేయాలి. "బన్నీని చూడు. ఎలా ఏడుస్తున్నాడో.. పాపం కదా!" అని కామెంట్స్ చేయడం ద్వారా పిల్లల్లో సానుభూతి పెరిగేలా చేయాలి.
- రాత్రి డిన్నర్‌ను కుటుంబసభ్యులందరూ కలిసి చేయాలి. ఆ సమయంలో ఆ రోజు ఎవరు ఏం చేశారో తెలుసుకుని అభినందించుకునేలా ప్రోత్సహించాలి. ఇలా చేయడం వల్ల పిల్లల్లో మార్పును తీసుకురావచ్చు.
- పిల్లలిద్దరూ గొడవ పడుతున్నా వాళ్లు కిడ్స్ అని తల్లిదండ్రులు గుర్తుపెట్టుకోవాలి. ఏదో ఒక టైంలో ఏ పిల్లవాడైనా తమ సిబ్లింగ్స్ పట్ల కోపంగా వ్యవహరిస్తారు, కొట్లాడతారు. పెద్దవాళ్లు అవుతున్న కొద్దీ వాళ్లలో మార్పు కనిపిస్తుంది.

సండే సెలబ్రిటీ



'గ్యాంగ్స్ ఆఫ్ వాసీపూర్', 'లంచ్ బాక్స్', 'ఎలిఫెంట్ విష్పరర్స్', 'కిల్'... ఇలా భిన్నమైన కథనాలతో ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకున్న నిర్మాత **గునీత్ మోంగా కపూర్**. వాటిలో 'ఎలిఫెంట్ విష్పరర్స్'... గత ఏడాది ఆస్కార్ అవార్డును సొంతం చేసుకుంది. తాజాగా ఆమె తీసిన 'గెహరా... గెహరా' వెబ్ సిరీస్ జీ5లో ప్రసారమవుతోంది. ఆస్కార్ తర్వాత మారిన తన జీవితం గురించి, మారుతున్న ప్రేక్షకుల అభిరుచుల గురించి ఆమె 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

ఎంత లోకల్ అయితే అంత గ్లోబల్ అవుతాం

'ఎలిఫెంట్ విష్పరర్స్'కు ఆస్కార్ లభించిన తర్వాత మీ జీవితంలో వచ్చిన మార్పులేమిటి?

జాతీయంగా, అంతర్జాతీయంగా చాలా మంచి పేరు వచ్చింది. ఆస్కార్ లభించిన తొలి నిర్మాణ సంస్థ మాదే కావటం, ఆస్కార్ లభించిన తొలి భారతీయ చిత్రం కావటం- ఇలా అనేక రికార్డులు కూడా నమోదయ్యాయి. ఇవన్నీ ఒక ఎత్తైతే- అనేక అంతర్జాతీయ నిర్మాణ సంస్థలు మాతో భాగస్వాములు కావటానికి ముందుకు వస్తున్నాయి. అంతర్జాతీయ సంస్థలకు మనం మంచి సినిమాలు తీయగలమనే నమ్మకం కుదిరింది.

ఓటీటీ మన జీవితంలో భాగమయిన తర్వాత సినిమాను చూసే విధానం ఏదైనా మారిందా?

ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు కొవిడ్ చాలా మేలు చేసింది. ఆ సమయంలో ఎక్కువ మంది ఇళ్లల్లోనే ఉన్నారు. వారిలో ఎక్కువ శాతం మంది ఏం చేయాలో తెలియక ఓటీటీల్లో చిత్రాలు చూడటం మొదలుపెట్టారు. భారతీయ భాషల్లో వచ్చే సినిమాలు, సిరీస్‌లు, షోలు మాత్రమే కాకుండా... ఇంగ్లీషు, కొరియన్, జపనీస్‌లాంటి భాషల్లో వచ్చిన కంటెంట్‌ను కూడా చూసేశారు. ఓటీటీకి ప్రేక్షకులను ఆకర్షించే శక్తి ఉంది. దీనివల్ల ప్రేక్షకుల్లో మార్పు తప్పనిసరిగా వస్తుంది. కొవిడ్‌వల్ల ఆ మార్పు వేగంగా వచ్చేసింది. అంటే మామూలుగా ఐదేళ్లలో రావాల్సిన మార్పు ఏడాదిలో వచ్చేసింది. దీనివల్ల ప్రేక్షకుల అభిరుచి మారింది.

మంచి కంటెంట్ ఇవ్వాలనే ఒత్తిడి ఫిల్మ్ మేకర్స్‌పై పెరిగిందా?

ఒత్తిడి పెరిగింది. కానీ ఆ ఒత్తిడి ప్రేక్షకుల నుంచి రావటం లేదు. ఫిల్మ్‌మేకర్స్ తమకు తాముగానే అంతర్జాతీయ కంటెంట్‌తో పోటీ పడుతున్నారు. ఏ ఓటీటీ ప్లాట్‌ఫామైనా తీసుకోండి. దానిలో మన వాళ్లు తీసిన కంటెంట్ ఉంటుంది. ఇతరులు తీసిన కంటెంట్ కూడా ఉంటుంది. ప్రేక్షకులు ఏ కంటెంట్ బావుంటే దాన్నే చూస్తున్నారు. దీని వల్ల ఫిల్మ్ మేకర్స్ మీద మంచి కంటెంట్ ఇవ్వాలనే ఒత్తిడి పెరిగింది. ఇక్కడొక విషయం చెప్పాలి. చిత్ర నిర్మాణంలో మనం ప్రపంచంలో ఎవరి కన్నా తక్కువ కాదు. మన దగ్గర అద్భుతమైన టాలెంట్ ఉంది. ఈ టాలెంట్ బయటకు రావాల్సిన సమయం ఆసన్నమయింది. ఇక ఛాలెంజ్‌ల విషయానికి వస్తే- సినిమాను కావాలంటే మూడు నెలల్లో తీయవచ్చు. కానీ ఎనిమిది గంటలు ఉండే వెబ్ సిరీస్ తీయాలంటే ఏడాది నుంచి రెండేళ్లు పడుతుంది. ఇదీ మన ముందున్న సవాల్.

సినీ రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మధ్య దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. మీరు ఎప్పుడైనా వివక్ష ఎదుర్కొన్నారా?



ఒక మహిళగా నాకు ఎటువంటి సమస్యలు రాలేదు. కానీ వయస్సు విషయంలో వచ్చింది. నన్ను చాలా మంది చిన్న పిల్లలా చూసేవారు. నేను చిన్న వయస్సులోనే సినీ రంగంలోకి వచ్చాను. 26 ఏళ్ల వయస్సులో 'గ్యాంగ్స్ ఆఫ్ వాసీపూర్' తీశా. 28 ఏళ్లకు 'లంచ్‌బాక్స్' సినిమా తీశాను. అవి తీసింది నేనేనంటే ఎవరూ నమ్మేవారు కాదు. 'మీ టూ' ఉద్యమం వచ్చిన తర్వాత నాకు ఎదురవుతున్న సమస్య ఏమిటో అర్థమయింది. అప్పటిదాకా 'నా వయస్సు చిన్నది కాబట్టి.. నన్ను సీరియస్‌గా తీసుకోవటం లేదు' అని ఎప్పుడూ అనుకోలేదు. నా పని బాగా చేయాలనుకున్నానంతే! 'మీ టూ' ఉద్యమం సమయంలో మహిళ వివక్షతో పాటుగా వయస్సుకు సంబంధించిన వివక్ష కూడా ఉంటుందనే విషయం అర్థమయింది.

> **దక్షిణాది సినిమాలపై మీ అభిప్రాయమేమిటి?**
>
> స్టోరీ టెల్లింగ్‌లో దక్షిణాది ఫిల్మ్ మేకర్స్ తమదైన ముద్ర వేసుకుంటున్నారు. చాలామంది పాన్ ఇండియా కథలకు ఎక్కువ ప్రాధాన్యత ఉందనుకుంటూ ఉంటారు. మనం ఎంత లోకల్ అయితే అంత గ్లోబల్ అవుతాం. దీనికి 'ఎలిఫెంట్ విష్పరర్స్' ప్రత్యక్ష నిదర్శనం. ఇక నా విషయానికి వస్తే... దక్షిణాది నిర్మాతలతో కలిసి పనిచేయటానికి నేను సిద్ధంగా ఉన్నాను. మంచి ప్రపోజల్స్ వస్తే తప్పనిసరిగా కలిసి పనిచేస్తాను.

మీ దృష్టిలో సినీ రంగంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలేమిటి?

అనేక సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వీటిలో టాలెంట్‌ను దెబ్బతీసే ఒక సమస్య కూడా ఉంది. సాధారణంగా సినీ రంగంలో పనిచేసే మహిళలకు... వారు పెళ్లి చేసుకున్న తర్వాత బ్రేక్ వస్తుంది. కొద్ది కాలం తర్వాత మళ్లీ తిరిగి వస్తే- వారికి పని దొరకదు. ఒకప్పుడు అద్భుతమని పొగిడిన వాళ్లు కూడా పని ఇవ్వటానికి ముందుకు రారు. ఈ వివక్ష పురుషులకు ఉండదు. ఎడిటర్స్, రైటర్స్, సినిమాటోగ్రాఫర్స్, డ్యాన్సర్స్- ఇలా నేను ఎంతోమందితో మాట్లాడాను. మిడ్ కెరీర్ ఎంట్రీ అనేది దాదాపు అసాధ్యమనే చెప్పాలి. సోషల్ మీడియాలో చూస్తే వాళ్లకు అన్నీ ఉన్నాయనిపిస్తాయి. కానీ మాట్లాడితే అసలు విషయం తెలుస్తుంది.

మీరు సోషల్ మీడియాను ఫాలో అవుతారా?

అవుతాను. సోషల్ మీడియా కూడా పాప్‌కల్చర్ లాంటిదే! మనకు వెంటనే రెస్పాన్స్ తెలిసిపోతుంది. ఇంతకుముందు మనకు ప్రజల నుంచి స్పందన తెలియాలంటే వెంటనే తెలిసేది కాదు. కానీ ఇప్పుడలా కాదు. నేరుగా ప్రేక్షకుల నుంచే మనకు స్పందన తెలిసిపోతుంది. ఇదొక మంచి కోణం. అంతే కాదు. సోషల్ మీడియా వల్ల ప్రజలకు సాధికారత వచ్చింది. యూట్యూబ్‌లో పెట్టే కొన్ని షార్ట్ ఫిల్మ్స్ చూస్తుంటే ముచ్చటేస్తుంది. 'ఇంత టాలెంట్ మన దగ్గర ఉందా?' అనిపిస్తుంది. అయితే సోషల్ మీడియాలో అపరిమితమైన సమాచారం ఉంటుంది. మనకు అవసరమైనదాన్ని తెలుసుకోవాలంటే ఫిల్టర్స్ తప్పనిసరి. బహుశా ప్రస్తుత తరం వారికి సోషల్ మీడియా అవసరమేమో! ఒకప్పుడు ఫోన్ నెంబర్లు గుర్తు పెట్టుకొనేవారు. ఇప్పుడా అవసరం లేదు. మొబైల్స్ వచ్చేసాయి. సోషల్ మీడియా కూడా అంతే! ఇక నా విషయానికి వస్తే- ఒక ఫిల్మ్ మేకర్‌గా మార్పునకు సిద్ధంగా ఉండాలి. కొత్త కొత్త ఆవిష్కరణలను గౌరవించాలి. వాటిని వాడుకోవటానికి సిద్ధంగా ఉండాలి.

● సివిఎల్ఎన్ ప్రసాద్

చైతన్యం

పర్యావరణ గీతిక



కాలుష్యం లేని ప్రపంచం... ఇదే ఆ బాలిక నినాదం. పర్యావరణంలో సంభవిస్తున్న మార్పులతో... పొంచివున్న ప్రమాదంపై అవగాహన కల్పిస్తూ... ప్రపంచమంతా పర్యటిస్తోంది. 'మన భూమిని మనమే కాపాడుకొందాం' అంటూ పిలుపునిస్తోంది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన పదో తరగతి విద్యార్థిని గీతిక... తన చైతన్య యాత్ర గురించి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చింది.

"ఇప్పుడు ఎక్కడ చూసినా కాలుష్యం. జలం, వాయువు, భూమి... తెలిసీ తెలియక మనం చేస్తున్న పనులవల్ల ప్రకృతి కళ తప్పింది. పర్యావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకొంటున్నాయి. ఇవి మనకు ప్రమాద సంకేతాలు. పొంచివున్న ఈ పెను ముప్పును గ్రహించకపోతే సమస్త జీవజాతి అంతరించిపోతుంది. మనిషి స్వార్థం, అవగాహనా రాహిత్యమే ఇందుకు కారణం. ఇప్పటికైనా మేల్కొనకపోతే భవిష్యత్తు అంధకారం అవుతుంది. ముఖ్యంగా ఇబ్బడిముబ్బడిగా వ్యర్థాలు భూమికి భారమవుతున్నాయి. మన ముందున్న తక్షణ కర్తవ్యం... భూమాతను కాపాడుకోవడం. అదే నా నినాదం.. 'మన భూమిని మనమే కాపాడుకొందాం'. ఈ నినాదం ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు దేశదేశాలూ తిరుగుతున్నాను. నేపాల్, మలేషియా, శ్రీలంక తదితర దేశాల్లో పర్యటించాను. కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు భారత్ అంతా చుట్టివచ్చాను.


> **ఇదీ పరిస్థితి...**
>
> పర్యావరణ కాలుష్యంవల్ల భవిష్యత్తులో సంభవించే పరిణామాల గురించి తెలుసుకొంటుంటే ఎంతో ఆందోళన కలుగుతుంది. 'నాసా' అంచనా ప్రకారం ఇప్పుడున్న పరిస్థితులు ఇలాగే కొనసాగితే... 2100 నాటికి అడవులన్నవే అంతరించిపోతాయి. 2050 నాటికి సముద్ర జలాల్లో చేపల కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలే ఎక్కువగా కనిపిస్తాయి. 2070 నాటికి వరల్డ్ కోరల్ రీఫ్‌లు సైతం మాయమైపోతాయి. అభయారణ్యాల్లో ఏటా 50 వేల రకాల జీవులు అంతరించిపోతున్నాయి. ఇలాంటి వాస్తవాలు తెలుసుకున్నప్పుడు కంటి మీద కునుకు ఉండదు. ఈ పరిస్థితి మారితేనే జీవజాతికి మనుగడ.

రీల్స్‌తో మొదలై...

ప్రస్తుతం నేను తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో పదో తరగతి చదువుతున్నా. మాది సాధారణ మధ్యతరగతి కుటుంబం. పర్యావరణం వైపు నన్ను నడిపించింది, నాకు ప్రేరణ కల్పించింది యూట్యూబ్ రీల్స్. అప్పుడు నేను ఆరో తరగతి చదువుతున్నా. యూట్యూబ్‌లో ఒక షార్ట్ వీడియో చూశాను. అందులో భూమికి పొంచివున్న ముప్పు గురించి వివరించారు. అది చూసి భయం వేసింది. మరింత సమాచారం కోసం అలాంటి వీడియోలు రోజూ చూడడం మొదలుపెట్టాను. వాటివల్ల నాకు చాలా విషయాలు తెలిశాయి. మనం ఎంత ప్రమాదంలో ఉన్నామో అర్థమైంది. నిజానికి సామాజిక మాధ్యమాలు, స్మార్ట్‌ఫోన్లను సరైన రీతిలో ఉపయోగించుకొంటే అరచేతిలోనే ఎంతో సమాచారం లభిస్తుంది. అలా సామాజిక మాధ్యమాలనే వేదికగా చేసుకొని, జాతీయ, అంతర్జాతీయ పర్యావరణ బృందాలను పరిచయం చేసుకున్నాను. వారితో చర్చల్లో పాల్గొని అవగాహన పెంచుకున్నాను.

ఊరూరా ప్రచారం...

క్రమంగా చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లి, అక్కడి పరిస్థితులు తెలుసుకున్నాను. కొన్నాళ్లకు నేను ఒక వాలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేసుకున్నాను. వారితో కలిసి ఇతర పట్టణాలు, పల్లెల్లో పర్యటించడం మొదలుపెట్టాను. అక్కడి పరిసరాలను పరిశీలించి, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వారికి వివరిస్తున్నాను. వెంటనే మేల్కొనకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తూ, చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తున్నాను. గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు సాగు భూములు తగ్గిపోవడం గమనించాను. అది ఎంతో బాధ కలిగించింది. 'ఈ పరిణామం వల్ల భూమికి నష్టం వాటిల్లుతుంది. బీడు పెట్టవద్దు. వ్యవసాయం చేయండి. నేలతల్లి పచ్చగా ఉంటేనే ఊరికీ, ఇంటికీ మంచిది. అలాగే రసాయన ఎరువులు, పురుగు మందులూ వాడడమంటే నేల తల్లి కడుపులో విషయం పోయడమే. ఆ తల్లి ఆరోగ్యంగా ఉండాలంటే సహజ ఎరువులతో సేద్యం చేయాలి' అని చెబుతున్నాను. వాళ్లు కూడా.. 'ఇంత చిన్నపిల్ల చెప్పేదేంట'ని అనుకోకుండా... శ్రద్ధగా వింటున్నారు.

> **పెళ్లికి దాచిన సొమ్ముతో...**
>
> 
>
> నాకు ఇద్దరు ఆడ బిడ్డలు. వాళ్ల పెళ్లిళ్ల కోసం దాచిన డబ్బులు... నా పెద్దకూతురు గీతిక పర్యావరణ ప్రచారాలకూ, ప్రయాణాలకూ ఖర్చు పెడుతున్నాను. బంధుమిత్రులు హెచ్చరిస్తూనే ఉంటారు. అయినా ఇంత చిన్న వయసులో అంత పెద్ద ఆలోచనతో గీతిక అడుగు వేస్తూ ఉంటే... కాదనలేకపోతున్నాను. మన తీరులో మార్పు రాకుంటే... ఈ భావి, మానవాళి ఏమవుతుందో గీతిక వివరిస్తూ ఉంటే ఒళ్లు జలదరిస్తుంది. మన కోసం కాకపోతే మన భవిష్యత్తు తరాల కోసమే కదా ఖర్చుపెట్టేదంతా అనుకుంటాను.
>
> - **వెంకటేశన్**, గీతిక తండ్రి

నాలుగు వందలకు పైగా...

పర్యావరణంపై ఇప్పటి వరకు నేను నాలుగు వందలకు పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాను. జూమ్‌లో అనేక అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నాను. శ్రీలంకలో భారత డిప్యూటీ హైకమిషనర్‌ను కలిశాను. అలాగే ఐక్యరాజ్య సమితి డిప్యూటీ సెక్రటరీ జనరల్ నా కృషికి ప్రశంసలు అందుకున్నాను. గ్లోబల్ ప్లాంటేషన్ ప్రచారానికి పెరూలో నిర్వహించిన 'ది బ్రీయింగ్ ఆఫ్ ది ప్లానెట్-2021'కి ఆహ్వానం అందింది. కానీ కొవిడ్ కారణంగా వెళ్లలేకపోయాను. నా కార్యక్రమాలన్నిటికీ ఒక వేదిక ఉండాలన్న ఆలోచనతో తొమ్మిదేళ్ల వయసులో 'యాదుమది ఇంటిగ్రేటెడ్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థ నెలకొల్పాను. దాని ద్వారా లక్ష మొక్కలు నాటాను.

ప్రశంసలు... పురస్కారాలు...

పర్యావరణ పరిరక్షణ కోసం నేను చేస్తున్న ప్రయత్నానికి గుర్తింపుగా ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి అవార్డులు అందుకున్నాను. అచీవర్స్ ఐకాన్ అవార్డు, బెస్ట్ చైల్డ్ ఎన్విరాన్మెంటలిస్ట్-2020 , యంగ్ క్లైమేట్ యాక్టివిస్ట్, గ్లోబల్ కిడ్స్ అచీవర్స్ అవార్డు-2021, ఇండియన్ ఐకాన్ అవార్డు, ఫేమ్ ఐకాన్ అవార్డు, గ్లోబల్ కిడ్స్ అచీవర్స్ అవార్డు, ఇంటర్నేషన్ సోషల్ సర్వీస్ అవార్డు, ఇంటర్నేషనల్ యంగ్ ఎకో-అవార్డులు వాటిలో ఉన్నాయి. 'యూత్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్డీజీ)' ఆన్‌లైన్ సమ్మిట్‌లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించింది. నేను ఇన్ని నగరాలు, దేశాలు తిరగగలుగుతున్నానంటే అందుకు మా నాన్న వెంకటేశన్ ప్రోత్సాహంవల్లే. ఏదిఏమైనా పర్యావరణ పరిరక్షణ అనేది ఒక ఉద్యమంలా నడిపించాలనేది నా లక్ష్యం."

● పి.నరేంద్ర, తిరుపతి

అలనాటి కథ



నాకు తెలిసిన కొత్త నిజాం

రాజులు.. రాజ్యాలు లేకపోయినా- రాజ కుటుంబ వారసత్వం కొనసాగుతూనే ఉంటుంది. లాస్ట్ నిజాంగా పేరుగాంచిన ముఖం ఝా కుమారుడు అజ్మత్ ఝా ది కూడా ఈ తరహా వారసత్వమే. తండ్రి మరణం తర్వాత తొమ్మిదో నిజాంగా వారసత్వ పదవిని పొందిన- అజ్మత్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సినిమాటోగ్రాఫర్ అని.. గాంధీ సినిమా తీసిన డేవిడ్ అటెన్‌బరోతోను.. ఒకప్పటి జేమ్స్ బాండ్ సిన్ కానరీతోను.. అనేక గొప్ప చిత్రాలు తీసిన స్టీవెన్ స్పీల్‌బర్గ్‌తోను కలిసి పనిచేశాడని అతి కొద్ది మందికి మాత్రమే తెలుసు!

అజ్మత్ నాకు చిన్ననాటి నుంచి తెలుసు. ప్రిన్సెస్ ఎస్రాతో నాకున్న స్నేహం వల్ల చిన్నప్పటి నుంచి నాకు తనంటే ప్రత్యేకమైన అభిమానమనే చెప్పాలి. ఒక రాజ కుటుంబం నుంచి వచ్చినా- ఆ వాసనలేమి కనబడని వ్యక్తి అజ్మత్. తన గురించి తలుచుకున్నప్పుడు అనేక జ్ఞాపకాలు నాకు గుర్తుకొస్తాయి. చౌమల్లా ప్యాలెస్‌కు పునర్వైభవాన్ని తీసుకురావటం కోసం మరమ్మత్తులు చేయిస్తున్న సమయంలో ప్రిన్సెస్ ఎస్రా ఐటీసీ కాకతీయ హోటల్‌లో ఉండేవారు. ఒక రోజు ప్రిన్సెస్



ఎస్రాను కలవటానికి హోటల్‌కు వెళ్లాను. అక్కడ అజ్మత్ కనిపించాడు. తన పుట్టిన రోజు వచ్చేస్తోందని గుర్తుకొచ్చింది. "పుట్టిన రోజు బహుమతిగా ఏం కావాలి?" అని అడిగాను. వెంటనే తడుముకోకుండా "బాల్ పెన్" అన్నాడు. నాకు ఆశ్చర్యమేసింది. "బాల్‌పెన్ చాలా?" అడిగా. "నాకు బాల్‌పెన్ చాలు" అన్నాడు. ఆ తర్వాత బ్రేక్‌ఫాస్ట్ చేశాం. నేను లైబ్రరీకి వెళ్లాలని లేచాడు. "నువ్వు ఎలాంటి పుస్తకాలు చదువుతావు?" అని అడిగాను. "చరిత్ర గురించి.." అన్నాడు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే- సాధారణంగా ఈ తరం పిల్లలకు చరిత్ర పట్ల పెద్ద ఆసక్తి ఉండదు. ఫోటోగ్రఫిలాంటి కళల పట్ల అభిరుచి ఉన్నవారు కూడా అరుదుగా కనిపిస్తారు. అలాంటి వ్యక్తుల్లో అజ్మత్ ఒకడు. అమెరికాలోని లాంగ్ ఐలాండ్‌లో సినిమాటోగ్రఫి కోర్స్ చేశాడు. ఆ సమయంలోనే తనకు టర్కీకి చెందిన ప్రిన్సెస్ నాజ్ పరిచయమయింది. వారిద్దరు పెళ్లి చేసుకున్నారు. ఈ పెళ్లి వార్త తెలిసిన తర్వాత - ప్రిన్సెస్ ఎస్రాను - "పెళ్లికి ఏం బహుమతి ఇచ్చావు?" అని అడిగాను. "ఎమరాల్డ్ సెట్.. రూబీలు.. ముత్యాలు.. వజ్రాలు" అని సమాధానమిచ్చింది. బహుశా అవన్నీ చాలా అరుదైనవే అయిఉండాలి.

ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. సాధారణంగా రాజకుటుంబాల వారసులు వ్యాపారాలలోకి ప్రవేశిస్తారు. కొందరు రాజకీయ నాయకులు అవుతారు. ఈ రెండింటి ద్వారా తమ వారసత్వాన్ని కొనసాగించటానికి ప్రయత్నిస్తారు. సామాన్య మధ్యతరగతి ప్రొఫెషనల్స్ మాదిరిగా ఒకో మెట్టు ఎక్కి పైకి ఎదిగేవారు అతి తక్కువ మంది. అలాంటి వాళ్లలో అజ్మత్ ఒకడని కచ్చితంగా చెప్పవచ్చు. ఎందుకంటే అజ్మత్ తాను చదువుకున్న సమయంలో ఒక వీక్లీ న్యూస్‌పేపర్‌లో ఫోటోగ్రాఫర్‌గా పనిచేసేవాడు. ఫోటో గ్యాలరీలలో షోలు పెట్టేవాడు. ఆ సమయంలోనే తనకు ఫోటోగ్రఫి అంటే చాలా ఇష్టముందనే విషయాన్ని గ్రహించాడు. దానినే ఒక వృత్తిగా ఎంచుకున్నాడు. వృత్తిగా ఎంచుకోవటమే కాదు దానిలో అత్యున్నత స్థానానికి చేరుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు.



ప్రిన్సెస్ ఎస్రా, ఆవిడ కుటుంబ సభ్యులు హైదరాబాద్ వచ్చినప్పుడు జ్ఞాన్‌బాగ్‌కు వస్తూ ఉంటారు. నేను కూడా వాళ్లు ఉండే ఫలక్‌నామా ప్యాలెస్‌కు వెళ్తూ ఉంటా. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఫలక్‌నామా ప్యాలెస్‌ను తాజ్ గ్రూపుకు లీజ్‌కు ఇచ్చిన తర్వాత- ప్రిన్సెస్ ఎస్రా ఆ ఆవరణలోనే ఒక చిన్న అందమైన భవంతిని కట్టుకుంది. నిజాం వారసత్వ వైభవమంతా ఆ భవంతిలో మనం చూడవచ్చు. ప్రిన్సెస్ ఎస్రా కుటుంబ సభ్యులు ఎప్పుడూ హైదరాబాద్‌కు వచ్చినా అక్కడే నివసిస్తూ ఉంటారు. అజ్మత్ కూడా హైదరాబాద్‌కు వచ్చినప్పుడు అక్కడే నివసిస్తాడు. నిజాం కుటుంబం సంప్రదాయాలను, ఆచారాలను కొనసాగిస్తూ ఉంటాడు. ఈ ఆధునిక కాలంలో గత కాలపు నిజాం వారసత్వాన్ని కొనసాగించటం అంత సులభం కాదు. అజ్మత్ ఆ విషయంలో విజయం సాధించాడనే చెప్పాలి.

● రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



ఏపీలో దేవర టికెట్ ధరలు పెంపు



జూనియర్ ఎన్టీఆర్ నటించిన పాన్ ఇండియా సినిమా 'దేవర' టిక్కెట్ల ధరలు పెంపు, స్పెషల్ షో లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 27న విడుదల అవుతోన్న ఈ సినిమా మొదటి రోజు ఆరు షో లు.. అక్టోబరు 9వరకూ ఐదు షో ల చొప్పున రాష్ట్రంలో రిలీజైన అన్ని థియేటర్లలో ఆడించుకోవచ్చు. టిక్కెట్ ధరలు పెంచుకోవడానికి నిర్మాతల వినతిని పరిశీలించిన ప్రభుత్వం 60రూపాయల నుంచి 135రూపాయల వరకూ పెంచుకొనేందుకు అనుమతిచ్చింది. మొదటి రోజు అర్ధరాత్రి 12గంటలకు బెనిఫిట్ షో, ఉదయం ఆరింటికే మార్నింగ్ షో నుంచే సినిమా ప్రదర్శనకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మాతలకు అనుమతి ఇచ్చింది. విడుదలైన రెండో రోజు(28) నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ ఐదు షో లు ప్రదర్శించుకోవచ్చు. అక్టోబరు 6తర్వాత సాధారణ ప్రదర్శనలు ఉంటాయి.

వేధించడం మా విధానం కాదు : పవన్ కల్యాణ్



'రాజకీయాలకు అతీతంగా చిత్ర పరిశ్రమకు మేలు చేయాలనేదే చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానం. వైకాపా ప్రభుత్వం తరహాలో నిర్మాతలను, సినీ నటులను వేధించడం మా ప్రభుత్వ విధానం కాదు' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన 'దేవర' చిత్రం ప్రత్యేక ప్రదర్శనలు, టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఎన్టీఆర్, నిర్మాణ సంస్థ ఎన్టీఆర్ ఆర్ట్స్ బేనర్ ట్వీట్ చేసింది. దీనిపై పవన్‌కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. వైసీపీ పాలనలో సినీ ప్రముఖులు ఎన్ని కష్టాలు పడ్డారో నాకు తెలుసు. వ్యక్తులు, రాజకీయాలతో మాకు సంబంధం లేదు, పరిశ్రమను మేం గౌరవిస్తాం. మీ సినిమాకు మంచి జరగాలి' అని 'దేవర' యూనిట్‌కు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)



వెంకీ షూటింగ్‌లో బాలయ్య

అగ్ర హీరోల షూటింగ్స్ ఒకేచోట జరుగుతున్నప్పుడు ఒక హీరో సెట్‌కు మరో హీరో వెళ్లడం, సరదాగా కాసేపు గడపడం, సినిమాల గురించి మాట్లాడుకోవడం గతంలో ఓ అలవాటుగా, సంప్రదాయంగా ఉండేది. హీరోల మధ్య ఐకమత్యానికీ, స్నేహబంధానికీ అటువంటి సంఘటనలు అద్దం పట్టేవి. చాలా రోజుల తర్వాత నందమూరి బాలకృష్ణ మళ్లీ ఆ సంప్రదాయాన్ని గుర్తుకు తెచ్చారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న తాజా చిత్రం షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఆ సమయంలో అక్కడే ఉన్న బాలకృష్ణ ఈ విషయం తెలుసుకుని వెంకటేశ్ షూటింగ్ స్పాట్‌కు వెళ్లి సందడి చేశారు. బాలయ్య, వెంకీ మంచి స్నేహితులు. అలాగే అనిల్ రావిపూడి బాలయ్యతో 'భగవంత్ కేసరి' చిత్రం రూపొందించారు. బాలయ్య రాకతో టీమ్ చాలా థ్రిల్ అయింది.



వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎన్టీఆర్ తనయుడు, ఛాయాగ్రాహకుడు నందమూరి మోహనకృష్ణ, ఆయన కుమార్తె మోహన రూప శనివారం కలసి రూ. 25 లక్షల విరాళం చెక్కు అందజేశారు.

మా మధ్య అలాంటి సంబంధం లేదు



తన భార్య ఆర్తి రవికి విడాకులు ఇవ్వాలని తాను తీసుకున్న నిర్ణయాన్ని తన తల్లిదండ్రులు అంగీకరించారని, తన సంతోషమే వారికి ముఖ్యమని హీరో 'జయం' రవి స్పష్టం చేశారు. ఆయన నటించిన తాజా చిత్రం 'బ్రదర్' సినిమా ఆడియో విడుదల వేడుక శనివారం చెన్నైలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... "ఇంతకాలం ఇండస్ట్రీలో ఎలాంటి గాసిప్స్ లేకుండా జీవితాన్ని గడిపాను. ఇపుడు నాకు, పరాయి స్త్రీకి సంబంధం ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారు. ఇది చాలా తప్పు. గాయని కెనీషాకు నాకు మధ్య ఎలాంటి సంబంధం లేదు. ఎంతోమందికి ఆమె ప్రాణం పోశారు. ఆర్తికి తెలియకుండా విడాకుల నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటన చేశారు. విడాకుల విషయంపై రెండు సార్లు నోటీసులు పంపించాను. ఇదే విషయంపై ఆర్తి తండ్రి వచ్చి నా తల్లిదండ్రులతో చర్చించారు. ఇంత జరిగినా తనకు తెలియకుండా తీసుకున్నట్టు చెప్పడం షాకింగ్‌కు గురిచేసింది. విడాకుల గురించి నా పెద్ద కుమారుడికి కూడా వివరించాను. అందరు పిల్లల్లాగే అతను కూడా మేమిద్దరం కలిసివుండాలని కోరాడు. నా ఇద్దరు కుమారులు నా వద్దనే ఉంటున్నారు. ఇపుడు నేను కోరేది ఒక్కటే.. ప్రైవేట్ లైఫ్ ప్రైవేట్ లైఫ్‌గానే ఉండనివ్వండి. గాయని కెనీషా 600కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. మేమిద్దరం ఒక హీలింగ్ సెంటర్‌ను నెలకొల్పి అనేక మందికి సాయం చేయాలని ప్లాన్ చేస్తున్నాం. దాన్ని పాడు చేయవద్దు. అనవసరంగా నా గురించి, కెనీషా గురించి చెడుగా మాట్లాడవద్దు' అని కోరారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

రజనీ.. ఓ సుప్రీమ్ స్టార్



రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ 33 ఏళ్ల తర్వాత కలసి నటించిన సినిమా 'వేట్టయాన్'. తాజాగా ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమాన్ని చెన్నైలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ గురించి రజనీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ "ఒకానొక సమయంలో అమితాబ్ బచ్చన్ సినీ నిర్మాతగా భారీ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయారు. తన దగ్గర పనిచేసే వాచ్‌మెన్‌కు కూడా జీతం ఇవ్వలేని పరిస్థితి. ఏం చేయాలో అర్థం కాక తనకు ఎంతో ఇష్టమైన జూహూ ఇంటిని వేలానికి పెట్టారు. అప్పుడు బాలీవుడ్ మొత్తం ఆయన్ను చూసి నవ్వింది. కానీ ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి కోలుకుని.. మరో మూడేళ్లలో.. వరుస సినిమాలు..'కౌన్ బనేగా కరోడ్‌పతి' షోతో మళ్లీ నిలదొక్కుకున్నారు. జూహూలోని తన ఇంటితో పాటు మరో మూడు ఇళ్లను అమితాబ్ తిరిగి కొనుగోలు చేశారు" అని రజనీ చెప్పారు. ఈ వేడుకకు హాజరు కాలేకపోయినా.. అమితాబ్ ఓ వీడియో పంపి అభిమానులను ఖుషీ చేశారు. ఆ వీడియోలో అమితాబ్ మాట్లాడుతూ "ఇది నా తొలి తమిళ చిత్రం. రజనీకాంత్.. అందరిలో ఓ సుప్రీమ్ స్టార్. 1991లో రజనీ, నేను కలసి నటించిన చిత్రం 'హమ్'. ఇందులో రజనీ నా సోదరుడిగా నటించారు. షూటింగ్ విరామంలో నేను ఏ.సీ కార్‌లో విశ్రాంతి తీసుకునే సమయంలో.. రజనీ ఫిల్మ్ సెట్స్‌లో కింద పడుకునేవారు. ఈ చిన్న ఉదాహరణ చాలు ఆయన ఎంత సింపుల్‌గా ఉంటారో చెప్పడానికి" అని అన్నారు.

అమితాబ్ కోసం ప్రకాశ్‌రాజ్...

ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ పాత్ర తమిళ్ వెర్షన్‌కు నటుడు ప్రకాశ్‌రాజ్ డబ్బింగ్ చెప్పడం విశేషం. సినిమాలో రజనీ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా కనిపించనున్నారు. అమితాబ్, రజనీకి సీనియర్‌గా సత్యదేవ్ అనే పాత్రలో నటిస్తున్నారు. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం దసరా సందర్భంగా అక్టోబర్ 10న విడుదలవుతోంది.

రవికుమార్ చౌదరి ఫ్లాష్‌బ్యాక్ ఏమిటి?



'యజ్ఞం', 'పిల్లా నువ్వు లేని జీవితం' వంటి హిట్ చిత్రాలు అందించి, ఇటీవల రాజ్‌తరుణ్ నటించిన 'తిరగబడరా సామీ' తో మరో విజయం అందుకొన్న దర్శకుడు రవికుమార్ చౌదరి తన కొత్త చిత్రం వివరాలు వెల్లడించారు. 'ఫ్లాష్‌బ్యాక్' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఈ సినిమా ఉంటుందని, న్యూ ఏజ్ లవ్‌స్టోరీగా రూపొందుతుందని ఆయన తెలిపారు. 'లేనిది ఎవరికి?' అనేది ట్యాగ్ లైన్. ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌కు రచన: డైమండ్ రత్నబాబు, పాటలు: సుద్దాల అశోక్ తేజ, వరంగల్ శ్రీను, సంగీతం: జేబీ, ఛాయాగ్రహణం: ప్రభాకరరెడ్డి, సమర్పణ: రిగ్వేద చౌదరి. నటీనటులు, ఇతర వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత కార్తీక్ రెడ్డి రాకాసి చెప్పారు.

రొమాంటిక్ కామెడీ డ్రామా



'హీరో' ఫేమ్ అశోక్ గల్లా, గౌరి ప్రియ జంటగా ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఉద్భవ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "రొమాంటిక్ కామెడీ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను త్వరలోనే మొదలెట్టనున్నాం. అందరినీ కడుపుబ్బా నవ్వించే ఈ చిత్రంలో గుండెలకు హత్తుకునే డ్రామా కూడా ఉంటుంది" అని చెప్పారు.





పంత్, గిల్ శతక మోత


విజయం లాంఛనమేనా?

భారత్ రెండో ఇన్నింగ్స్ 287/4 డిక్లేర్డ్ ● బంగ్లా లక్ష్యం 515

ప్రస్తుతం 158/4 ● అశ్విన్‌కు 3 వికెట్లు ● తొలి టెస్ట్



రిషభ్ పంత్ (128 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లతో 109)



శుభ్‌మన్ గిల్ (176 బంతుల్లో 119 నాటౌట్)

చెన్నై: యువ ఆటగాళ్లు రిషభ్ పంత్ (128 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లతో 109), శుభ్‌మన్ గిల్ (176 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 119 నాటౌట్) శతకాలతోపాటు అశ్విన్ (3/63) స్పిన్ మాయాజాలంతో.. బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్‌లో టీమిండియా పట్టు బిగించింది. ఆటకు మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 81/3తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 287/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 227 రన్స్‌తో కలిపి ప్రత్యర్థి బంగ్లా ముందు 515 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. స్పిన్నర్ మెహిదీహసన్ మిరాజ్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన బంగ్లా శనివారం ఆట ముగిసేసరికి 158/4 స్కోరు చేసింది. కెప్టెన్ నజ్ముల్ షంటో (51 బ్యాటింగ్), షకీబల్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అశ్విన్ 3 వికెట్లు తీశాడు. మరో రెండు రోజుల ఆట మిగిలుండగా.. లక్ష్యానికి బంగ్లా 357 పరుగుల దూరంలో ఉంది. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 376 పరుగులు చేయగా.. బంగ్లా 149 రన్స్‌కే ఆలౌటైంది.

రిషభ్ బాదుడు..: మూడో రోజు ఆటలో పంత్ సెంచరీనే హైలైట్‌గా చెప్పుకోవాలి. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చావు అంచుల వరకు వెళ్లొచ్చిన రిషభ్.. రీఎంట్రీ తర్వాత ఆడిన తొలి టెస్ట్‌లోనే వంద బాదడం విశేషం. మరోవైపు పేలవ షాట్లతో విమర్శలు ఎదుర్కొంటున్న గిల్ కెరీర్‌లో ఐదో శతకంతో ఊపిరిపీల్చుకొన్నాడు. తొలి సెషన్‌లో ఓవర్‌నైట్ బ్యాటర్లు గిల్, పంత్ ఆచితూచి ఆడినా.. వీలు చిక్కినప్పుడల్లా భారీ షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. పంత్ రెండు ఫోర్లతో జోరు చూపగా.. 30వ ఓవర్‌లో మిరాజ్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లతో గిల్ ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. ఆ తర్వాత బంగ్లా బౌలర్లు కొంత కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో భారత బ్యాటర్లు సింగిల్స్ తీస్తూ స్ట్రయిక్ రొటేట్ చేశారు. అయితే, మిరాజ్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన రిషభ్.. సింగిల్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్నాడు. ఇక్కడి నుంచి అతడి ఆట టాప్‌గేర్‌లో సాగింది. 72 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద షంటో క్యాచ్‌ను చేజార్చడంతో బతికి పోయిన పంత్.. షకీబల్ బౌలింగ్‌లో మరో రెండో బౌండ్రీలతో చెలరేగాడు. దీంతో లంచ్ సమయానికి భారత్ 205/3తో నిలిచింది. తిరిగి వచ్చిన తర్వాత రిషభ్ తన ట్రేడ్‌మార్క్ ఫ్లిక్ షాట్లతో వేగంగా ఆడుతూ 100 పరుగులు పూర్తి చేసుకొన్నాడు. కానీ, మెహిదీహసన్ బౌలింగ్‌లో ఫోర్ కొట్టిన పంత్.. అతడికే రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. దీంతో నాలుగో వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రాహుల్ (22 నాటౌట్) సహకారంతో గిల్ బ్యాట్‌ను ఝుళిపించాడు. షకీబల్ బౌలింగ్‌లో రెండు బౌండ్రీలు బాదిన గిల్.. మరో సింగిల్‌తో సెంచరీ మార్క్ చేరుకొన్నాడు. దీంతో టీ సెషన్‌కు ముందు భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

దెబ్బకొట్టిన అశ్విన్..: భారీ లక్ష్యం కోసం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన బంగ్లా ఆరంభంలో ధాటిగా ఆడినా.. అశ్విన్ దెబ్బకు కీలక టాపార్డర్ వికెట్లు చేజార్చుకొంది. టీమిండియా ఫీల్డర్లు కూడా చక్కని క్యాచ్‌లు అందుకోవడంతో బంగ్లా డీలాపడింది. ఓపెనర్లు జకీర్ హసన్ (33), షాద్‌మన్ ఇస్లాం (35) ఛేదనను దూకుడుగానే ఆరంభించారు. ముఖ్యంగా జకీర్ వన్డే తరహా షాట్లతో భారత బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. బుమ్రా వేసిన తొలి ఓవర్‌లో రెండు బౌండ్రీలు బాదిన జకీర్.. తర్వాత సిరాజ్ బౌలింగ్‌లో 6,4,4తో చెలరేగాడు. దీంతో రెండో సెషన్ ముగిసే సమయానికి బంగ్లా వికెట్ కోల్పోకుండా 56 పరుగులు చేసింది. తిరిగి వచ్చిన తర్వాత జకీర్‌ను అవుట్ చేసిన బుమ్రా జట్టుకు కావాల్సిన బ్రేక్ అందించాడు. గల్లీలో జైస్వాల్ అద్భుత క్యాచ్‌తో జకీర్ పెవిలియన్ చేరడంతో.. తొలి వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్‌లో వచ్చిన షంటో దూకుడైన బ్యాటింగ్‌తో ఫిఫ్టీ పూర్తి చేసినా.. మరో ఎండ్‌లోని బ్యాటర్లు ఇస్లాం, మొమినుల్ హక్ (13), ముష్ఫికర్ రహీమ్ (13)లను అశ్విన్ వెనక్కి పంపాడు. అయితే, వెలుతురు లేమి కారణంగా చివరి సెషన్‌లో 9.4 ఓవర్లు మిగిలుండగానే మ్యాచ్‌ను నిలిపేయాల్సి వచ్చింది.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 376;
బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 149;

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) లిట్టన్ (బి) నహీద్ 10, రోహిత్ (సి) జకీర్ (బి) టస్కిన్ 5, గిల్ (నాటౌట్) 119, విరాట్ (ఎల్బీ) మెహిదీ హసన్ 17, పంత్ (సి అండ్ బి) మెహిదీహసన్ 109, రాహుల్ (నాటౌట్) 22; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 64 ఓవర్లలో 287/4 డిక్లేర్డ్. వికెట్ల పతనం:** 1-15, 2-28, 3-67, 4-234; **బౌలింగ్:** టస్కిన్ 7-1-22-1; హసన్ 11-1-43-0; నహీద్ 6-0-21-1; షకీబ్ 13-0-79-0; మెహిదీహసన్ 25-3-103-2, మొమినుల్ హక్ 2-0-15-0.

బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: జకీర్ హసన్ (సి) జైస్వాల్ (బి) బుమ్రా 33, షాద్‌మన్ ఇస్లాం (సి) గిల్ (బి) అశ్విన్ 35, నజ్ముల్ షంటో (బ్యాటింగ్) 51, మొమినుల్ (బి) అశ్విన్ 13, ముష్ఫికర్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 13, షకీబల్ (బ్యాటింగ్) 5; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 37.2 ఓవర్లలో 158/4; వికెట్ల పతనం:** 1-62, 2-86, 3-124, 4-146; **బౌలింగ్:** బుమ్రా 7-2-18-1, సిరాజ్ 3.2-1-20-0, ఆకాశ్ దీప్ 6-0-20-0, అశ్విన్ 15-0-63-3, జడేజా 6-0-29-0.

6 టెస్టుల్లో అత్యధికంగా ఆరు శతకాలు బాదిన భారత వికెట్ కీపర్‌గా ధోనీ రికార్డును పంత్ సమం చేశాడు. ధోనీ 90 టెస్టుల్లో ఈ మైలురాయిని అందుకుంటే.. పంత్ 34 మ్యాచుల్లోనే ఈ ఘనత సాధించడం విశేషం.

అక్కడ ఫీల్డర్‌ను పెట్టు...



తను బ్యాటింగ్ చేస్తున్నప్పుడు మధ్య ఓవర్లలో పంత్ సరదాగా ఫీల్డింగ్ సెట్ చేశాడు. మిడ్ వికెట్‌లో ఫీల్డర్‌ను పెట్టమని పంత్ చెప్పడం స్టంప్ మైక్‌లో వినిపించింది. ఆ సలహాను పాటించిన బంగ్లా కెప్టెన్ షంటో.. పంత్ చెప్పిన చోట ఫీల్డర్‌ను మోహరించాడు.

షకీబల్.. 'పెద్దోడి' రికార్డు

టెస్ట్ క్రికెట్ ఆడిన పెద్ద వయసు బంగ్లా ప్లేయర్‌గా షకీబల్ హసన్ (37 ఏళ్ల 181 రోజులు) రికార్డు లకెక్కాడు. ఈ క్రమంలో స్పిన్నర్ మొహమ్మద్ రఫీక్ (37 ఏళ్ల 180 రోజుల)ను షకీబల్ అధిగమించాడు. కాగా, ఓవరాల్ టెస్ట్ చరిత్రలో పెద్ద వయసు ప్లేయర్ రికార్డు ఇంగ్లండ్‌కు చెందిన విల్‌ఫ్రెడ్ రోడ్స్ (52 ఏళ్ల 165 రోజులు) పేరిట ఉంది.

దుస్తులు ఆరబెట్టిన అశ్విన్..



రెండో రోజు శతకంతో అదరగొట్టిన అశ్విన్.. స్టంప్స్ తర్వాత తన దుస్తులను గ్రౌండ్‌లో ఆరబెట్టుకొనేందుకు వచ్చాడు. తడిచిన వాటిని అతడు మైదానంలో ఆరవేసిన వీడియో నెట్‌లో చక్కర్లు కొడుతోంది. మ్యాచ్ ముగిసినా ఇంకా అక్కడే ఉన్న కొందరు ఫ్యాన్స్.. ఆ సమయంలో అశ్విన్‌ను చూసి బిగ్గరగా కేకలేశారు. ఓ అభిమాని మాత్రం అశ్విన్‌ను ఓపెనర్‌గా రావాలని కోరాడు.



శనివారం ఆట ప్రారంభానికి ముందు పంత్ ఇలా..

స్వర్ణం లాంఛనమే

పదో రౌండ్లో అమెరికాపై భారత పురుషుల జట్టు జయభేరి

చైనాపై అమ్మాయిల జోరు

- నేడు ఆఖరి రౌండ్
- చెస్ ఒలింపియాడ్



బుడాపెస్ట్: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్టుకు స్వర్ణం దాదాపు ఖాయమైంది. శనివారం జరిగిన 10వ రౌండ్‌లో బలమైన అమెరికాను మన పురుషుల జట్టు 2.5-1.5తో చిత్తు చేసింది. అలాగే ఈ రౌండ్‌లో మహిళల జట్టు కూడా గట్టి ప్రత్యర్థి చైనాను 2.5-1.5తో మట్టి కరిపించింది. పురుషుల జట్టు 19 పాయింట్లతో అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. చైనా 17 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఆదివారం జరిగే ఆఖరి రౌండ్‌ను మనోళ్లు కనీసం డ్రా చేసుకున్నా పసిడి పతకం ఖాయమవుతుంది. ఒకవేళ ఆఖరి రౌండ్‌లో మనం ఓడి, చైనా గెలిస్తే..స్కోరు 19-19తో సమమవుతుంది. దాంతో టై బ్రేకర్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు. అమెరికాతో పోరులో..ప్రజ్ఞానంద-వెస్లీ సో చేతిలో ఓడడంతో జట్టు 0-1తో వెనుకంజలో నిలిచింది. కానీ కరువానాపై వెనుకంజలో నిలిచిన గుకేష్ అద్భుత ఆటతో అనూహ్య విజయం సాధించాడు. ఫలితంగా స్కోరు 1-1తో సమమైంది. విదిత్-అరోనియన్ మధ్య గేమ్ డ్రా కావడంతో రెండు జట్లు 1.5-1.5తో నిలిచాయి. కానీ డొమింగెజ్‌తో ఆఖరి గేమ్‌లో మొదటి నుంచీ ఆధిక్యంలో నిలిచిన అర్జున్ అలవోకగా గెలుపొంది భారత్‌కు విజయాన్నందించాడు. ఇక..మహిళల విభాగంలో భారత్ 17 పాయింట్లతో టాప్‌లోకి దూసుకొచ్చింది. కజకిస్థాన్ రెండో స్థానంలో కొనసాగుతోంది. ఈనేపథ్యంలో మహిళల విభాగం ఆఖరి గేమ్ రసవత్తరంగా మారింది. చైనాతో పోరులో..తొలుత హారిక-ఝు జినెర్, వంతిక-లు మియో యి గేమ్‌లు డ్రాగా ముగిశాయి. స్కోరు 1-1తో సమం కాగా.. దివ్య దేశ్‌ముఖ్- నీ షిక్యన్‌ను ఓడించడంతో మనకు 2-1 ఆధిక్యం లభించింది. అయితే కీలకమైన ఆఖరి గేమ్‌లో వైశాలీ-గో క్వీని నిలువరించడంతో భారత జట్టు విజయ తీరాలకు చేరింది.

పట్టుబిగించిన ఇండియా 'ఎ'

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): రియాన్ పరాగ్ (73), శాస్వత్ రావత్ (53) అర్ధ శతకాలతో మెరవడంతో ఇండియా 'సి'తో ఇక్కడ జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో ఇండియా 'ఎ' పట్టు బిగించింది. ఆ జట్టు శనివారం ఆట ఆఖరికి రెండో ఇన్నింగ్స్‌లో 270/6 స్కోరు చేసింది. దాంతో ఓవరాల్‌గా 333 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. అంతకుముందు ఇండియా 'సి' 234 పరుగులకు ఆలౌటైంది. ఆకిబ్ ఖాన్ (3/43), అవేశ్ ఖాన్ (3/64) చెరో మూడు వికెట్లు తీశారు. ఇండియా 'ఎ' మొదటి ఇన్నింగ్స్‌లో 297 పరుగులు చేసింది.

సెంచరీ దిశగా భుయ్: రికీ భుయ్ (90) రెండో సెంచరీ ముంగిట నిలవగా..ఇండియా 'బి'తో జరుగుతున్న మరో మ్యాచ్‌లో ఇండియా 'డి' తన ఆధిక్యాన్ని 311 పరుగులకు పెంచుకుంది. శ్రేయాస్ (50), సంజూ శాంసన్ (45) సత్తా చాటడంతో మూడోరోజు ఆఖరికి ఇండియా 'డి' రెండో ఇన్నింగ్స్‌లో 244/5 స్కోరు చేసింది. ఓవర్‌నైట్ 210/6 స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'బి' 282 పరుగులకు ఆలౌటైంది. ఇండియా 'డి' తొలి ఇన్నింగ్స్‌లో 349 పరుగులు చేసింది.

అఫ్ఘానిస్థాన్ తొలిసారి

సౌతాఫ్రికాపై వన్డే సిరీస్ గెలుపు

చెలరేగిన రషీద్, గుర్బాజ్

షార్జా: మొదటి వన్డేతో సౌతాఫ్రికాపై అంతర్జాతీయ స్థాయిలో తొలి విజయం అందుకున్న అఫ్ఘానిస్థాన్..అదే ఊపులో సఫారీలకు మరో షాకిచ్చింది. శుక్రవారం రాత్రి జరిగిన రెండో వన్డేలో ఏకంగా 177 పరుగులతో ప్రత్యర్థిని చిత్తు చేసిన అఫ్ఘానిస్థాన్ ఆ జట్టుపై మొదటిసారి వన్డే సిరీస్ అందుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో వన్డే మిగులుండగానే కైవసం చేసుకుంది. తొలుత అఫ్ఘానిస్థాన్ 50 ఓవర్లలో 311/4 భారీ స్కోరుతో సవాలు విసిరింది. రహ్మనుల్లా (105) సెంచరీతో చెలరేగగా.. అజ్మతుల్లా (86 నాటౌట్), రహమత్ షా (50) అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. అనంతరం రషీద్‌ఖాన్ (5/19) ధాటికి సఫారీలు 34.2 ఓవర్లలో 134 పరుగులకే చేతులెత్తేశారు. మరో స్పిన్నర్ ఖరోటే (4/26) నాలుగు వికెట్లతో తిప్పేశాడు.

నాలుగేళ్లలో 2.95 లక్షల నియామకాలు

కొవిడ్ తర్వాత టాప్ 10 ప్రైవేట్ బ్యాంక్‌ల్లో భారీగా హైరింగ్

బెంగళూరు: గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో (2021-24)లో దేశంలోని టాప్-10 ప్రైవేట్ బ్యాంక్‌లు నికరంగా 2.95 లక్షల నియామకాలు జరిపాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో నికరంగా 1,06,753 మందిని ఉద్యోగంలో చేర్చుకున్నాయి. 2022-23లో జరిపిన 94,046 మంది హైరింగ్‌తో పోలిస్తే 13 శాతం అధికమిది. కొవిడ్ సంక్షోభం తర్వాత బ్యాంకింగ్ సేవలకు డిమాండ్ మరింత పెరిగింది. దాంతో ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగుల వలసలూ పెరిగాయి. తత్ఫలితంగా బ్యాంక్‌లు పెద్ద సంఖ్యలో నియామకాలను జరిపాయని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొన్నాయి. వలసపోయిన ఉద్యోగుల స్థానాల భర్తీతో కలిపితే మొత్తం హైరింగ్ సంఖ్య మరింత అధికంగా ఉంటుందన్నారు.


గత నాలుగేళ్లలో ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు సగటు 12 శాతంగా ఉండవచ్చని అంచనా. వలసపోయిన వారి స్థానాలను భర్తీ చేసేందుకు బ్యాంక్‌లు 2.80 లక్షల రీప్లేస్‌మెంట్ హైరింగ్ జరిపి ఉండవచ్చని, వీటితో కలిపి మొత్తం నియామకాలు 5.75 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరం చివరినాటికి టాప్ టెన్ ప్రైవేట్ బ్యాంక్‌ల్లో 7,95,414 మంది పనిచేస్తున్నారు. 20219-20 చివరి నాటికి నమోదైన 5,00,149 మందితో పోలిస్తే ఉద్యోగుల సంఖ్య నాలుగేళ్లలో 59 శాతం పెరిగింది.

యాక్సిస్ క్రిసిల్-ఐబీఎక్స్ ఏఏఏ ఎన్‌బీఎఫ్‌సీ ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ క్రిసిల్-ఐబీఎక్స్ ఏఏఏ ఎన్‌బీఎఫ్‌సీ ఇండెక్స్ - జూన్ 2027 ఫండ్ తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ టార్గెట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్. ఈ ఫండ్ మెచ్యూరిటీ తేదీ 2027 జూన్ 30. ఫిక్స్‌డ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో ఈ ఫండ్ 95 శాతం నుంచి 100 శాతం పెట్టుబడులు పెట్టనుంది. లిక్విడిటీ కోసం డెట్, మనీ మార్కెట్లలో కూడా ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 23.

గోల్డ్ లోన్.. జిగేల్!

- ఏడాది కాలంలో రెండంకెల వృద్ధి
- తనఖా రహిత వ్యక్తిగత రుణాలపై ఆర్‌బీఐ ఆంక్షల నేపథ్యమే కారణం..



తనఖా రహిత వ్యక్తిగత రుణ నిబంధనలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కఠినతరం చేసిన నేపథ్యంలో బ్యాంక్‌లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లు తాకట్టుపై ఇచ్చే బంగారం రుణాలపై దృష్టి సారించాయి. ఇందుకు తోడు, గడిచిన ఏడాది కాలంలో పసిడి ధర దాదాపు 25% పెరగడం, రుణదాతలు డిజిటల్ రుణ సౌకర్యాలను అందుబాటులోకి తేవడంతో గోల్డ్ లోన్ వ్యాపారం జోరందుకుంది. ఆర్‌బీఐ తాజా డేటా ప్రకారం.. ఎన్‌బీఎఫ్‌సీల బంగారం రుణ వ్యాపారం గడిచిన ఏడాది కాలంలో 20-30% పుంజుకుంది. ప్రస్తుతం ఈ వ్యాపారంలో ఎన్‌బీఎఫ్‌సీలదే పైచేయి అయినప్పటికీ, బ్యాంక్‌ల పసిడి రుణాలు గణనీయంగా పెరిగాయి. ఈ ఏడాది జూన్ నాటికి బ్యాంక్‌లిచ్చిన పసిడి రుణాల విలువ వార్షిక ప్రాతిపదికన 30% పెరిగి రూ.1,23,776 కోట్లకు చేరుకుంది. కాగా, తనఖా రహిత వ్యక్తిగత రుణాల వృద్ధి మందగించింది. ఈ జూన్‌లో ఈ విభాగ రుణాల వృద్ధి 15 శాతానికి పరిమితమైంది. 2023 జూన్‌లో నమోదైన 30% వృద్ధితో పోలిస్తే సగానికి తగ్గింది.

జూన్ నాటికి బ్యాంక్‌ల్లో పసిడి రుణాల మొత్తం

ఏడాది	రుణాలు (రూ.కోట్లు)	వృద్ధి(%)
2019	27,102	--
2020	34,267	26.4
2021	62,221	81.6
2022	79,517	27.8
2023	94,872	19.3
2024	1,23,776	30.5

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో పసిడి రుణ బకాయిలు వృద్ధి వేగంగా పెరిగింది. ఈ మే నెలలో 15 శాతం వృద్ధి నమోదైంది.
- ఎన్‌బీఎఫ్‌సీల విషయానికొస్తే, ఈ జూన్‌లో అతిపెద్ద గోల్డ్ లోన్ కంపెనీ ముత్తూట్ ఫైనాన్స్ నిర్వహణలోని పసిడి రుణ ఆస్తులు (ఏయూఎం) వార్షిక ప్రాతిపదికన 23 శాతం వృద్ధితో రూ.80,992 కోట్లకు చేరుకుంది. ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో అత్యధిక పసిడి రుణాల వితరణ జరిపినట్లు కంపెనీ వెల్లడించింది.
- ఈ జూన్‌లో మణప్పురం ఫైనాన్స్ గోల్డ్ లోన్ ఏయూఎం వార్షిక ప్రాతిపదికన 15 శాతం వృద్ధితో రూ.23,647 కోట్లుగా, శ్రీరామ్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ ఏయూఎం 23 శాతం వృద్ధితో రూ.6,123 కోట్లుగా నమోదైంది.
- కరోనా సంక్షోభ సమయంలో పసిడి రుణాలకు డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. 2021 జూన్ నాటికి బ్యాంక్‌ల పసిడి రుణ బకాయిలు వార్షిక ప్రాతిపదికన 82 శాతం పెరిగాయి. ఆ తర్వాత రెండు సంవత్సరాల్లో క్రమంగా తగ్గుతూ వచ్చిన వృద్ధి మళ్లీ ఏడాదిలో పుంజుకుంది.
- ఈ ఏడాది జూన్ నాటికి మొత్తం వ్యక్తిగత రుణాల్లో బంగారం రుణాల వాటా 20 నెలల గరిష్ఠ స్థాయి 2.3 శాతానికి పెరిగిందని ఆర్‌బీఐ వెల్లడించింది.
- పసిడి రుణాల విభాగంలో ఆస్తుల నాణ్యత మాత్రం క్షీణిస్తోందని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా పేర్కొంది. గడువు దాటి 90 రోజులకు పైబడినా చెల్లించని బకాయిల వాటా ఈ మార్చిలో 2.9 శాతంగా నమోదుకాగా.. జూన్‌లో 3.1 శాతానికి పెరిగింది.
- వ్యక్తిగత, వ్యాపార అత్యయిక, స్వల్పకాలిక అవసరాల్లో తక్షణమే పొందగలిగేది పసిడి రుణం. తనఖారహిత రుణాల మంజూరు కఠినతరం కావడంతో రుణగ్రహీతలు కూడా పసిడి రుణాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఏఎం కార్తీక్ అన్నారు.

బిజినెస్

జోయాలుక్కాస్ చెయిన్ ఫెస్ట్ ఆఫర్

హైదరాబాద్: ప్రముఖ జువెలరీ రిటైలర్ జోయాలుక్కాస్.. తమ ప్రత్యేకమైన 'చెయిన్ ఫెస్ట్' ఆఫర్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా వినియోగదారులకు విస్తృత శ్రేణి చెయిన్స్‌పై 4.99 శాతం మజూరీ చార్జీల (వీ.ఏ)ను ఆఫర్ చేస్తోంది. సెప్టెంబరు 20న ప్రారంభమైన ఈ ఆఫర్ అక్టోబరు 6 వరకు అందుబాటులో ఉంటుందని జోయాలుక్కాస్ తెలిపింది. కస్టమర్లకు విలక్షణమైన చెయిన్స్ కలెక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జోయాలుక్కాస్ చెయిన్ ఫెస్ట్ ఆఫర్‌ను రూపొందించినట్లు జాయ్ అలుక్కాస్ ఛైర్మన్, ఎండీ జోయాలుక్కాస్ వెల్లడించారు. నాణ్యతలో రాజీ లేకుండా ఎల్లప్పుడు అత్యుత్తమైన విలువను వినియోగదారులకు అందించే విధంగా మజూరీ చార్జీలను ఆఫర్ చేస్తున్నట్లు తెలిపారు.

ఎల్ఐసీ ఎంఎఫ్.. మాన్యుఫ్యాక్చరింగ్ ఫండ్

ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ సంస్థ మాన్యుఫాక్చరింగ్ ఫండ్ పేరిట ఒక కొత్త ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. ఈ కొత్త ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) అక్టోబరు 4వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. అక్టోబరు 11వ తేదీన ఇన్వెస్టర్లకు యూనిట్లను కేటాయిస్తారు. ఈ ఫండ్‌కు నిఫ్టీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ ఇండెక్స్ (టోటల్ రిటర్న్ ఇండెక్స్) బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. మాన్యుఫాక్చరింగ్ థీమ్‌కు అనుగుణంగా ఆటోమొబైల్స్, ఫార్మాస్యూటికల్స్, రసాయనాలు, హెవీ ఇంజనీరింగ్ వస్తువులు, మెటల్స్, నౌకా నిర్మాణం, పెట్రోలియం ఉత్పత్తులు వంటి విభిన్న రంగాల కంపెనీల షేర్లతో కూడిన వైవిధ్యభరితమైన పోర్ట్‌ఫోలియోను అందించడం ఈ ఫండ్ లక్ష్యం. సిప్ విధానంలో కనీస పెట్టుబడి రూ.300. నెలవారీ ప్రాతిపదికన కనీస పెట్టుబడి రూ.1,000. ఏకమొత్తంగా ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు రూ.5,000 కనీస పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,930 ▲	69,600 ▲	98,000 ▲
ముంబై	74,093 ▲	67,869 ▲	88,917 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ



హైదరాబాద్	520	విజయవాడ	555
వరంగల్	522	గోదావరి	550
చిత్తూరు	553	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	113
వరంగల్	115	గుంటూరు	116
కరీంనగర్	115	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	110
కర్నూలు	115	నెల్లూరు	110
విశాఖపట్నం	103	అనంతపురం	110
గోదావరి	113		

వ్యాపార అవసరాల కోసం కార్లు కొనుగోలు చేస్తుంటే..

ఇదీ GST



రాంబాబు గొండాల

చాలా మంది వ్యక్తిగత అవసరాల కోసం లేదా వ్యాపార అవసరాల నిమిత్తం కార్లను కొనుగోలు చేయటం సాధారణ విషయం. కార్లకు సంబంధించి జీఎస్‌టీ 28 శాతం కాగా దీనికి సెస్ అదనం. ఈ సెస్ అనేది కారు టైప్‌ను బట్టి 0 నుంచి 22 శాతంగా ఉంది. అంటే, కారు కొనుగోలు సమయంలో చెల్లించే పన్ను, సెస్‌తో కలిపి 28 శాతం నుంచి 50 శాతంగా ఉంటుంది. అయితే చాలా మంది ఆలోచన ఏమిటంటే వ్యాపార అవసరాల కోసం కొనుగోలు చేసే వస్తు,సేవల మీద ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకోవచ్చు. కాబట్టి వ్యాపార నిమిత్తం కారును కొనుగోలు చేసినట్లయితే, కొనుగోలు చేసే సమయంలో చెల్లించిన పన్ను మొత్తాన్ని ఐటీసీ కింద పొందవచ్చని కొంత మంది భావిస్తుంటారు. అయితే ఈ విధంగా కార్లకు సంబంధించిన ఐటీసీ తీసుకోవచ్చా? ఈ వివరాలు మీకోసం..

సాధారణంగా వ్యాపార అవసరాల కోసం కొనుగోలు చేసే వస్తు,సేవల మీద ఐటీసీ సదుపాయం ఉన్నప్పటికీ ఇది అన్ని కొనుగోళ్లకు వర్తించదు. కార్లు, జీప్‌లు ఇలాంటి ప్యాసింజర్ వాహనాలు కూడా ఈ కోవలోకి వస్తాయి. అంటే, ఈ వాహనాల కొనుగోలు సమయంలో చెల్లించిన ట్యాక్స్‌ను ఐటీసీ రూపంలో పొందలేరు. క్లుప్తంగా చెప్పాలంటే ఆయా వాహనాలను వ్యాపార నిమిత్తం వాడినప్పటికీ, ఐటీసీకి అర్హత లేదు. ఇది ముఖ్య నిబంధన అయినప్పటికీ మూడు రకాల సందర్భాల్లో మాత్రం ఇలా వాహనాలకు సంబంధించి కూడా ఐటీసీ పొందే సదుపాయం కల్పించారు.

మొదటిది ఆయా వాహనాలను తిరిగి అమ్మకం కోసం కొనుగోలు చేస్తుంటే.. కార్ డీలర్స్ ఈ కోవలోకి వస్తారు. అంటే కార్లు లేదా జీప్‌లను అమ్మే డీలర్లు లేదా సబ్ డీలర్లు ఆయా వాహనాల మీద ఐటీసీ పొందవచ్చు. ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే అమ్మకానికి ఉద్దేశించి కొనుగోలు చేసిన వాహనాల మీద మాత్రమే ఐటీసీ తీసుకోవచ్చు. అలాకాకుండా, ఇతర వ్యాపార పనుల నిమిత్తం సదరు డీలర్ ఏదేనీ వాహనం కొనుగోలు చేస్తుంటే మాత్రం అట్టి వాహనం మీద ఐటీసీ పొందలేరు.

ఇక రెండో సందర్భం.. వాహనాలను ప్యాసింజర్ రవాణా కోసం ఉపయోగించటం. అంటే క్యాబ్ సర్వీస్ లేదా కిరాయిల (రెంట్స్) కోసం వాహనాలను కొనుగోలు చేస్తుంటే, ఆ వాహనాల మీద కూడా ఐటీసీ పొందవచ్చు.

మూడో సందర్భంలో.. డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్ నేర్పటానికి కొనుగోలు చేసే వాహనాల మీద కూడా ఐటీసీ పొందవచ్చు. ఈ నియమ నిబంధనలన్నీ కూడా డ్రైవర్‌తో కలిపి 13 లేదా అంతకంటే తక్కువ సీటింగ్ సామర్థ్యం గల ప్యాసింజర్ వాహనాలకు మాత్రమే. ఇతర వాహనాలకు అంటే 13 కంటే ఎక్కువ సీటింగ్ ఉన్న ప్యాసింజర్ వాహనాలు అంటే బస్సు లేదా మినీ బస్సులు, రవాణాకు ఉపయోగించే లారీలు, ట్రాక్టర్లు, ట్రాలీలు, కాంట్రాక్ట్ పనుల కోసం వాడే ఎర్త్ మూవింగ్ ఎక్విప్‌మెంట్, రోడ్ రోలర్, బుల్డోజర్ లాంటి వాహనాల మీద ఐటీసీ తీసుకోవటానికి ఎలాంటి అడ్డంకి లేదు.

ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన మరొక ముఖ్య విషయం ఏమిటంటే.. ఐటీసీ తీసుకోవటానికి ఉద్దేశించిన సాధారణ నియమ నిబంధనలు అన్నీ కూడా పైన తెలిపిన అన్ని సందర్భాల్లో వర్తిస్తాయి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

'కల్తీ' దోషులను కఠినంగా శిక్షించాలి

» సినీ నటుడు మోహన్‌బాబు

హైదరాబాద్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): హిందువులంతా పూజించే దైవం శ్రీ వేంకటేశ్వర స్వామికి నిత్యం సమర్పించే లడ్డూలలో కలిపే ఆవు నెయ్యిలో దాదాపు 3నెలల క్రితం వరకూ ఇతర జంతువుల కొవ్వును కలుపుతున్నారని తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని సినీనటుడు మంచు మోహన్‌బాబు అన్నారు. స్వామి సన్నిధిలో ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమని అన్నారు. ఈ ఆరోపణ నిజమైతే దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరుతున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో సీఎం నూరేళ్లు చల్లగా ఉండాలని మోహన్‌బాబు ఆకాంక్షించారు.

లడ్డూ కల్తీ ఘటన మత విశ్వాసాలపై దాడే

జగన్‌పై కేసు నమోదు చేయండి.. సైదాబాద్‌లో ఫిర్యాదు

సైదాబాద్, రామంతపూర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ ఘటనలో ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్, సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. హైకోర్టు న్యాయవాది కరుణాసాగర్, సైదాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వినోద్‌గౌడ్ ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఐపీసీ 298, 299 సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలన్నారు. లడ్డూ కల్తీ ఘటన మత విశ్వాసాలపై దాడి చేయడమేనని కరుణాసాగర్ అన్నారు. తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ ఘటన తన మనసును కలిచి వేయడంతో పాటు మనోవేదనకు గురిచేసిందని పద్మశ్రీ అవార్డు గ్రహీత కేతావత్ సోమ్‌లాల్ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన.. ఎస్ఈ సస్పెన్షన్

హైదరాబాద్, నల్లగొండ టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ ఉల్లంఘనలపై దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్) ఎస్ఈ పాల్‌రాజ్‌ను సస్పెండ్ చేశారు. ఈ నెల 20వ తేదీన నల్గొండ జిల్లా దేవరకొండలో శ్రీశైలం సొరంగ మార్గం టన్నెల్ 1 పరిశీలన, ఉమ్మడి జిల్లాల ప్రాజెక్టుల పురోగతిపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందన్న ఫిర్యాదులతో ఎస్ఈపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఆ సంస్థ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) పరిధిలో శుక్రవారం అత్యధిక డిమాండ్ రికార్డయింది. శుక్రవారం ఉదయం 10.35 గంటల సమయంలో 9,910 మెగావాట్ల డిమాండ్ రికార్డయింది. గతేడాది అదే రోజున(సెప్టెంబరు 20వ తేదీన) 9,862 మెగావాట్ల డిమాండ్ నమోదు కావడం గమనార్హం.

డీజేలు పెట్టడం ఇస్లాం సంస్కృతికి వ్యతిరేకం

» అది పండుగల గౌరవాన్ని తగ్గించడమే: అసదుద్దీన్

ఇస్లామిక్ సంప్రదాయాలు, ఆచారాలకు విరుద్ధంగా ఇతర సంస్కృతులను అనుకరించడం వల్ల గుర్తింపు కోల్పోతామని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. మతపరమైన పండుగల సమయంలో భారీ శబ్దాలు చేసే డీజేలను నిషేధించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో దారుల్‌సలాంలో నిర్వహించిన జల్సా రెహ్మతుల్ అలమీన్‌లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా... పండుగ వేడుకల్లో వినోదం భాగమైనప్పటికీ, డీజేలు పెట్టుకొని గంతులు వేయడం వంటివి మిలాద్ ఉన్ నబీ పట్ల గౌరవాన్ని తగ్గిస్తాయన్నారు. డీజే మ్యూజిక్‌కు అనుగుణంగా డ్యాన్స్ చేయడం ఇస్లామిక్ సూత్రాలకు విరుద్ధమన్నారు.

ఏ చరిత్ర లేని పార్టీలే సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్నాయి

» సీపీఐ రైతాంగ పోరాట వారోత్సవాల్లో వక్తలు

"ఏ చరిత్ర లేని పార్టీలే.. తెలంగాణ రైతుల సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్నాయి. తమ చరిత్రగా చెప్పుకొనే కుట్రలు పన్నుతున్నాయి. ఈ కుట్రలను తిప్పికొడుతూ.. అసలు చరిత్రను భావితరాలకు అందించే బాధ్యత కమ్యూనిస్టులపై ఉంది. నాడు భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం ముమ్మాటికీ విలీనమైంది" అని పలువురు వక్తలు స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో.. జరిగిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు' శనివారం ముగిశాయి. ఈ సభలో.. ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ ముఖ్యవక్తలుగా మాట్లాడారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్న బీజేపీ.. నాడు కమ్యూనిస్టుల సారథ్యంలో జరిగిన సాయుధ పోరాటాన్ని హిందూ-ముస్లింల మధ్య జరిగిన పోరుగా చిత్రీకరిస్తూ.. చరిత్రను వక్రీకరిస్తోందని హరగోపాల్ దుయ్యబట్టారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. సాయుధ పోరాటంతోపాటు.. జాతీయోద్యమంలో ఎలాంటి భాగస్వామ్యం లేని బీజేపీ.. తెలంగాణ విమోచనం పేరుతో తమ చరిత్రగా చెప్పుకొనే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. "బాబ్రీమసీదు కూల్చివేత తర్వాత రాజకీయంగా బలపడ్డ బీజేపీ.. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాతే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందనే భావనను కల్పించే ప్రయత్నం చేస్తోంది. సాయుధ పోరాట చరిత్ర వక్రీకరణను తిప్పికొట్టడంలో కమ్యూనిస్టులు మరింత క్రియాశీలం కావాలి" అని పిలుపునిచ్చారు.

తెలుగు వర్సిటీకి సురవరం పేరు హర్షణీయం

బర్కత్‌పుర/ఎల్బీ నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మకమైన తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడం హర్షణీయం అని ఆయన కుమారుడు కృష్ణవర్ధన్ తెలిపారు. రాష్ట్ర మంత్రివర్గం దీన్ని ఆమోదించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. దశాబ్ద కాల తమ పోరాటాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గుర్తించి పేరు పెట్టిందన్నారు. సురవరం సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం అభినందనీయమన్నారు. కాగా తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగింపు సమంజసం కాదని, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించే విధంగా రాజకీయ పార్టీలు కృషి చేయాలని ఆయన కోరారు.

కోకాపేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

నార్సింగ్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోకాపేటలో కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వ్యక్తులపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. ఆ స్థలంలోని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. గండిపేట మండలం కోకాపేటలోని సర్వే నెంబర్ 147లో దాదాపు 800 గజాల ప్రభుత్వ స్థలం ఉంది. కొందరు వ్యక్తులు ఈ స్థలాన్ని ఆక్రమించి 8 నిర్మాణాలు చేపట్టారు. వాటికి కరెంటు మీటర్లు కూడా పొందారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. శనివారం గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా నార్సింగ్‌లో నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన అదనపు అంతస్తులను మునిసిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాక్షికంగా కూల్చివేశారు.

వెటర్నరీ వర్సిటీలో నాటి నియామకాల్లో అక్రమాలు

అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకాలపై ఆరోపణలు

మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేయాలని మానవతారాయ్ డిమాండ్

న్యాయవిచారణ జరిపించాలని ఏసీబీ డీజీకి ఫిర్యాదు

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీలో 2021 నుంచి 2023 వరకు జరిగిన అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకాల్లో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని ఏసీబీ డీజీ రీతూరాజ్‌కు తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ ఫిర్యాదు చేశారు. ఈ నియామకాల్లో రోస్టర్, రిక్రూట్‌మెంట్ నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంలో రూ. కోట్లలో అవినీతి చోటు చేసుకుందన్నారు. దీనిపై న్యాయవిచారణ జరిపించాలని కోరుతూ రీతూరాజ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ అక్రమాలకు సంబంధించి మాజీ వీసీ, ప్రస్తుత, మాజీ రిజిస్ట్రార్లు, డీన్, సెలక్షన్ బోర్డు సభ్యులను బాధ్యులుగా చేసి విచారణ జరిపించాలని కోరారు. ఈ నియామకాలను రద్దు చేసి సీనియర్ ఐఏఎస్, అధికారుల పర్యవేక్షణలో మళ్లీ నోటిఫికేషన్లు జారీ చేయాలని మానవతారాయ్ కోరారు. ఈ అవినీతికి మాజీ వీసీ రవీందర్‌రెడ్డి కారణమని, ఆయన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి స్వయానా వియ్యంకుడని, రవీందర్‌రెడ్డి అక్రమాలను నిరంజన్‌రెడ్డి కాపాడుతూ వచ్చారని ఓ ప్రకటనలో మానవతారాయ్ ఆరోపించారు.

ఏడుకొండలవాడా... క్షమించు

గత పాలకుల వికృత పోకడలతో

తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రం

నేటినుంచి ప్రాయశ్చిత్త దీక్ష చేపడతా

కల్తీ నెయ్యిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్



అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడటంపై ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. కలియుగ ప్రత్యక్షదైవం బాలాజీకి జరిగిన ఈ ఘోర అపచారానికి సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందేనని అన్నారు. 'అమృతతుల్యంగా.. పరమ పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదం గత పాలకుల వికృత పోకడల ఫలితంగా అపవిత్రమైంది. లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలు ఉన్నాయని తెలిసిన క్షణం నుంచి నా మనసు కలత చెందింది. అపరాధ భావానికి గురైంది. బాలాజీకి జరిగిన ఈ ఘోర అపచారానికి సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతిఒక్కరూ ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందే. అందులో భాగంగా నేను 'ప్రాయశ్చిత్త దీక్ష' చేయాలని సంకల్పించాను. 22వ తేదీ ఉదయం గుంటూరు జిల్లా నంబూరులోని శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీక్ష చేపడతా. 11 రోజుల పాటు దీక్ష కొనసాగించిన అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటా. దేవదేవా... నీ పట్ల గత పాలకులు చేసిన పాపాలను ప్రక్షాళన చేసే శక్తిని ఇవ్వమని వేడుకుంటా" అని పవన్ కల్యాణ్ వెల్లడించారు.

నాణ్యమైన నెయ్యి అందిస్తాం

ఇతర పాల ఉత్పత్తులు ఇచ్చేందుకు విజయ డెయిరీ సిద్ధం

టీటీడీ ఈవోకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ లేఖ

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూ తయారీకి అవసరమైన నెయ్యితో పాటు, ఇతర పాల ఉత్పత్తులను విజయ డెయిరీ తరఫున సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పేర్కొంది. ఈ మేరకు శనివారం రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి సబ్యసాచి ఘోష్ టీటీడీ ఈవో శ్యామలరావుకు లేఖ రాశారు. నెయ్యి సరఫరా కోసం తమకు అవకాశం ఇవ్వాలని, తద్వారా దేవస్థానానికి, భక్తులకు సేవ చేసే అవకాశం కల్పించాలని లేఖలో కోరారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్ నుంచి శనివారం మీడియా కమిషనర్‌కు లేఖ విడుదలైంది. దేశవ్యాప్తంగా పాలు, పాల ఉత్పత్తుల రంగంలో తెలంగాణ విజయ డెయిరీ సంస్థ ప్రసిద్ధి చెందిందని, వినియోగదారులకు విలువైన, నాణ్యమైన, స్వచ్ఛమైన ఉత్పత్తులను సరఫరా చేసిన చరిత్రను కలిగి ఉందని లేఖలో పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి అధిక నాణ్యత గల నెయ్యి, ఇతర పాల ఉత్పత్తుల అవసరాలను తీర్చడానికి విజయ డెయిరీ సిద్ధంగా ఉందని తెలిపారు.

స్వామివారితోనే జగన్ ఆటలు!

(మొదటిపేజీ తరువాయి)



పేర్కొన్నారు. తిరుమల పవిత్రతను కాపాడటానికి తీసుకున్న ఈ నిర్ణయాన్ని మరింత బలపరుస్తూ 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మరొక సర్క్యులర్ జారీచేసింది. ప్రముఖ ఆలయాల్లో ఉపయోగించే నెయ్యిని కూడా స్థానిక సహకార డెయిరీల నుంచి కొనుగోలు చేయాలని అందులో స్పష్టం చేసింది. ఆ తర్వాత కొద్ది మాసాలకే టీడీపీ ప్రభుత్వం దిగిపోయింది. అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఆ సర్క్యులర్‌ను బుట్టదాఖలు చేసింది. 2020లో నెయ్యి ప్రొక్యూర్‌మెంట్ విధానంలో మార్పులు తీసుకువచ్చింది. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ అప్పటివరకు తిరుమల ఆలయం అవసరాల కోసం సరఫరా చేస్తున్న నందినీ బ్రాండ్ నెయ్యిని నిలిపివేసింది. నెయ్యిని ఎవరినుంచైనా కొనుగోలు చేయవచ్చునంటూ 2022లో ఆదేశాలు జారీచేసింది. 2019లో కమిటీ నివేదిక ఆధారంగా ఇచ్చిన సర్క్యులర్‌లో కేవలం తయారీ కంపెనీల దగ్గర నుంచే వస్తువులు కొనుగోలు చేయాలని స్పష్టంగా ఉంది. జగన్ సర్కార్ ఈ నిబంధనలు మార్చేసి చివరికి చిన్న చిన్న దుకాణాలు, ప్రైవేటు వ్యక్తుల దగ్గర నుంచి కూడా కొనుగోలు చేయవచ్చునని పేర్కొంది. తాను అనుకున్న కంపెనీలకు నెయ్యి టెండర్లు దక్కేలా నిబంధనలను ఇలా అడ్డగోలుగా మార్చివేసింది. శ్రీవారికీ, తిరుమల పవిత్రతకూ, భక్తుల మనోభావాలకు ఏ మాత్రం విలువ ఇవ్వకుండా నాటి జగన్ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలే తితిదేను సంక్షోభంలో పడవేశాయి. రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా జగన్ ప్రభుత్వం ఎంపిక చేసిన ఐదు కంపెనీల్లో ఒకటి సరఫరా చేసిన నెయ్యిలోనే పంది, ఎద్దు కొవ్వు, చేప నూనెలు ఉన్నట్టు బయటపడటం, దానిపై దేశమంతా భగ్గుమనడం తెలిసిందే.

రైతుల 'సహకారం'తో..

కొన్ని దశాబ్దాల పాటు టీటీడీ సహా ఏపీలోని ప్రముఖ ఆలయ పాలకవర్గాలు సహకార పాల ఉత్పత్తులదారు యూనియన్ నుంచి నెయ్యి కొనుగోలు చేశాయి. టీటీడీ స్వామివారి నైవేద్యం కోసం నెయ్యిని చిత్తూరు డెయిరీ నుంచి కొనుగోలు చేసేవారు. స్వామి సేవలకు లక్షల టన్నుల్లో నెయ్యి కావాల్సి వచ్చేది. ఆ మేరకు పాడి రైతులకు మేలు జరిగింది. చిత్తూరు డెయిరీ నుంచి వచ్చిన నెయ్యిని పరీక్షించాల్సిన అవసరం కూడా ఉండేది కాదు. అనేక కారణాలతో చిత్తూరు డెయిరీ దెబ్బతినిపోయింది. అప్పటి నుంచి టీటీడీ.. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌కు చెందిన నందినీ బ్రాండ్ నెయ్యిని సేకరించడం ప్రారంభించింది. దాన్ని కూడా పరీక్షించాల్సిన అవసరం రాలేదు. కానీ, జగన్ ప్రభుత్వంలో మాత్రం నెయ్యి కొనుగోలు టెండర్ ప్రక్రియలో దారుణాలు జరిగాయి.

2019 సర్క్యులర్ బుట్టదాఖలు..

2019కి ముందు టీటీడీ సహా ప్రముఖ దేవాలయాల్లో ఉపయోగించే నిత్యావసర వస్తువులు, ప్రసాదం తయారీకి ఉపయోగించే సరుకుల పరిశీలనకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. సుదీర్ఘ సమయం పాటు సమావేశాలు ఏర్పాటు చేసుకున్న కమిటీ, ప్రభుత్వానికి కీలకమైన సూచనలు చేసింది. తన నివేదిక కూడా అందించింది. ఈ నివేదిక ఆధారంగా అప్పటి దేవదాయ శాఖ కమిషనర్ సర్క్యులర్ జారీచేశారు. అందులో ముఖ్యంగా నెయ్యి, పాలు కొనుగోలును నేరుగా కో-ఆపరేటివ్ డెయిరీల నుంచి కొనుగోలు చేయాలని స్పష్టంగా పొందుపరిచారు. దీనికి ప్రత్యేకంగా టెండర్లు పిలవాల్సిన అవసరం కూడా లేదని, నాణ్యతను పాటించే మంచి సంస్థ నుంచి కొనుగోలు చేయాలని స్పష్టంగా పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చాక దీనిని బుట్టదాఖలు చేసింది.

కాసుల కక్కుర్తితోనే

'తిరుమల' నెయ్యి కల్తీకి ఇదే కారణం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)


మార్కెట్‌లో స్వచ్ఛమైన నెయ్యి ఖరీదైనది. అందులోనూ ఆవు నెయ్యి అయితే మరింత ఎక్కువ ధర. తక్కువ క్వాలిటీ నెయ్యి తీసుకున్నా కిలో కనీసం రూ.600 ఉంటుంది. అంతకంటే తక్కువ ధరకు అమ్మాలంటే కల్తీ చేయాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా హోటళ్లలో ఉపయోగించే నెయ్యిలో వనస్పతి కలుపుతారు. వెజిటబుల్ వనస్పతి కిలో రూ.100-150 మధ్యలో ఉంటుంది. నెయ్యిలో వనస్పతిని కలపడం నేరమైనా కొందరు చౌక ధర పేరిట వనస్పతి కలిపిన కల్తీ నెయ్యిని అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక రెండో రకం.. నెయ్యిలో చనిపోయిన జంతువుల కొవ్వును కలిపి కల్తీ చేయడం. దీన్ని తక్కువ ధరకు అమ్ముతుంటారు. కిలో 50 రూపాయలకే ఎక్కడపడితే అక్కడ అమ్మేస్తుంటారు. గత ప్రభుత్వంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో ఈ రెండు రకాల వెజిటబుల్ వనస్పతి, జంతువుల కొవ్వును కలిపిన నెయ్యిని వాడినట్టు నిపుణులు చెబుతున్నారు.

కల్తీ జరిగే తీరు ఇదీ

వనస్పతితో పాటు వేరుశనగ, నువ్వుల వంటి నూనె గింజల ఉత్పత్తుల నుంచి తీసే వెజిటబుల్స్ ఆయిల్స్‌ను నెయ్యిలో కలుపుతున్నారు. అలాగే మరింత కారుచౌకగా లభించే జంతు కొవ్వు పదార్థాల నుంచి తీసే నూనెను శుద్ధి చేసి, నెయ్యిలో కలిపితే.. ఎవరికీ అనుమానం రాదని అంటున్నారు. జంతు మాంసం, రక్తం వాసన కోల్పోయే వరకు శుద్ధి చేస్తే.. ఈ నూనెను నెయ్యిలో కలిపే అవకాశం ఉంటుంది. ఇలాంటి శుద్ధి కేంద్రాలు రాష్ట్రంలో చెప్పుకోదగ్గ స్థాయిలో లేవు. ఇతర రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. కిలో నెయ్యిలో పావు కిలో కలిపితే మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు అమ్మినా గిట్టుబాటు అవుతుంది. తిరుమల ప్రసాదం కోసం సరఫరా చేసిన నెయ్యిని ఇదే తీరులో కల్తీ చేసి ఉంటారన్న అనుమానాలున్నాయి. జంతు వ్యర్థాలను సేకరించే వ్యక్తులు, సంస్థలు ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక వంటి ఇతర రాష్ట్రాల్లో ఉన్నాయి. వాటి నుంచి నెయ్యి సరఫరా సంస్థలు నూనె సేకరిస్తున్నట్లు తెలిసింది.

చరిత్రహీనుల్లా మిగిలిపోయేలా శిక్షిస్తాం

లడ్డూ అపవిత్రంపై చంద్రబాబు హెచ్చరిక



అమరావతి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): "దేశంలోనే అతి పవిత్ర క్షేత్రాల్లో తిరుమల ఒకటి. భక్తుల మనోభావాలు దెబ్బ తినేలా అక్కడ తప్పు చేసినవారు చరిత్ర హీనులుగా మిగిలిపోయేలా శిక్షిస్తాం" అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. లడ్డూ తయారీని అపవిత్రం చేశారన్న విషయం బయటకు వచ్చిన తర్వాత దీనిపై ఏం చేయాలన్నదానిపై అందరితో మాట్లాడుతున్నామని ఆయన చెప్పారు. తిరుమల లడ్డూకు వందల ఏళ్ల ప్రాశస్త్యం ఉందని, దానిని గత పాలకులు నాశనం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రసాదం లడ్డూను కాపీ కొట్టి తయారు చేయాలని అనేకమంది ప్రయత్నం చేశారు. కానీ ఎవరికీ అది సాధ్యపడలేదు. నేను అయోధ్యకు వెళ్లినప్పుడు అక్కడ బిహార్‌కు చెందిన ఒక ధర్మకర్త కలిశారు. తాను అయోధ్యలో నిర్మించిన ఆలయంలో తిరుమల తరహా లడ్డూ ప్రసాదాన్ని పెట్టాలని తిరుపతి నుంచి అనుభవం ఉన్నవారిని తీసుకువెళ్లి ప్రయత్నం చేశానని, కానీ ఆ రుచి రాలేదని ఆయన చెప్పారు. నెయ్యి నాణ్యతను ప్రతి రోజూ మూడు సార్లు పరీక్ష చేస్తున్నారన్న జగన్ వాదనను చంద్రబాబు ఎద్దేవా చేశారు. "తిరుమలలో అసలు ల్యాబ్ లేదు. మరి పరీక్షలు ఎలా చేస్తారు? జగన్ వెళ్లి చేశాడా?" అని అన్నారు.

సుప్రీంలో మరో పిటిషన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూ ప్రసాదం కలుషితం కావడంపై దర్యాప్తు జరిపించాలని హిందూ సేవా సమితి సంస్థ అధ్యక్షుడు సుర్జీత్ యాదవ్ శనివారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తిరుపతి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుతో కూడిన నెయ్యిని ఉపయోగించడం హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని, దీనిపై దర్యాప్తు చేసేందుకు సిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఆ ముగ్గురి వైపే అందరి వేళ్లు!

సుబ్బారెడ్డి, భూమన, ధర్మారెడ్డి హయాంలో

నిత్య వివాదాలమయంగా తిరుమల పాలన

వారి నిర్వాకమే 'లడ్డూ కల్తీ' అంటున్న భక్తులు

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)







తిరుమల పవిత్రతపై హిందూ భక్తుల్లో కలవరం రేగుతున్న నేపథ్యంలో వారి వేళ్లు ఆ ముగ్గురి వైపే మళ్లుతున్నాయి. మాజీ టీటీడీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర రెడ్డి, మాజీ ఇంచార్జి ఈవో ధర్మారెడ్డి ఐదేళ్లుగా వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్నారు. లడ్డూను అపవిత్రం చేసిన వ్యవహారంలో ఇప్పుడు..ఈ ముగ్గురిపైనే భక్తుల్లో ఆగ్రహజ్వాలలు రగులుతున్నాయి.

సుబ్బారెడ్డి : మాటే జీవో..

2019 మే 30న సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం చేసిన 21 రోజులకు ఆయన బంధువు వైవీ సుబ్బారెడ్డి టీటీడీ పాలకమండలి చైర్మన్‌గా నియమితులయ్యారు. 2021 ఆగస్టు 8న రెండవ దఫా కూడా ఆయనే చైర్మన్‌గా నియమితులై 2023 ఆగస్టు దాకా కొనసాగారు. జగన్ ఐదేళ్ల పాలనలో నాలుగేళ్లు ఆయనే చైర్మన్‌గా ఉన్నారు. సీఎం బంధువు కావడంతో దేవస్థానంలో ఆయన అధికారానికి అడ్డు లేకుండా పోయింది. అనుకున్నదే తడవుగా జీవోలు జారీ అయ్యేవి. ఈ క్రమంలో పలు అడ్డగోలు నియామకాలు జరిగాయని, బంధువులు, సొంత సామాజిక వర్గానికి చెందిన వారిని కీ పోస్టుల్లో నియమించారని అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉదాహరణకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ఐటీ విభాగానికి ఏమాత్రం అర్హత, అనుభవం లేని వ్యక్తిని హెడ్‌గా నియమించడం కలకలం సృష్టించింది. ఈయన హయాంలో చేపట్టిన ఎస్వీబీసీ సలహాదారుల నియామకాలు కూడా వివాదాస్పదమయ్యాయి.

భూమన : కుమారుడి కోసం నిధుల మళ్లింపు..

టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర రెడ్డి పనిచేసింది చాలా స్వల్ప కాలమే. 2023 సెప్టెంబరులో నియమితులైన ఆయన ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యే వరకూ 9 నెలలు ఆ పదవిలో ఉన్నారు. ఆ స్వల్ప వ్యవధిలోనే అవినీతి ఆరోపణలతో పాటు సొంత రాజకీయ ప్రయోజనాల కోసం టీటీడీని వాడుకున్నారన్న ఆరోపణలను ఆయన ఎదుర్కొన్నారు. కరుణాకర రెడ్డి కూడా అప్పటి సీఎం జగన్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. బంధుత్వం కూడా ఉంది. దీంతో దేవస్థానంలో ఆయన మాటకు ఎదురు లేకుండాపోయింది. ఇంజనీరింగ్ పనులకు భారీగా నిధుల కేటాయింపులు జరపడం వివాదాన్ని సృష్టించింది. టీటీడీ నిధులను తిరుపతి అభివృద్ధికి మళ్లించడం, టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు వంటి నిర్ణయాలు విమర్శలు మూటకట్టుకున్నాయి. తిరుపతి నుంచి అప్పట్లో ఎమ్మెల్యేగా పోటీఉన్న తన కుమారుడి రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి.

ధర్మారెడ్డి : వివాదాలపుట్ట

తొలినుంచీ వైఎస్ కుటుంబానికి సన్నిహితుడనే ముద్ర ఉన్న కేంద్ర ప్రభుత్వ మాజీ అధికారి ఏవీ ధర్మారెడ్డి గతంలోనూ టీటీడీలో రెండు పర్యాయాలు డిప్యుటేషన్‌పై పనిచేసి వివాదాస్పద పరిస్థితుల్లో తిరుగుముఖం పట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మూడోసారి మళ్లీ టీటీడీలోకి డిప్యుటేషన్‌పై వచ్చారు. 2019 జూలై 12న తిరుమల స్పెషల్ ఆఫీసర్‌గా జేఈవో పోస్టులో నియమితులైన కొద్ది రోజులకే ఆయన కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా అదనపు ఈవో పోస్టును సృష్టించింది. 2022 నవంబరులో ఈవో జవహర్‌రెడ్డి బదిలీ కావడంతో ఇంచార్జి ఈవోగా ధర్మారెడ్డి కొనసాగారు. మూడున్నరేళ్ల పాటు తిరుమలలోనూ, తర్వాత ఎన్నికల ఫలితాల వరకూ మొత్తం టీటీడీపైనా ఆయన పూర్తి పట్టు తెచ్చుకున్నారు. జగన్‌పై ఈడీ, సీబీఐ కేసులు ఉండడంతో న్యాయ వ్యవస్థ ప్రముఖులను ప్రసన్నం చేసుకునేందుకు శ్రీవారి దర్శనాలను ఆయుధంగా మలచుకున్నారనేది ఆయనపై ప్రధాన ఆరోపణ. దేవస్థానాల పాలనను గుప్పిట్లోకి తీసుకోవడంతో పాటు జియ్యంగార్ మఠాలు మొదలుకుని అర్చకులు సహా అన్ని విభాగాలనూ శాసించారు.

దంచికొట్టిన వాన

» హైదరాబాద్‌లో భారీ వర్షం

» రంగంలోకి డిజాస్టర్ బృందాలు



ముషీరాబాద్ అశోక్‌నగర్ ప్రధానరహదారిలో నిలిచిపోయిన వరదనీరు

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, కవాడిగూడ, సెప్టెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): ఉరుము తీవ్రమే.. మెరుపూ తీవ్రమే! ఈ రెండింటినీ తలదన్నేలా వాన!! ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్టుగా భారీగా కురిస్తే వాన మొదలైన క్షణాల్లో వరద పోటెత్తింది. పార్క్ చేసిన బైక్‌లు కొట్టుకుపోతాయేమో అన్నట్టుగా.. కార్లు సగం దాకా మునిగిపోయేలా వరద ఉధృతి కొనసాగింది. ఏది రోడ్డో.. ఏది గుంతో.. ఏది కాలువో తెలియనంతగా ఎటు చూసినా వరద కమ్మేసింది. హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం వరుణుడి ప్రకోపమిది! గంటకుపైగా వర్షం దంచికొట్టింది. ప్రధాన రాహదార్లలో మోకాలి లోతులో నీళ్లు నిలిచి చెరువులను తలపించాయి. దీంతో రహదారులపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలదైతే మరీ దయనీయ స్థితి. బస్తీలు, కాలనీల్లోకే కాదు.. ఇళ్లలోకి వరద పోటెత్తింది. ఖైరతాబాద్‌లోని ఎంస్‌మక్తా, బేగంపేట బ్రాహ్మణివాడి, లంగర్‌హౌస్, యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్ బి-బ్లాక్, లక్ష్మీనర్సింహనగర్ ప్రాంతాల్లో ఇళ్లలోకి వరదనీరు రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం రాత్రి 9 గంటల వరకు లంగర్‌హౌస్‌లో 9.1, ఖైరతాబాద్ గణాంకభవన్ వద్ద 8.6 సెం.మీ వర్షపాతం నమోదైంది.. బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి ప్రధాన రహదారిలో కిలోమీటర్ ప్రయాణానికి గంటకుపైగా సమయం పట్టింది. రోడ్లపై వరదనీరు భారీగా నిలిచిపోవడంతో తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ బృందాలు రంగంలోకి దిగి వరదనీటిని తొలగించాయి. వర్షంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు నెలకొనడంతో చీకట్లు కమ్ముకున్నాయి. ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో ఎక్కువ మంది మెట్రోను ఆశ్రయించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల వర్షం పడింది. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, మహబూబాద్ జిల్లాల్లో వర్షం పడింది. పిడుగుపాటుకు ఆదిలాబాద్ జిల్లా బేలలో రాథోడ్ అవినాశ్ (22) యువ రైతు మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం దిగ్వాల్‌లో 9.8 సెం.మీ వర్షపాతం నమోదైంది.

మరో నాలుగు రోజులు వర్షాలే..

రాష్ట్రానికి మళ్లీ భారీ వర్ష సూచన ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నాలుగు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈనెల 25 వరకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఆవర్తనం కారణంగా 23న వాయవ్య, దాని పరిసర పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది.

గంజాయి స్మగ్లర్‌గా ఐఐటీయన్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అతడో ఐఐటీ విద్యార్థి.. కానీ, మత్తుకు బానిసై ఉన్నత చదువులను వదిలేశాడు.. మరొకడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. రూ.లక్షల్లో జీతం.. కానీ, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి చేజేతులా పోగొట్టుకున్నాడు.. ఇంకొకడు లారీ డ్రైవర్.. సులభంగా డబ్బు సంపాదించాలని అక్రమ రవాణాకు తెగించాడు.. ఆఖరికి వేరే రాష్ట్రం కూలీ కూడా స్మగ్లర్‌గా మారాడు..! గంజాయికి లొంగిపోయి.. దాని అమ్మకాన్నే ఉపాధిగా మార్చుకున్న వీరంతా హైదరాబాద్‌లో పోలీసులకు చిక్కారు. ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన పవన్ పేరొందిన ఐఐటీ విద్యార్థి. స్నేహితుల ద్వారా గంజాయికి అలవాటు పడ్డాడు. చదువును మధ్యలోనే ఆపేశాడు. ఎస్ఆర్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ నెల్లూరు జిల్లాకు చెందిన కోలి మణికంఠ చౌదరితో కలిసి గంజాయి విక్రయించసాగాడు. ఎస్టీఎఫ్ టీమ్ హాస్టల్‌పై దాడి చేసి పవన్, మణికంఠను అరెస్టు చేసింది. 1.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుంది. 20 గ్రాముల గంజాయిని రూ.1000 చొప్పున విక్రయిస్తున్నట్లు తేలింది. నెల్లూరు జిల్లా అల్లంపాడు ప్రాంతానికి చెందిన లోకేష్.. హైదరాబాద్ మణికొండలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. లక్షకు పైనే జీతం వచ్చేది. అయితే, స్నేహితుల ద్వారా అలవాటైన గంజాయి వ్యసనంగా మారింది. విధులను నిర్లక్ష్యం చేయడంతో ఉద్యోగం పోయింది. దీంతో గంజాయి సరఫరాలో దిగాడు. కూకట్‌పల్లిలో ఉండే స్నేహితుడు శ్రీకాంత్ ద్వారా లోకేష్ సైతం స్మగ్లర్‌గా మారాడు. శ్రీకాంత్ వద్ద, ధూల్‌పేట నుంచి గంజాయి తెచ్చి తాను తీసుకుంటూ అమ్ముతున్నాడు. ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు.. లోకేష్ ఇంటిపై దాడి చేసి 1.75 కిలోల గంజాయిని పట్టుకున్నారు. శ్రీకాంత్‌నూ అరెస్టు చేశారు. వీరు కిలో గంజాయిని రూ.20 వేలకు విక్రయిస్తున్నట్లు ఎస్టీఎఫ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి తెలిపారు. కాగా, పవన్, లోకేష్ వద్ద గంజాయి కొన్న 22 మందిపై కేసులు నమోదు చేశారు.

అన్నవరం నుంచి హైదరాబాద్‌కు..

ఏపీలోని అన్నవరం నుంచి హైదరాబాద్‌కు హాష్ ఆయిల్‌ను సరఫరా చేస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు. నలుగురిని అరెస్టు చేసి 2.3 కేజీల హాష్ ఆయిల్ సహా.. రూ.21 లక్షల సరుకును స్వాధీనం చేసుకున్నారు. మీర్‌పేటకు చెందిన వటుల రంజిత్‌కుమార్ అలియాస్ నిఖిల్ డ్రైవర్. ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు గంజాయి, హాష్ ఆయిల్ రవాణాను ఎంచుకున్నాడు. స్నేహితులు బొల్లం సాయి నితిన్, బచ్చు నరేంద్ర, బోయిన్‌పల్లి సాయికృష్ణ, వినీత్‌తో ముఠా ఏర్పాటు చేశాడు. వీరంతా విశాఖ వెళ్లి సాయి అనే వ్యక్తి వద్ద హాష్ ఆయిల్‌ను కొని హైదరాబాద్‌కు తరలిస్తారు. కొంత కెమికల్ చేర్చి 5 ఎంఎల్, 10 ఎంఎల్‌గా సీసాల్లో నింపుతారు. 5 ఎంల్‌ను రూ.2-3 వేలకు విక్రయిస్తారు. రూ.లక్ష ఖర్చుతో రూ.10 లక్షలు సంపాదిస్తున్నారు. కాగా, ఫిబ్రవరిలో సరూర్‌గర్ ఎక్సైజ్ పోలీసులకు చిక్కి జైలుకెళ్లారు. బయటకు వచ్చిన అనంతరం ఈ నెల 16న వినీత్ మినహా.. మిగిలిన నలుగురు అన్నవరం వెళ్లారు. సాయి నుంచి 2.7 కేజీల హాష్ ఆయిల్‌ను కొని హైదరాబాద్‌లోని నితిన్ ఇంట్లో దాచిపెట్టారు. ఎస్‌వోటీ డీసీపీ మురళీధర్ పర్యవేక్షణలో ఎల్బీనగర్ ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడి, మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజు బృందంతో కలిసి దాడి చేసి 2700 గ్రాముల హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. బిహార్‌కు చెందిన సంతోష్‌కుమార్ బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చాడు. కేబుల్ వైర్ బిగించే కూలీగా పనిచేస్తున్నాడు. తనతో పనిచేస్తున్న కూలీలకు గంజాయి అలవాటు ఉండడంతో.. సంతోష్‌కుమార్ బిహార్‌లో సులభంగా దొరికే గంజాయి చాక్లెట్స్‌ను తెచ్చి విక్రయిస్తున్నాడు. ఒక్కో చాక్లెట్‌ను రూ.30 నుంచి 50కు అమ్ముతున్నాడు. మహేశ్వరం ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బృందం, ఆదిభట్ల పోలీసులతో కలిసి నిందితుడిని అరెస్టు చేసింది. గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకుంది.

మానవజాతి శాంతియుతంగా జీవించాలి

- యువత ప్రపంచానికి నాయకత్వం వహించాలి
- రాంచంద్రమిషన్ సేవలు ప్రశంసనీయం: ఉత్తమ్



నందిగామ, సెప్టెంబరు 21: మానవజాతి శాంతియుతంగా, సామరస్యంగా జీవిస్తూ సుస్థిరత కోసం కృషి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలో నిర్వహిస్తున్న 'అంతర్జాతీయ రైజింగ్ విత్ కైండ్‌నెస్' సదస్సులో మంత్రి ఉత్తమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచంలో మారుతున్న పరిస్థితులపై ఆందోళన నెలకొందని, కాలుష్యం, ఆర్థిక క్షీణతతో అనేక జాతులు తుడిచిపెట్టుకుపోతున్నాయన్నారు. ప్రపంచంలో ఆధిపత్యం చాలా చోట్ల కోసం ఘర్షణలు జరుగుతున్నాయని, సమాజం గమనించి శాంతియుతంగా ఉండాలన్నారు. రాజకీయ అస్థిరత నుంచి ప్రపంచాన్ని బయటకి లాగడానికి, శాంతియుత జీవనం, స్థిరత్వాన్ని ప్రోత్సహించడానికి యువత నాయకత్వ వహించాలన్నారు. మానసిక, భౌతిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక అంశాలపై ప్రజలకు బోధించడంలోనూ రాంచంద్రమిషన్ హార్ట్‌ఫులెనెస్ సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఆయన కొనియాడారు.

కాంగ్రెస్ నేతలు అర్బన్ నక్సల్సా?

- ప్రధాని మోదీ వ్యాఖ్యలు సరికావు: భట్టి

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నేతలను అర్బన్ నక్సల్స్, విభజనవాదులు, అవినీతిపరులు అని ప్రధాని మోదీ అనడం ఆయన స్థాయికి తగదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘమైన జాతీయోద్యమ నేపథ్యం, త్యాగాలు చేసిన చరిత్ర ఉందని శనివారం పేర్కొన్నారు. దేశ సమగ్రత, సమైక్యత, ప్రజాస్వామిక విలువల పరిరక్షణకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. కాగా మైనింగ్, గ్రీన్ పవర్ రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానించడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం అమెరికా, జపాన్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. 22 నుంచి అక్టోబరు 4 వరకు ఈ పర్యటన కొనసాగుతుంది.

వరద బాధితులకు తక్షణ సాయమందించండి

- సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ



హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులందరికీ తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ రాశారు. 'ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. ఖమ్మం, భద్రాచలం, మహబూబాబాద్, సూర్యాపేట, వరంగల్‌తో పాటు పలు జిల్లాల్లో వరద ఉధృతి బీభత్సాన్ని సృష్టించింది. అధికారిక లెక్కల ప్రకారం 33 మంది ప్రాణాలు కోల్పోయారు. రూ.5,438 కోట్ల ఆస్తి నష్టం, 4.25 లక్షల ఎకరాల్లో పంట నష్టం సంభవించింది. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలకు తగ్గకుండా సాయం చేయాలి. పూర్తిగా ఇళ్లు కొట్టుకుపోయిన వారికి రూ.10లక్షల సాయం, పంట నష్టం కింద ఎకరాకు మీరు గతంలో డిమాండ్ చేసినట్లుగానే రూ.25వేల సాయం అందించాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు. కాగా, సింగరేణి కార్మికుల దసరా బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం బోగస్ చేసిందని హరీశ్ విమర్శించారు. కార్మికులకు రూ.1550కోట్లు రావాల్సి ఉండగా.. రూ.795 కోట్లతోనే సరిపెట్టిందని ధ్వజమెత్తారు.

మరో 6 మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు

- కొత్త చైర్మన్, సభ్యులకు మంత్రి తుమ్మల శుభాకాంక్షలు



గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ సభ్యులను అభినందిస్తున్న తుమ్మల

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మరో 6 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం నూతన పాలకవర్గాలను నియమించింది. ఈమేరకు వ్యవసాయ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత కమిటీలతో కలిపి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 70 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలను ప్రభుత్వం నియమించింది. నూతనంగా నియమితులైన పాలకవర్గాల చైర్మన్లు, సభ్యులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. మిగిలిన కమిటీలను త్వరలోనే నియమిస్తామన్నారు. కాగా నూతనంగా నియమితులైన గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు.

వంద నియోజకవర్గాల్లో ఐటీఐలు

స్కిల్ వర్సిటీ పరిధిలోకి ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలు.. సమీక్షలో సీఎం ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హైదరాబాద్ మినహా వంద నియోజకవర్గాల్లో ఐటీఐ, ఏటీసీలు ఉండేలా కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కార్మిక, ఉపాధి శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఐటీఐ, ఏటీసీలు లేని నియోజకవర్గాలను గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు. వృత్తి నైపుణ్యం అందించే ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ), అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ), పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొచ్చేలా విధివిధానాలు తయారు చేయాలని సూచించారు. శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్‌తో కలిసి కార్మిక, ఉపాధి శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ కాలేజీల్లోనూ కొత్త ఏటీసీలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణమైన కోర్సులను ఐటీఐల్లో ప్రారంభించాలని, ఆయా కోర్సులకు అవసరమైన సిలబస్‌ను రూపొందించాలని ఆదేశించారు. సిలబస్ రూపకల్పనకు ఒక కమిటీని నియమించి, నిపుణులు, విద్యావేత్తల సలహాలు, సూచనలు స్వీకరించాలని సూచించారు. ఐటీఐ కాలేజీలను పర్యవేక్షించడంతోపాటు, క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రతి ఐటీఐకి ప్రిన్సిపాల్ ఉండేలా చూడాలని అన్నారు. ఈ సమీక్షలో సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా, కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో పూలమాల వేసి నివాళులర్పించారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్

దేశాన్ని కబళించే కుట్ర!

(మొదటిపేజీ తరువాయి)

కాపాడాల్సిన ఇలాంటి కీలక సమయంలో సీతారాం ఏచూరి మన మధ్య లేకపోవడం దేశ రాజకీయాలకు తీరని లోటు అని పేర్కొన్నారు. ఏచూరి స్ఫూర్తితో జమిలి ఎన్నికల వ్యతిరేక పోరాటంలో ముందుకు సాగుదామని రేవంత్ పిలుపునిచ్చారు. అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం రాజ్యాంగ సవరణలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భారత దేశం రాష్ట్రాల సమ్మిళితమని, ఆ స్ఫూర్తిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దెబ్బతీస్తోందని ధ్వజమెత్తారు. కేరళలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ప్రత్యర్థులైనా.. దేశంలో బీజేపీని ఎదిరించడానికి రెండు పార్టీలు కలిసి పనిచేసేలా సీతారాం కృషి చేశారని తెలిపారు. దేశ రాజకీయాల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని రగిలించడంతోపాటు ప్రజాస్వామిక వేదికలపై మన కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పారని రేవంత్ కొనియాడారు. బ్రతికి ఉన్నంతకాలం పేదల కోసమే పోరాడారని, మరణానంతరం కూడా ఆయన దేహాన్ని ప్రజాప్రయోజనాల కోసం వైద్య కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగించడం ఎంతో గొప్ప నిర్ణయమన్నారు. యూపీఏ హయాంలో పేదలకు ఉపయోగపడే కీలక బిల్లులకు మద్దతు తెలపడంలో ఏచూరి క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. రాహుల్‌గాంధీ ఏచూరిని తన మార్గనిర్దేశకుడిగా భావిస్తారని తెలిపారు. మోదీ క్యాబినెట్‌లో ఉన్న ఓ మంత్రి.. రాహుల్ గాంధీపై దారుణంగా వ్యాఖ్యలు చేసినా ప్రధాని ఖండించకపోవడం బీజేపీ ఫాసిస్టు విధానాలకు నిదర్శనమన్నారు.

సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తి ఏచూరి: కేటీఆర్

పదవుల చుట్టూ నేతలు తిరిగే ఈ కాలంలో.. కేవలం తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి నిలబడిన వ్యక్తి సీతారాం ఏచూరి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎప్పుడు ఏ కండువా మారుస్తారో తెలియని ఫిరాయింపుల కాలంలో ఒకే పార్టీకి కట్టుబడి ఉన్నారని కొనియాడారు. కమ్యూనిస్టులుగా తాము ఓట్ల రాజకీయంలో వెనుకబడినా.. ప్రజా పోరాటాల్లో, ప్రజల మనసుల్లో ముందున్నామని ఏచూరి చెప్పేవారని తెలిపారు. జేఎన్‌యూలో విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో ఇందిరాగాంధీని విశ్వవిద్యాలయ చాన్సలర్ పదవికి రాజీనామా చేయాలని చెప్పిన గుండె ధైర్యం ఉన్న వ్యక్తి ఏచూరి అని అన్నారు. ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ.. దేశంలోని విపక్ష పార్టీల మధ్య విభేదాలున్నా కలిసి పనిచేయాలంటూ వాటిని ఏకతాటిపైకి తెచ్చిన ఘనత సీతారాం ఏచూరిదని అన్నారు. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని, రాష్ట్రాల హక్కులపై దాడి చేస్తే దేశం సమైక్యంగా ఉండదని తెలిపారు. నేరస్థులను శిక్షిస్తే ఖర్చు పెరుగుతుందని.. చంపేస్తే ఖర్చు మిగులుతుందని హిట్లర్ చెప్పినట్లు ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న జమిలి ఎన్నికల ప్రయోగం కూడా ఇదే తరహాలో ఉందన్నారు. కాగా, సీతారాం ఏచూరి ఆశయాలకు పునరంకితం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. పార్టీల పరంగా తాము వేర్వేరు అయినా.. తమ సొంత నాయకుడు మరణించారన్నంత బాధ ఉందని అన్నారు. ఇటీవల ఏపీ ఎన్నికల సమయంలో సీతారాం ఏచూరితో కలిసి ప్రచారంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలకు పాతరేస్తున్న ఈ తరుణంలో ఏచూరి లేకపోవడం వెలితిగా ఉందన్నారు. పార్లమెంట్‌లో ఆయన ప్రసంగాలు దేశానికి గొప్ప సందేశాన్నిచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నేత పోటు రంగారావు, రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, సీతారాం ఏచూరి మేనమామ మోహన్ కందా, కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి పాల్గొని మాట్లాడారు. కాగా, వేదికపై కుర్చీ విషయంలో సీఎం సెక్యూరిటీ సిబ్బంది వ్యవహరించిన తీరుపట్ల మల్లు రవి అసహనం వ్యక్తం చేశారు.



సీతారాం ఏచూరి సంస్మరణ సభలో సీఎం రేవంత్, ఎంపీ మల్లు రవి, రాఘవులు, తమ్మినేని, కూనంనేని

టెండర్లు లేకుండానే పాల సరఫరా!

- విజయ డెయిరీపై విచారణకు సీఎం రేవంత్ ఆదేశం!

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీ నష్టాలు, గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన టెండర్లు సహా పలు అంశాలపై విచారణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. డెయిరీకి పాలు పోసే పాడి రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతమేర బిల్లులు బకాయిలు పెట్టింది? ప్రోత్సాహకాలు ఎంత ఇచ్చిందనే అంశాలను తేల్చాలని సూచించినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో నాటి మంత్రి హరీశ్‌రావు.. ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, ఆస్పత్రులకు టెండర్లు లేకుండానే పాలను సరఫరా చేయించారని, తన కుటుంబసభ్యులతో ప్రైవేటు డెయిరీని నిర్వహించారంటూ సీఎంకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. బీఆర్ఎస్ నేతలు పథకం ప్రకారమే విజయ డెయిరీని దెబ్బతీసేందుకు ప్రయత్నించారనే అనుమానాలున్నాయి. ఈ ఫిర్యాదులపై స్పందించిన సీఎం రేవంత్.. విజయ డెయిరీలో నష్టాలు, అందుకు దారితీసిన కారణాలు, అందులో ఎవరెవరి ప్రమేయం ఉందనే విషయాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించినట్లు సమాచారం.

వేర్వేరు సమయాల్లో హాజరైన రేవంత్, కేటీఆర్

సీతారాం ఏచూరి సంస్మరణ సభకు ప్రత్యర్థి పార్టీల నేతలైన సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వేర్వేరు సమయాల్లో హాజరయ్యారు. ప్రస్తుతం రెండు పార్టీల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో రేవంత్, కేటీఆర్ ఒకే వేదికపైకి రావడం ఆసక్తి రేకెత్తిచింది. ఇరు పార్టీల కార్యకర్తలు రవీంద్రభారతికి భారీగా చేరుకున్నారు. అయితే కేటీఆర్ ఉదయం 11:30 గంటలకు వచ్చి.. తన ప్రసంగం ముగిసిన వెంటనే వెళ్లిపోయారు. ఆ తరువాత మధ్యాహ్నం 12:30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి వచ్చారు.

ప్రభుత్వ ప్రాధాన్యాలు భేష్

- రాష్ట్రానికి సహకరించేందుకు సిద్ధం
- రేవంత్‌తో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి విషయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యాలు బాగున్నాయని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ప్రశంసించింది. శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి.. విద్యా, వైద్య, సాగునీటి రంగాలను తమ ప్రభుత్వం ప్రాధాన్యంగా పెట్టుకుందని ఆ బృందానికి సీఎం వివరించారు. ఆయా రంగాల్లో తాము తీసుకుంటున్న చర్యల గురించి చెప్పారు. తాము ప్రాధాన్యంగా తీసుకుంటున్న ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. విద్యా వైద్య రంగాల్లో సీఎం రేవంత్ దార్శనికత బాగుందని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రతినిధి బృందంలోని మార్టిన్‌రైజర్ ప్రశంసించారు. ప్రపంచ బ్యాంకు ఏయే రంగాలను ప్రాధాన్యాంశాలుగా ఎంచుకుందో అవే అంశాలను తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యాంశాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి సహకరించేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని పేర్కొన్నారు. ఆగస్టులో వాషింగ్టన్‌లో ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు అజయ్‌బంగాతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తదుపరి చర్చల కోసం ప్రపంచ బ్యాంకు దక్షిణాసియా ఉపాధ్యక్షుడు మార్టిన్‌రైజర్ నేతృత్వంలో వరల్డ్ బ్యాంక్ ఇండియా ఆపరేషన్ హెడ్ పాల్ ప్రోసీ, అర్బన్ ఇన్‌ఫ్రా, ప్రాజెక్టు లీడ్ నటాలియా, డిజిటల్ డెవలప్‌మెంట్ సీనియర్ స్పెషలిస్ట్ మహిమాపత్ రే శనివారం సీఎం రేవంత్‌ను కలిశారు.



ప్రపంచబ్యాంకు ప్రతినిధితో సీఎం రేవంత్‌రెడ్డి

ప్రసవానికి వారం ముందే ఆస్పత్రులకు తరలింపు!

- గిరిజన ప్రాంత గర్భిణుల కష్టాలు తీర్చేలా చర్యలు: దామోదర

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లోని గర్భిణుల ఇబ్బందులు తొలగించేందుకు సర్కారు నడుం బిగించింది. ఈడీడీ(ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్) కంటే వారం రోజుల ముందే వారిని సమీప ఆస్పత్రులకు తరలించాలని నిర్ణయించింది. ఆస్పత్రుల్లో వారు ఉండేందుకు ప్రత్యేకంగా బర్త్ వెయిటింగ్ రూమ్‌లను కేటాయించనున్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం అధికారులను ఆదేశించారు. వైద్య సదుపాయాల్లేక గిరిజన ప్రాంతాల్లోని గర్భిణులు పడుతున్న వెతలపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు వచ్చిన నేపథ్యంలో సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో వైద్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ ఐటీడీఏల పరిధిలో ఉన్న ఆస్పత్రుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, వాటి అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. తనిఖీల వివరాలను ప్రతి నెలా తనకు నివేదిక రూపంలో అందించాలని సూచించారు. ఆరోగ్య శాఖలోని అన్ని విభాగాధిపతులు నెలకు కనీసం రెండు సార్లు జిల్లాల్లోని ఆస్పత్రులను సందర్శించాలని, అటెండెన్స్, ఎక్విప్‌మెంట్, మెడిసిన్, శానిటేషన్, డైట్ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అన్ని ఆస్పత్రుల్లో అవసరమైన మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ఆస్పత్రుల్లో పాలన గాడిలో పెట్టేందుకు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాలనా వ్యవహారాల పర్యవేక్షణ బాధ్యతను హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చేసిన వైద్యులకు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. వీరి జాబ్ చార్ట్ ఎలా ఉండాలనే అంశంపై నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వారంలోగా నివేదిక ఇవ్వనుంది. దాని ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. మంత్రి దామోదర నిర్వహించిన సమీక్షలోనూ ఈ అంశం చర్చకు వచ్చింది. సర్కారీ దవాఖానాల్లో పారిశుధ్యం, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విషయాల్లో వస్తున్న ఫిర్యాదుల పరిష్కారం కోసం హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చేసిన వైద్యులకు పాలనా పగ్గాలు అప్పగించడంపై చర్చించారు. వారిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ పర్యవేక్షణ ఉంటుందని వైద్య వర్గాలు చెబుతున్నాయి.

అమృత్‌లో అవినీతిని నిరూపిస్తే రాజీనామా!

(మొదటి పేజీ తరువాయి)

అవుతుందని పొంగులేటి ప్రస్తావించారు. రూ.8,888 కోట్ల ఫిగర్ ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. నేరుగా నిధులు మంజూరు చేసినట్లు ఉత్తర్వులు వచ్చాయా? అని ప్రశ్నించారు. మిడిమిడి జ్ఞానంతో విమర్శలు చేయవద్దని హితవు పలికారు. పదేళ్ల పాటు అబద్ధాలతో ప్రజలను వంచించారని, ప్రతిపక్షంలో కూడా అబద్ధాలు ఆడితే ఈ హోదా కూడా పోతుందని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు పురపాలక మంత్రిగా పనిచేసిన కేటీఆర్ ప్రస్తుత పురపాలక మంత్రి అయిన ముఖ్యమంత్రిపై దురుద్దేశ పూర్వకంగా తప్పుడు ఆరోపణలకు పాల్పడ్డారని, వాటిని నిరూపించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ప్రకటించారు. పరువునష్టం దావా కూడా వేస్తామన్నారు. రాష్ట్రంలో 98 ప్రాంతాల్లో పనులు చేసేందుకు 2023 సెప్టెంబరు 20న గత ప్రభుత్వం టెండర్లు పిలిచిందని పొంగులేటి తెలిపారు. తెల్లవారితే పోలింగ్ ఉండగా నవంబరు 29న ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే రూ.3,515 కోట్ల బిడ్‌ను ప్రభుత్వం తెరిచిందని చెప్పారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే లోపే 3.99 శాతం అదనానికి మూడు కంపెనీలకు కట్టబెట్టిందన్నారు. మూడింటిలో ఒకటి ఆంధ్రప్రదేశ్ వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ఆర్ అని, మరొకటి గజా కన్‌స్ట్రక్షన్, మూడోది మేఘా అని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రీ టెండర్లు

డిసెంబరు 7న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ టెండర్ల విషయం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో వాటిని రద్దు చేసి.. పాత ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారమే మళ్లీ టెండర్లు పిలిచామని పొంగులేటి వెల్లడించారు. కేఎస్ఆర్ జాయింట్ వెంచర్, ఇంకొకటి ఏఎమ్మార్ ఇండియా లిమిటెడ్, సోదా కంపెనీలకు టెండర్లు దక్కాయని వివరించారు. కేటీఆర్ ఆరోపించినట్లు సోదా కంపెనీ ఎండీ సృజన్‌రెడ్డి సీఎం సొంత బావమరిది కాదని తెలిపారు. గతంలో అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి మారినందుకు అల్లుడు సృజన్‌రెడ్డికి పాలమూరు-రంగారెడ్డి పనుల్లో రూ.2,300 కోట్ల విలువ జేసే 7వ ప్యాకేజీ పనులు బహుమతిగా ఇచ్చారని ఆరోపించారు. నిజానికి సృజన్‌రెడ్డి కేటీఆర్‌కే దగ్గరి మనిషి అన్నారు. సృజన్‌రెడ్డి మామ కందాళ ఉపేందర్‌రెడ్డి ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో పాలేరు నుంచి తన మీద పోటీ చేసి ఓడిపోయారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో 3.99 శాతం అదనపు అంచనాలతో టెండర్లు పిలిస్తే తమ ప్రభుత్వం దాన్ని 2.44 శాతానికి తగ్గించి టెండర్లు ఖరారు చేసిందన్నారు. గత పాలకులు చేసిన దానికంటే రూ.57 కోట్లు తక్కువకే టెండర్లు ఇచ్చామన్నారు. వారికి టెండర్లు ఇచ్చేందుకు సీఎం ఎవరిని టెండర్లు వేయవద్దని కానీ, ఎవరిని బెదిరించింది కానీ లేదన్నారు. నిబంధనల మేరకే పనులు అప్పగించామన్నారు.

సీఎం బావమరిదికి 8,888 కోట్ల టెండర్!

కేంద్ర ప్రభుత్వ 'అమృత్' పథకంలో భారీ అక్రమాలు.. అర్హతలు లేకపోయినా సృజన్‌రెడ్డి సంస్థకు కాంట్రాక్టు

- రేవంత్ పదవి పోవడం ఖాయం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సకుటుంబ సపరివార అవినీతి కథా చిత్రమ్ నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి ఆధీనంలో ఉన్న పురపాలక శాఖ ద్వారా కేంద్రం అమలు చేస్తున్న 'అమృత్' పథకంలో భారీగా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సీఎం బావమరిది సృజన్‌రెడ్డికి చెందిన సంస్థకు ఏకంగా రూ.8,888కోట్ల విలువైన టెండర్‌ను అక్రమంగా కట్టబెట్టారని ఆరోపించారు. రేవంత్ బావమరిది, తమ్ముడికి అమృతం.. తెలంగాణ ప్రజలకు విషం అన్నట్లుగా అమృత్ టెండర్ల వ్యవహారం ఉందన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. అమృత్ టెండర్లలో సీఎం కుటుంబం అవినీతికి పాల్పడిందనడానికి తన వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి బావమరిది సూదిని సృజన్‌రెడ్డికి సంబంధించిన శోధా కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్‌కు అర్హతలు లేకపోయినా వేల కోట్ల రూపాయల పనులను కట్టబెట్టారని విమర్శించారు. "మాకు అందిన సమాచారం ప్రకారం మొత్తం 8 ప్యాకేజీల్లో టెండర్లు ఖరారయ్యాయి. నిర్మల్, నల్లగొండ, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో ఈ ప్యాకేజీల కింద పనులు జరిగాయి. ప్రస్తుతం ఒక్క ప్యాకేజీలోని అక్రమాలనే మేం బయట పెడుతున్నాం. ఇందులో సీఎం స్వయంగా జోక్యం చేసుకుని ఇండియన్ హ్యూమ్ పైప్ (ఐహెచ్‌పీ) అనే కంపెనీకి రూ.1137కోట్ల విలువైన టెండర్‌ను కట్టబెట్టారు. కానీ.. ఆ కంపెనీ తాము 20%పనులే చేస్తామని, మిగతావి వేరే కంపెనీ చేస్తుందని.. పేర్కొంటూ సెబీకి సమాచారం ఇచ్చింది. ఐహెచ్‌పీని శిఖండిలా అడ్డుపెట్టుకొని రేవంత్‌రెడ్డి, సూదిని సృజన్‌రెడ్డి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు"అని విమర్శించారు. గత ఏడాది కేవలం రెండు కోట్ల లాభాలు సాధించిన కంపెనీకి వెయ్యి కోట్లకుపైె పనులు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. బావమరిది కళ్లలో సంతోషం చూడడం కోసం రేవంత్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని, తన ఇంట్లో లంకె బిందెలు నింపుకోవడం కోసం అక్రమ టెండర్లకు తెరలేపారని ధ్వజమెత్తారు. "ఇవి కేంద్ర ప్రభుత్వం పైసలు. వారు విచారణ జరిపితే అన్ని విషయాలు పూసగుచ్చినట్లు వెలుగులోకి వస్తాయి. వాస్తవానికి బీజేపీ ఎమ్మెల్యేనే ఈ విషయం బయట పెట్టారు. ఆధారాలు దొరికిన తర్వాతే మాట్లాడాలని మేము ఇన్ని రోజులు ఆగాం" అని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ.. రాహుల్, రేవంత్(ఆర్, ఆర్) ట్యాక్స్ గురించి మాట్లాడారని గుర్తు చేస్తూ.. ఇప్పుడు తాము ఆధారాలతో చెప్తున్నామని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి లేఖ రాశామని, టెండర్లలో జరిగిన అక్రమాలను తేల్చాలని కోరామని తెలిపారు. ఈ అంశంపై కేంద్రం స్పందించి.. చర్యలు తీసుకుంటే రేవంత్ పదవి పోవడం ఖాయమని అభిప్రాయపడ్డారు. ఇక నుంచి ధారావాహికగా ఒక్కో కుంభకోణం వివరాలు వెల్లడిస్తామన్నారు. ముచ్చర్లలో ఏర్పాటు చేసేది ఫోర్త్ సిటీ కాదని, ఫోర్ బ్రదర్స్ సిటీ అని విమర్శించారు. కొడంగల్ ఎత్తిపోతల పథకంలో అక్రమాలు, హైడ్రా పేరిట బెదిరింపులు.. ఇలా అన్ని విషయాలు బయటపెడతామన్నారు.

ఫార్మాసిటీ రద్దు కాలేదు

- రద్దయినట్లు వచ్చిన వార్తలు నిజం కాదు
- ఇప్పటికీ అమల్లోనే 2016 నాటి ఫార్మాసిటీ జీవో 31
- హైకోర్టులో రెవెన్యూ ముఖ్యకార్యదర్శి అఫిడవిట్

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రతిపాదించిన ఫార్మాసిటీ రద్దు కాలేదని రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ స్పష్టం చేశారు. గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొంటూ.. హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. గతంలో చేపట్టిన భూసేకరణ రద్దు కాలేదని.. సేకరించిన భూములను మళ్లీ పిటిషనర్ల పేరుతో రెవెన్యూ రికార్డులను సవరించడం సాధ్యం కాదని అందులో స్పష్టం చేశారు. "ఫార్మాసిటీని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుందని పేర్కొంటూ పత్రికల్లో కథనాలు వచ్చాయి. భూసేకరణ కూడా రద్దయిందనే పిటిషనర్ల వాదనలో నిజం లేదు. ఆ వాదనను ప్రభుత్వం తిరస్కరించింది. వార్తాపత్రికల కథనాలను పిటిషనర్లు సమర్పించారు. అవి ఎప్పటికీ సాక్ష్యాధారాలు(ఎవిడెన్స్)గా పనికిరావు. అవి కేవలం 'హియర్ సే ఎవిడెన్స్'లు మాత్రమేనని పలు సందర్భాల్లో కోర్టు తీర్పులున్నాయి. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామం వద్ద హైదరాబాద్ ఫార్మాసిటీ ఏర్పాటుకు సంబంధించిన 2016 జూన్ 10న పరిశ్రమల శాఖ ఇచ్చిన జీవో 31 రద్దు కాలేదు. ఇప్పటికీ అది అమల్లోనే ఉంది. ఆ జీవోను అమలుచేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పిటిషనర్లు పేర్కొంటున్నట్లుగా భూసేకరణ ప్రొసీడింగ్స్‌కు కాలం చెల్లిపోలేదు. నూతన భూసేకరణ చట్టం-2013 ప్రకారం భూసేకరణ చేపట్టిన నేపథ్యంలో సదరు భూములకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరగవు. లావాదేవీలకు సంబంధించిన స్లాట్‌లు బుకింగ్‌లకు ఆస్కారం ఉండదు. గ్రీన్ ఫార్మాసిటీ కోసం ఇప్పటికే మెజారిటీ భూముల సేకరణ పూర్తయింది. ప్రస్తుత దశలో ఈ కోర్టు(సింగిల్ బెంచ్) జోక్యం చేసుకుంటే రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉద్దేశించిన గ్రీన్ ఫార్మాసిటీ ప్రాజెక్టుపై తీవ్ర వ్యతిరేక ప్రభావం ఉంటుంది. పిటిషనర్ల భూములను సేకరించి.. పరిహారానికి సంబంధించిన అవార్డు జారీచేశాం. పరిహారం మొత్తాలను కాంపిటెంట్ అథారిటీ వద్ద ఇప్పటికే డిపాజిట్ చేశాం. చట్టప్రకారం అవార్డు పాస్ చేసిన తర్వాత కూడా సదరు పరిహారం మొత్తాలను స్వీకరించడంలో పిటిషనర్లు విఫలమయ్యారు. భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ గత ఏడాది సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశాం. ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇప్పటికీ అమల్లోనే ఉంది. డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ప్రస్తుత దశలో జోక్యం చేసుకుంటే ఇబ్బందుల తలెత్తుతాయి. ఈ పిటిషన్‌లను కొట్టివేయండి" అని కౌంటర్ అఫిడవిట్‌లో కోర్టుకు విజ్ఞప్తి చేశారు.

842 యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ దవాఖానాల్లో 842 యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇందులో 421 పోస్టులను పురుష అభ్యర్థులతో, మరో 421 పోస్టులను మహిళా అభ్యర్థులతో కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. అర్హత గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 24 నుంచి ఇంటర్వ్యూలకు హాజరుకావాలని అధికారులు సూచించారు.

బర్కత్‌పుర పీఎఫ్ ఆఫీసుకు కేంద్ర మంత్రి


మీడియాతో మాట్లాడుతున్న మాండవీయ

బర్కత్‌పుర/రవీంద్రభారతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బర్కత్‌పురలో ఉన్న పీఎఫ్ కార్యాలయాన్ని కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ శనివారం సందర్శించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈపీఎఫ్ తెలంగాణ జోన్‌లో ఏటా రూ.7,797కోట్ల చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు. యువ ఉద్యోగుల కోసం కేంద్రప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ఎంప్లాయిమెంట్ లింక్ట్ ఇన్సెంటివ్(ఈఎల్ఐ) పథకాన్ని ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ పథకం కింద.. మొదటిసారి ఉద్యోగంలో చేరే యువతీయువకులకు ఒక నెల వేతనాన్ని ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందిస్తుందన్నారు. కాగా, రిటైర్డ్ పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించాలని భవిష్యనిధి పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు నాగేందర్ తదితరులు ఈ సందర్భంగా కేంద్రమంత్రిని కోరారు.

ఆధునిక రోబోలతో వెన్నెముక సర్జరీలు

» కచ్చితత్వంతో స్ర్కూల అమరికకు వీలు: వైద్యుల వెల్లడి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆధునిక రోబోలకు మరింత కచ్చితత్వం ఉండడంతో వెన్నెముక శస్త్రచికిత్సల్లోనూ ఉపయోగించే వీలు కలిగిందని పలువురు వైద్యులు పేర్కొన్నారు. న్యూరో స్పైనల్ సర్జన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇక్కడ నిర్వహించిన సదస్సులో వెన్నెముక శస్త్రచికిత్సలో అత్యాధునిక పద్ధతులపై చర్చించారు. సుమారు 450 మందికి పైగా వైద్యులు హాజరైన సదస్సు వివరాలను కిమ్స్ ఆస్పత్రి సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రాహి శనివారం మీడియాకు తెలిపారు. లోపలి భాగాలను మైక్రోస్కోప్‌తో మరింత పెద్దగా చూసి శస్త్రచికిత్స చేసేవాళ్లమని, ఇప్పుడు ఆధునిక రోబోలతో కచ్చితమైన దిశలో స్ర్కూలు అమర్చడం తేలికైందన్నారు. వర్క్‌షాప్‌లో ఇటలీ నుంచి తెచ్చిన మోడళ్ల మీద మూడు కంపెనీలకు చెందిన రోబోలతో శస్త్రచికిత్సలు చేయిస్తూ వివరించారన్నారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే రౌడీషీట్

» ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తే సహించం: ఎండీ సజ్జనార్

హైదరాబాద్, తార్నాక, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసుల సహకారంతో రౌడీషీట్లు తెరుస్తామని టీజీఆర్టీసీ ఎండీ సజ్జనార్ హెచ్చరించారు. ఉస్మానియా వర్సిటీ చౌరస్తాలో కొంత మంది దుండగుల చేతిలో తీవ్రంగా గాయపడి తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ దారవత్ గణేశ్‌ను శనివారం సజ్జనార్ పరామర్శించారు. శుక్రవారం అఫ్జల్‌గంజ్ నుంచి ఘట్‌కేసర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆరుగురు దుండగులు ఆపి డ్రైవర్ గణేశ్‌పై దాడి చేశారని తెలిపారు. డ్రైవర్‌ను దుర్భాషలాడుతూ తీవ్రంగా కొట్టారన్నారు. దీనిపై ఉస్మానియా వర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారని తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా దాడులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. గణేశ్‌కు పూర్తి అండగా ఉంటామని సజ్జనార్ హామీ ఇచ్చారు.

ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడండి

» పీఏసీ సభ్యులకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచన

» అరికెపూడి అధ్యక్షతన జరిగిన తొలి సమావేశం

హైదరాబాద్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధుల వ్యయంలో అవకతవకలు, లోపాలు ఎత్తి చూపుతూ ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలంటూ అసెంబ్లీ ప్రజా పద్దుల కమిటీ(పీఏసీ) సభ్యులకు స్పీకర్ ప్రసాద్ కుమార్ సూచించారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడాలన్నారు. శనివారం పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ అధ్యక్షతన కమిటీ తొలి సమావేశం జరిగింది. ఇందులో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఉద్దేశించి స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. పీఏసీ బాధ్యతలు మిగిలిన కమిటీలతో పోలిస్తే భిన్నంగా ఉంటాయన్నారు. ఈ కమిటీ అన్ని ప్రభుత్వ శాఖలపైనా సమీక్ష నిర్వహించవచ్చునన్నారు. కాగా, పీఏసీ కమిటీకి తనను ఛైర్మన్‌గా నియమించినందుకు గర్వంగా భావిస్తున్నానని అరికెపూడి గాంధీ అన్నారు. పార్టీలకతీతంగా, నిష్పక్షపాతంగా పని చేస్తూ లక్ష్యాలు సాధించడంలో సమష్టిగా కృషి చేస్తామన్నారు. కాగా, పీఏసీ తొలి సమావేశాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. తాము అడిగిన ప్రశ్నలకు పీఏసీలో ఎలాంటి సమాధానం చెప్పడం లేదని, అందుకే వాకౌట్ చేశామని ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

ప్రధాన నిందితుడిని ఎప్పుడు పట్టుకుంటారు?

» ఫోన్‌ట్యాపింగ్ కేసులో పోలీసులకు హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా (ఏ-1) ఉన్న ప్రభాకర్‌రావును ఎప్పుడు పట్టుకుంటారని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఏ-1ను పట్టుకునే వరకు ఈ చిక్కుముడులన్నీ అలాగే ఉంటాయని, సమస్యలు పరిష్కారం కావాలని అభిప్రాయపడింది. ఈ కేసులో నాలుగో నిందితుడు (ఏ-4) అదనపు డీసీపీ తిరుపతన్న పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌లో వాదనల సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం వృత్తి ధర్మం నిర్వహించారే తప్ప ఎలాంటి ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడలేదని తెలిపారు. ప్రభుత్వం తరఫున పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ ఫోన్‌ట్యాపింగ్‌లో తిరుపతన్న భాగస్వామి అని తెలిపారు. ఈ కేసులో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉందని.. బెయిల్ ఇవ్వరాదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

కెనడాకు ప్రభాకర్ రావు..!

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు అమెరికా నుంచి మకాం మార్చినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ కేసు ప్రారంభంలో అనారోగ్య కారణాలతో చికిత్స కోసం అమెరికా వెళ్లిన ప్రభాకర్ రావు వీసా గడువు ముగియనుంది. దీంతో.. స్టాంపింగ్ కోసం ఆయన కెనెడా వెళ్లి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. కెనడా పరిసర దేశాల్లో ప్రభాకర్ రావు పర్యటించినట్లు అనుమానిస్తున్నారు. ఇదే కేసులో మరో నిందితుడు శ్రవణ్‌కుమార్‌పైనా నాంపల్లి కోర్టు ఇదివరకే నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. వారెంట్ అమలుపై దర్యాప్తు అధికారులను కోర్టు ప్రశ్నించగా.. విదేశాల్లో ఉన్న నిందితులను తిరిగి రప్పించడానికి కేంద్ర దర్యాప్తు సంస్థల సహకారం తీసుకుంటున్నట్లు వివరించారు. మరోవైపు.. హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్, ఈ కేసుపై దృష్టి సారించారు. వచ్చేవారం దర్యాప్తు అధికారులతో సమావేశం కానున్నారు. విదేశాల్లో ఉన్న నిందితులను వెనక్కి రప్పించడంలో సీవీ ఆనంద్‌కు మంచి ట్రాక్ రికార్డు ఉన్నట్లు విశ్రాంత పోలీసు అధికారులు చెబుతున్నారు.

తప్పుడు జవాబులిస్తే చర్యలు తప్పవు

నిర్మాణం పూర్తి కాకుండానే గ్యారెంటీల విడుదలనా?.. జస్టిస్ ఘోష్ ప్రశ్నల వర్షం

హైదరాబాద్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): 'విచారణలో దాపరికాలేమున్నాయి? పరస్పర అంగీకారంతో చర్చించాల్సిన అంశాలేంటి? మాతో వ్యవహరించాల్సిన తీరు ఇదేనా? కిందిస్థాయి సిబ్బందితో మీకు సంబంధాల్లేవా? క్రికెట్ జట్టు ఓడితే కెప్టెన్ బాధ్యుడు కాదా?' అంటూ నీటి పారుదల శాఖ అధికారులను కాళేశ్వరం కమిషన్ ప్రశ్నలతో ముంచెత్తింది. శనివారం క్వాలిటీ కంట్రోల్‌తో పాటు నిర్మాణంతో ముడిపడిన చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పూర్వ సీఈలు కలిపి 10 మందిని విచారించింది. ఐదు గంటల పాటు క్రాస్ ఎగ్జామిషన్ చేసింది. ఓ దశలో వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో కమిషన్‌కు క్షమాపణలు చెప్పారు. పలువురు అధికారులు జవాబులు చెప్పలేక నీళ్లు నమిలారు. 'అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలన్నీ వాస్తవమేనా? తప్పుడు సమాధానం చెబితే మీపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. చిక్కుల్లో పడొద్దు' అంటూ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ వీపీ వెంకటకృష్ణను నిలదీసింది. అఫిడవిట్‌లో 'పరస్పర అంగీకారం' అనే పదాలు ఎందుకు వాడారు? ఏ విధంగా వాడతారు? విచారణలో దాపరికం ఏముంది? అని తీవ్రంగా మందలించగా 'తప్పు జరిగింది.. క్షమించండి' అంటూ వెంకటకృష్ణ బదులిచ్చారు. నిర్మాణ సమయంలో ఎన్నిసార్లు బ్యారేజీల ప్రదేశాన్ని సందర్శించారు? అని అడగ్గా, ఆ సమయంలో తాను లేనని బదులిచ్చారు. క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు ఎవరు చేస్తారు? వారు సర్టిఫికెట్లు ఇచ్చారా? అని కమిషన్ ప్రశ్నించగా ఈఈ స్థాయి అధికారులే వెళ్లారని, ఆ సమాచారం లేదని బదులిచ్చారు.

బాల్ వేయకముందే సిక్సర్ కొడతారా?

బ్యారేజీల నిర్మాణం జరుగుతున్నప్పుడు వరంగల్ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈగా ఎన్నిసార్లు సందర్శించారు? అని హైదరాబాద్ సీఈ కె.దేవేందర్‌రెడ్డిని కమిషన్ ప్రశ్నించింది. జాతీయ డ్యామ్ సేఫ్టీ మధ్యంతర నివేదిక తర్వాత తీసుకునే చర్యలను పరిశీలించడానికే వెళ్లానని, అంతకుముందు తాను విధుల్లో లేనని ఆయన తెలిపారు. మరికొంతసేపు మాట్లాడటానికి ప్రయత్నించగా 'బాల్ వేయకముందే సిక్సర్ కొడతామంటే ఎట్లా? అడిగిన తర్వాతే జవాబులు చెప్పండి' అంటూ మందలించింది. 2020-24 దాకా క్వాలిటీ కంట్రోల్ బాధ్యతలు చూశారు కదా? అని ప్రశ్నించగా, 'మీరు చెబుతున్నారు' అనే పదాన్ని దేవేందర్‌రెడ్డి వాడారు. దీన్ని కమిషన్ తీవ్రంగా తీసుకుంది. 'పర్యవసానాలు అనుభవించడానికి సిద్ధంగా ఉన్నారా? మీరు చిక్కుల్లో పడతారు. కమిషన్‌ను ఉద్దేశించి మీరు చెబుతున్నారు అనే పదాలు వాడతారా? అనుచితంగా ప్రవర్తిస్తారా?' ఎవరి ఆదేశాలతో అఫిడవిట్ దాఖలు చేశారు? మీరు తప్పించుకోలేరు అని గట్టిగా మందలించింది.


కమిషన్ ఎదుట విచారణకు హాజరు కావడానికి వచ్చిన క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు

నిర్మాణాన్ని ఎన్నిసార్లు తనిఖీ చేశారు?

బ్యారేజీల నిర్మాణం జరుగుతున్నప్పుడు క్వాలిటీ కంట్రోల్ విభాగం పాత్ర ఏంటి? అని మాజీ చీఫ్ ఇంజనీర్ బి.వెంకటేశ్వర్లును కమిషన్ ప్రశ్నించగా 'నాణ్యమైన కాంక్రీట్ వాడుతున్నారా లేదా?' పరిశీలించడం వంటివి చేస్తామని బదులిచ్చారు. ఏమైనా ఉల్లంఘనలను గుర్తించారా? అని అడగ్గా పెద్దవేమీ జరుగలేదని, చిన్నచిన్నవి గుర్తించామని వెంకటేశ్వర్లు గుర్తు చేశారు. బ్యారేజీల నిర్మాణాన్ని ఎన్నిసార్లు తనిఖీ చేశారు? అని కమిషన్ ప్రశ్నించగా, రెండు, మూడు నెలలకు ఒకసారి అని సమాధానం ఇచ్చారు. 'పెన్ను కొంటే పనిచేస్తుందా? అని ఒకటికి రెండుసార్లు పరిశీలిస్తాం. అలాంటిది రూ.వేల కోట్లతో కట్టే బ్యారేజీ పట్ల సీఈగా మీ బాధ్యత ఇదేనా?' అని నిలదీశారు. ఎస్ఈ, ఈఈలు తనిఖీ చేస్తారని వెంకటేశ్వర్లు చెప్పినా.. సీఈగా మీకు బాధ్యత లేదా' అని ప్రశ్నలు సంధించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల క్వాలిటీ కంట్రోల్ తనిఖీల రికార్డులు ఉన్నాయా అని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.రఘురామ్‌ను కమిషన్ ప్రశ్నించగా.. తనిఖీలకు వెళ్లినప్పుడు ప్లేస్‌మెంట్ రిజిస్టర్‌లోనే వివరాలు రాస్తామని, రికార్డులన్నీ నిర్మాణ పనులు చూసే ఇంజనీర్ల వద్దే ఉంటాయని చెప్పారు. మేడిగడ్డను ఐఎస్ కోడ్ ప్రకారమే నిర్మించామని, వెంట తెచ్చుకున్న వందకు పైగా పేజీల రికార్డులను చదవబోయారు. దీంతో తమకు రెండు పేజీల అఫిడవిట్ ఇచ్చి, 100 పేజీల పైగా పుస్తకంతో వచ్చారేంటని కమిషన్ వ్యాఖ్యానించింది.

ఈఈ సర్టిఫికెట్ ఇచ్చారు.. నేను సంతకం చేశా.. మేడిగడ్డ పూర్తి కాకముందే నిర్మాణ సంస్థలకు బ్యాంకు గ్యారెంటీలను ఎందుకు చెల్లించారు? పూర్తయినట్లుగా సర్టిఫికెట్లు ఎందుకు ఇచ్చారు? లోపానికి బాధ్యత (డిఫెక్ట్ లయబిలిటీ) వ్యవధి ముగియకముందే ఎలా ఇస్తారు? టెండర్లను 2.7 శాతం (రూ.1,849 కోట్లకు) అధిక రేటు కోట్ చేసిన సంస్థకు అప్పగించడంలో బాధ్యులు ఎవరు?' అని గతంలో రామగుండం డివిజన్ ఈఈగా, తర్వాత ఎస్ఈగా పనిచేసిన బి.వెంకటరమణారెడ్డిని కమిషన్ ప్రశ్నించింది. ఒప్పందంలో 'పనులు పాక్షికంగా పూర్తయినట్టు' అనే విషయం లేదు కదా? అని నిలదీయగా, నిజమేనని అంగీకరించారు. ఈఈ సర్టిఫికెట్ జారీ చేయగా తాను కౌంటర్ సంతకం చేశానని, పొరపాటు జరిగిందని బదులిచ్చారు. ఎవరి ఆదేశాలతో మేడిగడ్డ, ఇతర బరాజ్‌ల నిర్మాణం చేపట్టారని కమిషన్ అడగ్గా, రాష్ట్ర ప్రభుత్వం అని వెంకటరమణారెడ్డి బదులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అంటే ఎవరని ప్రశ్నించగా, ప్రభుత్వ అధినేత అని జవాబిచ్చారు. బ్యారేజీలను నీటి మళ్లింపు కోసమే వాడాల్సి ఉండగా, అందుకు భిన్నంగా నిల్వ చేయాలని తమను ఆదేశించారని మరో ప్రశ్నకు బదులిచ్చారు.

అన్నారంలో చాలా సమస్యలున్నాయి

» ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యాదగిరి

అన్నారం బ్యారేజీ నిర్మాణంలో లోపాలు జరిగాయా? అని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యాదగిరిని కమిషన్ ప్రశ్నించగా "స్థలం ఎంపికలోనే లోపాలున్నాయి. బ్యారేజీ పూర్తయిన తర్వాత నీటిని ఎత్తిపోయడం.. తిప్పి కిందికి పంపించడం చేస్తున్నాం. వరదల అనంతరం ఎగువన, దిగువన భారీగా ఇసుక చేరుతుంది. మేడిగడ్డ సంఘటన తర్వాత అన్నారంలో సీపేజీలు బయటపడ్డాయి. దీంతో బ్యారేజీ గేట్లన్నీ ఎత్తి ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. ఇప్పుడు అన్నారం గేట్లు మూసివేయాలని అధికారులు చెబుతున్నా.. ఆ పరిస్థితి లేదు. గేట్ల కింద 4 మీటర్ల దాకా ఇసుక చేరింది" అని ఈఈ వివరించారు. 2019 వరదల అనంతరం సీసీ బ్లాకులు, లాంచింగ్ అప్రాన్లు చెల్లాచెదురయ్యాయా? కారణాలేంటి? అని కమిషన్ ప్రశ్నించగా.. "బ్యారేజీలు నీటి మళ్లింపు కోసమే. కానీ, నిల్వ చేయడం వల్లే సమస్యలు వచ్చాయి. సుందిళ్లలో ఎత్తిపోయాలంటే కనీసం 10-11 మీటర్ల మేర నీటిని నిల్వ చేయాల్సి ఉంటుంది. అన్నారం నుంచి సుందిళ్ల దాకా 31 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ వ్యవధిలో 32 నదులు కలుస్తాయి. అన్నారానికి 6 కిలోమీటర్ల ఎగువన మానేరు కలుస్తుంది. నియంత్రించడానికి వీల్లేని విధంగా వరద వస్తుంది. ఏటా చేరుతున్న ఇసుకను తొలగించడమే అతి పెద్ద సమస్య" అని ఈఈ యాదగిరి తెలిపారు.

టెండర్లను పెంచి కాంట్రాక్టర్‌కు అప్పగించడంలో తప్పు ఎవరిది? అని కమిషన్ అడగ్గా మౌనంగా ఉండిపోయారు. నిర్మాణ సమయంలోనే 3, 4, 5వ బ్లాకుల్లో లోపాలు బయటపడితే మరమ్మతులు చేశామన్నారు. నిర్వహణలో లోపం జరిగిందని అంగీకరించారు. కొవిడ్ సమయంలో బ్యాంకు గ్యారెంటీలను తిరిగి చెల్లించాలని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందని వెంకటరమణారెడ్డి, మహదేవ్‌పూర్ ఈఈ సీహెచ్ తిరుపతిరావు స్పష్టం చేశారు. బ్యాంకు గ్యారెంటీలను, పని పూర్తయినట్లు ధ్రువపత్రాలను తానే నిర్మాణ సంస్థకు ఇచ్చానని తిరుపతిరావు తెలియజేశారు.

కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే కేసీఆర్, జగన్ అధికారం కోల్పోయారు!

» అందుకే కార్యకర్తలకు మంత్రులు అందుబాటులో ఉండాలి

» జిల్లాలవారీ సమీక్షల్లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ దిశానిర్దేశం

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తలకు మంత్రులు అందుబాటులో ఉండాల్సిందేనని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలకు వెళ్లినప్పుడు విధిగా డీసీసీ కార్యాలయాలకు వెళ్లి కార్యకర్తలను కలిసి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పార్టీని, కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే ఇక్కడ కేసీఆర్, ఏపీలో జగన్ అధికారాన్ని కోల్పోయారని పేర్కొన్నారు. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగానే జిల్లాల్లో ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలని మంత్రులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అత్యధికం గా సీట్లు గెలుచుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. అప్పుడే క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతం అవుతుందన్నారు. ఇప్పటి నుంచే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. పార్టీ పరిస్థితిపై ఉమ్మడి జిల్లాల వారీగా సమీక్షా కార్యక్రమాలు గాంధీభవన్‌లో శనివారం ప్రారంభమయ్యా యి. తొలి రోజు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల సమీక్షలు జరిగాయి. మహేశ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఆయా జిల్లాల ఇన్‌చార్జి మం త్రులు, మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడారు. ప్రభుత్వ పథకాల కు సంబంధించి ప్రజల వరకు తీసుకెళ్లే బాధ్యత స్థానిక నేతలు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు. విపక్షాల దుష్ప్రచారాన్నీ తిప్పి కొట్టాలన్నారు. కాగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీని భుజాన మోసిన తమకు అధికార, ఇతర కార్యాక్రమాల్లో ప్రాధాన్యం దక్కట్లేదని, బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే దక్కుతోందంటూ పలువురు నాయకులు మహేశ్ కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ కొత్త నాయకులు రాకుంటే పార్టీ బలోపేతం ఎలా అవుతుందని ప్రశ్నించారు. కొత్త, పాత నాయకులు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. కష్టకాలంలో పార్టీని బతికించుకున్న నాయకులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కాగా, టీపీసీసీ కొత్త చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సీఎల్పీ ఆదివారం సన్మానించనుంది. కాగా మహేశ్‌గౌడ్‌ను బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య గాంధీభవన్‌లో శనివారం సన్మానించారు.


జిల్లాలవారీ సమీక్ష సమావేశాల్లో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్

అధికారులు.. మా మాట వినట్లేదు: ఎమ్మెల్యేల ఫిర్యాదు

తాము అధికారంలో ఉన్నామో, ప్రతిపక్షంలో ఉన్నామో అర్థం కావట్లేదని, జిల్లాల్లో అధికారులు తమ మాట వినట్లేదని మంత్రి సురేఖ సహా పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు టీపీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు ఇంకా తాము పాత గవర్నమెంటులోనే ఉన్నామన్నట్లుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్లలో బీఆర్ఎస్ హయాంలో వారు నియమించుకున్న అధికారులే కొనసాగుతున్నారని, వారు తమను లక్ష్యపెట్టట్లేదన్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతను ఇన్‌చార్జి మంత్రులకు మహేశ్ కుమార్‌గౌడ్ అప్పగించారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

» అఖిల భారత మహిళా అధ్యాపకుల సదస్సులో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

» స్త్రీ విజయం వెనుక పురుషుల సహకారం: సుధా మూర్తి


హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. నారీ శక్తికి తిరుగులేదని, మహిళలు ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవాలని పేర్కొన్నారు. ఏబీఆర్ఎస్ఎం(అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్), ఐసీఎస్ఎస్ఆర్ (భారతీయ సామాజిక శాస్త్ర పరిశోధనా మండలి) ఆధ్వర్యంలో ఓయూ ఆడిటోరియంలో శనివారం జరిగిన 'అఖిల భారత మహిళా అధ్యాపకుల సదస్సు - నూతన భారత దర్శనం' అనే కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించారు. అలాగే, డాక్టర్ వంగిపురం శ్రీనాథాచారి రచించిన 'జననం నీవే, జనని నీవే' అనే గీతాన్ని ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్య, పరిశోధన రంగాల్లో మహిళలకు నాయకత్వ అవకాశాలు పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పా ల్గొన్న ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, రాజ్యసభ సభ్యురాలు సుధా నారాయణ మూర్తి మాట్లాడుతూ.. ప్రతీ స్త్రీ విజయం వెనుక పురుషుల సహకారం ఉం టుందన్నారు. వృత్తి ఎంత ముఖ్యమో కుటుంబం కూడా అంతే ముఖ్యమని చెప్పారు. సమాజంలో మహిళల పాత్రపై కీలకోపన్యాసం చేశారు. ఇక, జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్షురాలు స్మృతి విజయ భారతి సయాని మాట్లాడుతూ కోల్‌కతా ఆర్జీకర్ ఆస్పత్రి ఘటనను ప్రస్తావించారు. దేశంలో ఎన్ని కఠిన చట్టాలు వచ్చినా మహిళలపై ఆగడాలు తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, జేఎన్‌యూ వీసీ ప్రొఫెసర్ శాంతిశ్రీ పండిట్ మాట్లాడుతూ మహిళలు తమకున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, దేశం నలుమూలల నుంచి ఈ సదస్సుకు హాజరైన 1600 మంది ప్రతినిధులకు మహిళా సాధికారత, డిజిటల్ అక్షరాస్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం అఖి ల భారత సంచాలకులు గుంతా లక్ష్మణ్ జీ, డాక్టర్ మంచు కొండ శైలజ తదితరులు పాల్గొన్నారు. కాగా, భారత్ సేవాశ్రమ్ సంఘ్, హైదరాబాద్ విభాగం సహకారంతో సోమాజిగూడలోని రాజ్‌భవన్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శనివారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న గవర్నర్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో వివిధ కోర్సులు

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్‌ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దర ఖాస్తు గడువు పొడిగించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీసెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు. డిగ్రీ ప్రోగ్రామ్‌లలో రెండు, మూడు సంవత్సరాలు; పీజీలో రెండో సంవత్సరం చదువుతున్నవారు; ఓల్డ్ బ్యాచ్ స్టూడెంట్స్ కూడా తమ ట్యూషన్ ఫీజులు చెల్లించవచ్చు.



డిగ్రీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత రెండేళ్ల ఐటీఐ/ఒకేషనల్ కోర్సులు చేసిన వారు, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంగ్లీష్ లేదా తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. బీఏ(పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ), బీఎస్సీ(బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ) కోర్సులు ఉర్దూ మీడియంలో కూడా అందుబాటులో ఉన్నాయి.

- బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ పూర్తిచేసినవారు; ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు అర్హులు.

పీజీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ(మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విధంగా సంబంధిత/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఉమెన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం.

- హ్యూమన్ రైట్స్ ప్రోగ్రామ్‌ను తెలుగు మాధ్యమంలో, మిగిలినవాటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదో తరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

విభాగాలు: ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్.

- ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.braou.ac.in

బెంగళూరు ఐఐఎంలో పీజీపీఈఎం

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంబీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ ఎంటర్‌ప్రైజ్ మేనేజ్‌మెంట్(పీజీపీఈఎం)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల వీకెండ్ ప్రోగ్రామ్. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. జాతీయ పరీక్ష స్కోర్/ఐఐఎంబీ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ఎంబీఏ డిగ్రీని ప్రదానం చేస్తారు.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎస్ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. 2025 మార్చి 31 నాటికి కనీసం నాలుగేళ్ల అనుభవం తప్పనిసరి. క్యాట్ 2024/జీమ్యాట్/జీఆర్ఈ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేదంటే ఐఐఎంబీ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

ఐఐఎంబీ ఎంట్రెన్స్ టెస్ట్: ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. క్వాంటిటేటివ్, వెర్బల్, లాజికల్, డేటా ఇంటర్‌ప్రిటేటివ్ ఎబిలిటీస్ అంశాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2025 జనవరి 22
- **ఐఐఎంబీ టెస్ట్ తేదీలు:** రౌండ్ 1 టెస్ట్ తేదీ-నవంబరు 17న; రౌండ్ 2 టెస్ట్ తేదీ-2025 ఫిబ్రవరి 2న
- **ఇంటర్వ్యూ సెంటర్:** బెంగళూరు
- **ఇంటర్వ్యూలు:** 2025 ఫిబ్రవరి 15, 16
- **వెబ్‌సైట్:** iimb.ac.in

సెంట్రల్ సెక్టార్ స్కాలర్‌షిప్



కేంద్ర ఉన్నత విద్యా శాఖ- కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థుల కోసం అందిస్తున్న సెంట్రల్ సెక్టార్ స్కాలర్‌షిప్ పథకానికి నోటిఫికేషన్ వెలువడింది. దేశవ్యాప్తంగా మొత్తం 82,000 స్కాలర్‌షిప్‌లు ఉన్నాయి. వీటిలో సగాన్ని మహిళలకు కేటాయించారు. ఆర్థికంగా కింది స్థాయిలో ఉన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులను ప్రోత్సాహించేందుకు ఈ స్కాలర్‌షిప్ పథకాన్ని ఉద్దేశించారు. ప్రస్తుతం డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సులు చేస్తున్నవారికి ఈ స్కీమ్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తారు. వివిధ రాష్ట్రాల్లో 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న జనాభా ప్రాతిపదికన స్టేట్ ఎడ్యుకేషన్ బోర్డులకు స్కాలర్‌షిప్‌లు కేటాయిస్తారు. వీటిని ఎస్ఈబీలు హ్యుమానిటీస్, సైన్స్, కామర్స్ విద్యార్థులకు 3:3:1 నిష్పత్తిలో అందిస్తాయి. ఈ పథకం సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ అభ్యర్థులకు కూడా వర్తిస్తుంది. ఆసక్తి గలవారు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో అప్లయ్ చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 80 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. ఏఐసీటీఈ/ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన కళాశాలలు/యూనివర్సిటీలలో డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. దూరవిద్య, కరస్పాండెన్స్ కోర్సుల్లో చేరినవారు; డిప్లొమా అభ్యర్థులు; ఇంటర్ తరవాత డ్రాప్ తీసుకున్న వారు; ఇతర స్కాలర్‌షిప్/ఫీ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం పొందుతున్న వారు దరఖాస్తుకు అనర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం నాలుగున్నర లక్షలకు మించకూడదు.

స్కాలర్‌షిప్: ఒక్కో విద్యార్థికి అయిదేళ్ల వరకు ఈ స్కాలర్‌షిప్ అందిస్తారు. డిగ్రీ నుంచి పీజీ స్థాయి వరకు ఏటా రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. డిగ్రీ లెవెల్లో మూడేళ్లపాటు ఏటా రూ.12,000; పీజీ లెవెల్లో రెండేళ్లపాటు ఏటా రూ.20,000 చెల్లిస్తారు. బీఈ/బీటెక్ కోర్సుల్లో చేరినవారికి మొదటి మూడేళ్లు ఏటా రూ.12,000; చివరి ఏడాది రూ.20,000 ఇస్తారు. అలాగే అయిదేళ్ల వ్యవధి గల ప్రొఫెషనల్/ఇంటిగ్రేటెడ్ కోర్సులు చేసేవారికి చివరి రెండేళ్లు ఏటా రూ.20,000 ఇస్తారు. స్కాలర్‌షిప్ మొత్తాన్ని అభ్యర్థి ఖాతాకు జమ చేస్తారు. చదువుతున్న కోర్సులో ఏటా 75 శాతం అటెండెన్స్, కనీసం 50 శాతం మార్కులు ఉంటేనే రెన్యువల్ అవకాశం లభిస్తుంది.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో టీచర్లు



దేశంలోని వివిధ కంటోన్మెంట్స్, మిలిటరీ స్టేషన్లలోని 139 ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ దరఖాస్తులు కోరుతోంది.

తెలుగు రాష్ట్రాల్లో ఆర్మీ పబ్లిక్ స్కూళ్లున్న ప్రాంతాలు: సికింద్రాబాద్(ఆర్‌కేపీ), సికింద్రాబాద్(బొల్లారం), గోల్కొండ.

1. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ)
2. ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)
3. పీఆర్‌టీ(ప్రైమరీ టీచర్)

సబ్జెక్టులు: బయాలజీ, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లిష్, జాగ్రఫీ, హిస్టరీ, హిందీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, సైకాలజీ, సంస్కృతం, ఫిజికల్ ఎడ్యుకేషన్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్, పీజీ, డీఈఎల్ఈడీ, బీఈఎల్ఈడీ, బీఈడీ, బీపీఈడీ ఉత్తీర్ణతతో పాటు, సీటెట్, టెట్ అర్హత తప్పనిసరి.

వయో పరిమితి: 2024 ఏప్రిల్ 1 నాటికి ఫ్రెషర్స్ 40 ఏళ్లలోపు, అనుభవజ్ఞులైన అభ్యర్థులు 57 ఏళ్లలోపు ఉండాలి.

ఎంపిక విధానం: ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ, టీచింగ్ స్కిల్స్, కంప్యూటర్ ప్రావీణ్యం, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్

దరఖాస్తు రుసుము: రూ.385

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 25

పరీక్ష తేదీలు: నవంబరు 23, 24

ఫలితాల వెల్లడి: డిసెంబరు 10

వెబ్‌సైట్: https://awesindia.com

జాబ్ కార్నర్

ఐఐసీటీలో ప్రాజెక్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ)... తాత్కాలిక ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 26

- ప్రాజెక్ట్ అసోసియేట్-1: **7 పోస్టులు**
- ప్రాజెక్ట్ అసోసియేట్-2: **2 పోస్టులు**
- ప్రాజెక్ట్ అసిస్టెంట్-1: **5 పోస్టులు**
- ప్రాజెక్ట్ అసిస్టెంట్-2: **7 పోస్టులు**
- ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ అసోసియేట్:**1**
- ప్రాజెక్ట్ అసోసియేట్-1/ప్రాజెక్ట్ అసోసియేట్-2: **4 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, ఎమ్మెస్సీ, ఎంఫార్మసీ, నెట్/గేట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్-1 పోస్టుకు రూ.25,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్-2కు రూ.20,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్-1కు రూ.18,000; ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.49,000; ప్రాజెక్ట్ అసోసియేట్-2కు రూ.28,000.

గరిష్ఠ వయోపరిమితి: ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుకు 40 ఏళ్లు; ఇతర పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్

ఇంటర్వ్యూ తేదీలు: సెప్టెంబరు 27, 30

వేదిక: ఐసీఎంఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ), హైదరాబాద్.

వెబ్‌సైట్: www.iict.res.in/

రైట్స్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్లు

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 15

పోస్టుల వివరాలు

1. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీ(మెకానికల్ ఇంజనీరింగ్): **10 పోస్టులు**
2. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ): **5 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్-2024 స్కోరు తప్పనిసరి.

వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ, గేట్-2024 స్కోర్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.300.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 24

వెబ్‌సైట్: https://www.rites.com/

నార్మ్‌లో యంగ్ ప్రొఫెషనల్ ఖాళీలు

రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్ - నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(ఎన్ఏఏఆర్ఎం)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

ఖాళీలు: 2

అర్హత: అగ్రికల్చరల్ సైన్స్, ఎకనామిక్స్, అగ్రిబిజినెస్‌లో పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.42,000

వయోపరిమితి: 21 నుంచి 45 ఏళ్లు ఉండాలి.

ఇంటర్వ్యూ తేదీ: అక్టోబరు 4

వేదిక: ఐసీఏఆర్ - ఎన్ఏఏఆర్ఎం, రాజేంద్రనగర్, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://naarm.org.in/home/

ఎన్ఐసీహెచ్‌డీఆర్‌లో ఖాళీలు

న్యూఢిల్లీలోని ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ అండ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. కన్సల్టెంట్(నాన్ మెడికల్): **1 పోస్టు**
2. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-2(ఎక్స్-రే టెక్నీషియన్): **1 పోస్టు**
3. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-1: **2 పోస్టులు**

అర్హత: టెన్త్, ఇంటర్మీడియట్, డిప్లొమా, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు కన్సల్టెంట్ పోస్టుకు రూ.70,000. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-2కు రూ.20,000. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-1కు రూ.18,000.

వయోపరిమితి: కన్సల్టెంట్ పోస్టుకు 70 ఏళ్లు, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ పోస్టుకు 28 నుంచి 30 ఏళ్లు మించకూడదు.

పని ప్రదేశం: స్టేట్ టీబీ సెల్, జీఎంఎస్‌హెచ్ సెక్టార్-16, చండీగఢ్.

ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 25

వేదిక: స్టేట్ టీబీ సెల్, జీఎంఎస్‌హెచ్ సెక్టార్-16, చండీగఢ్.

వెబ్‌సైట్: https://main.icmr.nic.in/

చెడు సావాసం

అనగనగా అడవిలో ఒక తోడేలు ఉండేది. దానికి అడవిలో వేటాడాలంటే బద్ధకం. రాత్రులు అడవికి దగ్గర్లోఉన్న గ్రామానికి చాటుగా వెళ్లి,అక్కడి కాపరులకు తెలియకుండా మేకలను, గొర్రెలను ఎత్తుకొచ్చి, తింటూ ఉండేది. పక్కనేఉన్న చెట్టు మీద నివసించే కోతి ఒకటి తోడేలు చేసే పనులన్నీ ఆసక్తిగా గమనిస్తూ ఉండేది. ఇది తెలుసుకున్న తోడేలు ఇంకా తనెంత తెలివైనదో, ఎలా గొర్రెల కాపరుల కన్నుగప్పి, గొర్రెలను ఎత్తుకొస్తున్నదో కథలు కథలుగా వర్ణించి చెప్పేది. ఇలా కొన్నాళ్లు విన్నాక, కోతి తోడేలును ఇలా అడిగింది. 'మిత్రమా..నీ సాహసం వింటూ ఉంటే నాకు కూడా ఒక రోజు రాత్రి నీతో పాటు వచ్చి నీ సాహసాన్ని చూడాలనున్నది.నన్ను కూడా ఒక రోజు నీతో పాటు తీసుకుపోవూ?' అని అడిగింది.




ఆ మాటలు విన్న తోడేలు తన గొప్పతనానికి మురిసిపోతూ, 'అయ్యో దానికేం భాగ్యం? అలాగే. రేపే నిన్ను నాతో తీసుకువెళతాను అన్నది. అన్నట్టుగానే ఆ రోజు రాత్రి తోడేలు కోతిని తీసుకుని ఎప్పటిలాగే మేకలను దొంగతనం చేయడానికి వెళ్లింది. అంతకుముందు కొన్ని రోజులుగా తమ మందలలో గొర్రెలు, మేకలు ఉన్నట్టుండి మాయం అవుతుండటం గమనించుకున్న గ్రామస్థులు రాత్రివేళల్లో కాపలాగా తిరిగేటందుకు కొందరు యువకులను నియమించారు.

ఈ విషయం తెలియని తోడేలు అలవాటుగా గొర్రెల మంద దగ్గరికి వెళ్లగానే అక్కడే సిద్ధంగాఉన్న కాపలా యువకులు కర్రలతో తోడేలును కొట్టి చెట్టుకు కట్టేసారు ఆ సందడిలో కోతికి కూడా కర్రతో దెబ్బలు బాగానే పడ్డాయి.ఆ దెబ్బలు తట్టుకోలేక కోతి 'మీ గొర్రెలను ఎత్తుకెళుతోంది నేను కాదు కదా ఈ తోడేలు రోజూ మీ మందలలో మేకలు, గొర్రెలను మాయం చేస్తోంది.నన్ను ఎందుకు కొడుతున్నారు?'అని గట్టిగా కేకలు పెట్టింది.

దానికి ఆ గ్రామస్థులు 'నువ్వు దొంగతనం చేయకున్నా, చేసే తోడేలుకు సాయంగా వచ్చావు కాబట్టి, నీకు కూడా శిక్ష పడాల్సిందే'అన్నారు కాసేపటికి తోడేలును అక్కడే వదిలి, కోతి నెమ్మదిగా చెట్ల కొమ్మలలో దాగి అక్కడి నుండి తను ఉండే చోటికి వెళ్లిపోయింది. తాను తప్పు చేయకున్నా చెడు సావాసం చేయడంవలన తనకు దెబ్బలు తగిలిన విషయం గుర్తు పెట్టుకున్న కోతి ఇకపై అలాంటి పనులు చేసే వారితో స్నేహం చేయకూడదనుకుంది.


7 తేడాలను కనిపెట్టండి





కుక్కలు ఎన్ని?

దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 416

	1				8		9	5
4	3					8		
	8	6						
			6	4				7
	4		8		7		2	
8				9	3			
						7	3	
		4					1	9
9	5		7				4	

సుడోకు - 415 సమాధానం

2	5	1	8	9	4	7	3	6
6	9	3	2	5	7	1	8	4
7	8	4	6	1	3	9	5	2
3	6	8	9	4	5	2	1	7
9	7	2	3	6	1	5	4	8
1	4	5	7	2	8	6	9	3
5	1	7	4	3	6	8	2	9
4	2	6	1	8	9	3	7	5
8	3	9	5	7	2	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.